అన్ని పరిమితులూ దాటుతున్నారు

- ఫెడరల్ నిర్మాణాన్ని ఉల్లంఘిస్తున్నారు
ఇడిపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- టిఎఎస్ఎంఎసిపై దర్యాప్తు నిలుపుదల

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 289 | విజయవాడ, శుక్రవారం 23 మే 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 23 May 2025 | Rs

మిచెల్ మార్ష్ శతకం

- గుజరాత్‌పై లక్నో గెలుపు

8

బతకడం కోసం..

రాష్ట్రం నుండి భారీగా వలసలు • తరలివెళ్లిన 12 లక్షల కుటుంబాలు

విశాఖ, నెల్లూరు నుంచి అధికం • ప్రభుత్వ సర్వేలో వెల్లడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రం నుండి లక్షలాది కుటుంబాలు వలసబాట పడుతున్నాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలు మృగ్యం కావడం, పనులు దొరికినా అరకొరగానే ఉండటంతో బతకడానికి మరో మార్గం లేక అత్యధిక కుటుంబాలు రాష్ట్రాన్ని వీడుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 12 లక్షల కుటుంబాలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లినట్లు తేలింది. రాష్ట్రంలోనే ఇతర జిల్లాలకు వలస వెళ్లిన కుటుంబాల సంఖ్య కూడా లక్షల్లోనే ఉంది. వలసవెళ్లిన వారిలో మెరుగైన జీవనం కోసం వెళ్లినవారు కూడా ఉన్నారని అధికారులు చెబుతున్నప్పటికీ, ఆ తరహా కుటుంబాల సంఖ్య నామమాత్రమే అని సమాచారం ఎక్కువ మంది ఉపాధి అవకాశాల కోసమే పొరుగు రాష్ట్రాల బాట పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రాష్ట్రంలో 1.71 కోట్ల కుటుంబాలు నివశిస్తున్నాయి.

వాటి పూర్తి వివరాలు సేకరించేందుకు, ఆయా కుటుంబాల్లో ఇతర పరిస్థితులను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పి4 కార్యక్రమంలో భాగంగా కొద్ది కాలంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 1.49 కోట్ల కుటుంబాల వివరాలు సేకరించగా, అందులో దాదాపు 14 లక్షల కుటుంబాలు ఆచూకీ లభ్యం కాలేదు. స్థానికులు అందించిన వివరాల మేరకు ఈ మొత్తంలో 1.77 లక్షల మంది రాష్ట్రంలోనే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా, ఏకంగా 12,59,631 కుటుంబాలు ఇతర రాష్ట్రాలకు వెళ్లినట్లు తేలింది.



వలసలు ఇలా...

జిల్లా	మొత్తం నివాసం ఉండే కుటుంబాలు	ఇతర జిల్లాలకు	ఇతర రాష్ట్రాలకు
విశాఖ	6,49,705	10,390	1,12,861
నెల్లూరు	**8,59,330**	**10,717**	**85,428**
ప్రకాశం	7,87,433	7,473	68,718
తిరుపతి	**7,29,522**	**3,421**	**67,911**
పల్నాడు	7,11,380	7,862	62,922
అనంతపురం	**7,60,194**	**4,417**	**59,519**
ఎన్టీఆర్	7,42,170	16,028	58,588
కృష్ణా	**6,24,499**	**3,900**	**58,349**
అన్నమయ్య	5,57,941	1,258	57,929
గుంటూరు	**7,46,506**	**18,264**	**57,171**

నిర్మాణ రంగం కుదేలు కావడంతో...

భారీ స్థాయిలో వలసలు ఉండటానికి ఉపాధి కొరతే కారణమని అధికారయంత్రాంగం కూడా ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. రాష్ట్రంలో కొన్నేళ్లుగా నిర్మాణ రంగం కుదేలైపోయిన సంగతి తెలిసిందే. దీంతో భవన నిర్మాణ రంగ కార్మికులతో పాటు, ఆరంగంపై ఆధారపడిన ఇతర కుటుంబాలు కూడా అనివార్యంగా వలస బాట పడుతున్నారు. ప్రధానంగా కర్నాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు ఎక్కువగా తరలిపోతున్నారని చెబుతున్నారు. ఆర్థిక రాజధానిగా పేరొందిన విశాఖతో పాటు నెల్లూరు జిల్లాలో అత్యధిక వలసలు నమోదు అయ్యాయి, విశాఖ పట్నంలో 72.8 లక్షల కుటుంబాలు ఉన్నట్లు లెక్కలు చెబుతుండగా, అందులో ఇప్పుడు 1.13 లక్షల కుటుంబాలు ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లినట్లు గుర్తించారు. నెల్లూరు జిల్లాలో కూడా 8.59 లక్షల కుటుంబాలకుగాను 85 వేలకుపైగా కుటుంబాలు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోయినట్లు గుర్తించారు.కడప, తిరుపతి, పల్లాడు, ఎన్టీఆర్, కర్నూలు, కృష్ణా, కాకినాడ, గుంటూరు, అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో కూడా పెద్ద సంఖ్యలో కుటుంబాలు బతకడం కోసం వలసవెడుతున్నాయి.

రాజధాని జిల్లాల్లోనూ వలసలే

అమరావతి రాజధాని ప్రాంతంగా ఉన్న గుంటూరుతో పాటు రాష్ట్ర స్థాయి ప్రభుత్వ కార్యాలయాలు పెద్ద సంఖ్యలో ఉన్న ఎన్టీఆర్ జిల్లాల్లో కూడా వలసల సంఖ్య ఎక్కువగానే ఉంది. గత ఆరేళ్లుగా ఈ ప్రాంతాల్లో ఎటువంటి నిర్మాణ పనులు జరగకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు చెబుతున్నారు. ఈ రెండు జిల్లాల్లో కలిపే ఏకంగా 1,50 లక్షల కుటుంబాలు వలస వెళ్లినట్లు తేలగా, అందులో ఇతర రాష్ట్రాలకు వెళ్లిన కుటుంబాలే

అత్యంత అమానుషం

మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండించిన సిపిఎం

న్యూఢిల్లీ : చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుసహా 27మంది మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. చర్చలు జరపాలంటూ మావోయిస్టులు పదే పదే విజ్ఞప్తులు చేసినా వాటిని పట్టించుకోకుండా, కేంద్ర ప్రభుత్వం, అలాగే చత్తీస్‌గఢ్‌లోని బిజెపి ప్రభుత్వం రెండూ చర్చల ద్వారా పరిష్కారాన్ని ఎంచుకోకూడదని నిర్ణయించుకున్నాయని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో విమర్శించింది. అందుకు బదులుగా హత్యలు, వినాశనం అనే అత్యంత అమానవీయమైన విధానాన్ని ఆ ప్రభుత్వాలు ఎంచుకున్నాయని పేర్కొంది. గడువును పునరుద్ఘాటిస్తూ కేంద్ర హోం మంత్రి, చర్చలు జరపాల్సిన అవసరం లేదంటూ చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు మనుషుల ప్రాణాలను తీయడాన్ని కూడా సెలబ్రేట్ చేసుకునే ఫాసిస్ట్ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని, ఇది ప్రజాస్వామ్య వ్యతిరేకమని సిపిఎం స్పష్టం చేసింది. చర్చల కోసం మావోయిస్టులు చేస్తున్న అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా పలు రాజకీయ పార్టీలు, సంబంధిత పౌరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల రాజకీయాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, చర్చల కోసం వారు చేసిన విజ్ఞప్తులను వెంటనే ఆమోదించి, అన్ని పారామిలటరీ కార్యకలాపాలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని సిపిఎం కోరుతోందని పొలిట్‌బ్యూరో ఆ ప్రకటనలో పేర్కొంది.

ఢిల్లీకి చేరుకున్న సిఎం

బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో చంద్రబాబు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. కేంద్ర రక్షణ, ఆర్థిక, జలశక్తి, ఎలక్ట్రానిక్స్- ఐటి శాఖలతో పాటు పలువురు ఇతర మంత్రులను కలిసి రాష్ట్ర అవసరాలను వివరిస్తారని సిఎం కార్యాలయ వర్గాలు తెలిపాయి. కేంద్ర హోం మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల్లో నూతన క్రిమినల్ చట్టాల అమలుపై జరగనున్న కీలక సమావేశంలోనూ, శనివారం జరగనున్న నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరవు తారు. అంతకుముందు బెంగళూరులోని కెంపెగౌడ విమానాశ్రయంలో కొత్తగా అభివద్ధి చేసిన టెర్మినల్-2ను సీఎం చంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా విమానాశ్రయం లోని సౌకర్యాలను అధికారులు సీఎంకు వివరించారు.

'ఎన్‌కౌంటర్' మృతదేహాలు
ఇవ్వడానికి నిరాకరణ ?

- **సుప్రీంను ఆశ్రయించనున్న కుటుంబ సభ్యులు**

చర్ల : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా, అబుజ్ మాడ్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృత దేహాలను కుటుంబసభ్యులకు అప్పగించడానికి పోలీసులు నిరాకరించినట్లు సమాచారం. దీంతో మృతుల కుటుంబసభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో 27 మంది మావోయిస్టులు మరణించడం. మృతి చెందిన వారిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజ్ ఉన్నట్లు పోలీసు అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో కేశవరావు సోదరుడు ఢిల్లీశ్వరరావుతో పాటు మరికొందరు మృతుల కుటుంబసభ్యులు కూడా గురువారం నారయణపూర్ జిల్లాకు చేరుకున్నట్లు సమాచారం. తమ వారి మృత దేహాలను అప్పగిస్తే అంతిమ సంస్కారాలు చేసుకుంటామంటూ వీరు చేసిన విజ్ఞప్తిని స్థానిక పోలీసులు తిరస్కరించినట్లు రకరకాల కారణాలు చెబుతున్నట్లు సమాచారం. ఎన్‌కౌంటర్‌పై ఇప్పటికే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో మృత దేహాలు ఇవ్వడానికి కూడా పోలీసులు నిరాకరిస్తుండటంతో మృతుల కుటుంబసభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నారని తెలిసింది. అత్యవసరంగా ఈ సంఘటనను విచారణ చేయాలని కోరుతూ శుక్రవారం నాడే పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉందని సమాచారం.

మృతదేహాల గుర్తింపు

ఈ సంఘటనలో మృతి చెందిన 27 మంది మావోయిస్టులను గుర్తించినట్లు డిజిపి అరుణ్‌దేవ్ గౌతమ్ తెలిపారు. వీరిలో 14 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్లు గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన చెప్పారు. మృతదేహాలతో పాటు భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. మృతి చెందిన 27 మందిలో ఇద్దరు తెలుగువారిని పోలీసులు గుర్తించారు. కేంద్ర కమిటీ సెక్రటరీ నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా జీయన్నపేటకు చెందినట్టు గుర్తించారు. మృతి చెందిన మరో తెలుగు మావోయిస్టు నేత, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మెంబర్‌గా ఉన్న వెంకట్ నాగేశ్వరరావు అలియాస్ యాసన్న అలియాస్ జంగు నవీన్. ఈయనది ప్రకాశం జిల్లాగా గుర్తించారు.

దేశవ్యాప్తంగా 103 అమృత్ స్టేషన్లు ప్రారంభం

- **దేశ ప్రజలకు అంకితం చేసిన మోడీ**
- **రూ.15 కోట్లతో సూళ్లూరుపేట అభివృద్ధి : పెమ్మసాని**

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసిన 103 రైల్వే స్టేషన్లను రాజస్థాన్ నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. వీటిని దేశ ప్రజలకు అంకితమిచ్చారు. ఇందులో తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్, వరంగల్, ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట స్టేషన్లు ఉన్నాయి. రూ.15 కోట్లతో అభివృద్ధి చేసిన తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుచూపుతో ఎన్‌డిఎ ప్రభుత్వంతో జతకట్టడంతో రాష్ట్రం డబుల్ ఇంజన్ స్పీడ్‌తో ముందుకు వెళ్తుందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అభివృద్ధి జరగకపోగా 20 సంవత్సరాలు వెనక్కి వెళ్లిందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో అటు అమరావతి, ఇటు పోలవరం పూర్తిచేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. వైసిపి నాయకులు చెప్పే అబద్ధపు మాటలను నమ్మవద్దని, టిడిపి కూటమి ప్రభుత్వం 20 సంవత్సరాలు అధికారంలో ఉంటే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మాజీ ఎమ్మెల్సీ వాకటి నారాయణరెడ్డి, మాజీ ఎంపి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దెబ్బల శ్రీమంత్ రెడ్డి, జనసేన పార్టీ ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

కొత్తగా ప్రారంభించిన సూళ్లూరుపేట రైల్వే స్టేషన్

మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై
సిబిఐ ఛార్జిషీట్

న్యూఢిల్లీ : కిరు జలవిద్యుత్ ప్రాజెక్టుకు రూ.2,200 కోట్ల సివిల్ పనుల టెండర్ ప్రక్రియలో అవకతవకలకు సంబంధించి జమ్ముకాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌సహా ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు సిబిఐ అధికారులు గురువారం ప్రకటించారు. వారిని నిందితులుగా పేర్కొంటూ ప్రత్యేక కోర్టు ఎదుట సిబిఐ నివేదికను సమర్పించింది. గత ఏడాది ఫిబ్రవరిలో మాలిక్, ఇతరుల ప్రాంగణాల్లో సిబిఐ సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. తనపై వచ్చిన సిబిఐ ఆరోపణలను అప్పట్లోనే సత్యపాల్ మాలిక్ ఖండించారు. జమ్ముకాశ్మీర్ గవర్నర్‌గా విధులు నిర్వహించిన సమయంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఫైల్‌తోపాటు మరో రెండు ఫైల్స్‌ను క్లియర్ చేయడానికి తనకు రూ.300 కోట్ల లంచం ఆఫర్ చేశారని అప్పట్లో పేర్కొన్నారు. పుల్వామాలో ఉగ్రదాడి సమయంలో జమ్మూకాశ్మీర్ గవర్నర్‌గా ఉన్న సత్యపాల్ మాలిక్ ప్రధాని మోడీపై విమర్శలు చేసిన తెలిసిందే. నిఘా వర్గాలు హెచ్చరించినప్పటికీ సిఆర్‌పిఎఫ్ జవాన్లను జమ్ము నుండి శ్రీనగర్ తీసుకొచ్చేందుకు విమానాలను పంపకపోవడం వల్లే పుల్వామా దాడి జరిగిందని విమర్శించారు. ఈ విషయంపై మౌనంగా ఉండాలని ప్రధాని, అజిత్ దోవల్ తనను హెచ్చరించినట్లు ఆయన చెప్పారు.

అన్ని రంగాల్లో విఫలం

- **రాష్ట్ర ప్రభుత్వంపై జగన్ విమర్శ**
- **జూన్4న 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసనలకు పిలుపు**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చంద్రబాబు నేతృత్వంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు, తాడేపల్లిలోని ఆయన నివాసంలో గురువార జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయపరిస్థితులు, నేతలు, అధికారులపై వేధింపుల తదితర అంశాలను ఆయన సుదీర్ఘంగా వివరించారు. ప్రభుత్వ హామీలను అమలు చేయాలని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడే సంస్థలు, సంఘాలు, మేధావులు, నిరుద్యోగుల ప్రజాస్వామ్య బద్ధంగా ప్రశ్నించే గొంతులను రాష్ట్ర ప్రభుత్వం నొక్కేస్తుందని విమర్శించారు. ప్రజలకిచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని, అందువల్ల . ఎన్నికల ఫలితాలు వెలువడిన జూన్ 4న "వెన్నుపోటు దినంగా" నిర్వహించాలని వైసిపి శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఆ రోజున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వినతిపత్రాలు అందజేయడంతో పాటు నిరసనలు తెలపాలని కోరారు.

ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన సూపర్ సిక్స్‌తో పాటు ఏ ఒక్క పథకం అమలు చేయకపోగా ఏడాదిలో సుమారు రూ.1,37,576 కోట్లు అప్పులు చేశారన్నారు. ఏడాది పాలనలో కూటమిపా లనలో అవినీతికి హద్దే లేకుండా పోయిందన్నారు. 2014-19 మధ్య లిక్కర్ స్కామ్ జరిగిందని 5 డిస్టలరీస్ నుంచి 69 శాతం మద్యం సరఫరా చేశారని, ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో మద్యం పాపులు ఉంచడంతో పాటు అన్ని మద్యం షాపుల్లో అప్పటి అధికార పార్టీ నేతల ప్రమేయం ఉందని చెప్పారు. ప్రివిలేజ్ ఫీజు రద్దుతో సుమారు రూ.5వేల కోట్ల నష్టం రాష్ట్ర ఖజానాకు వచ్చిందని, ఆ కేసులో సిఎం చంద్రబాబు బెయిల్‌పై ఉన్నాడన్నారు.

అమరావతి నిర్మాణం పేరుతో భారీ స్కామ్ : అమరావతి రాజధాని నిర్మాణ పనుల్లో అవినీతి భారీగా జరుగుతోందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. 2018లో టెండర్ల విలువ రూ.41,170.78 కోట్లు కాగా, అందులో రూ.5,587.28 కోట్లు పనులు జరిగాయన్నారు. మిగిలిన రూ.35,583 కోట్ల పనులు మిగిలిన వాటిని రద్దు చేసి మిగిలిన పనుల అంచనాలు పెంచి దోపిడీ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన జ్యుడీషియల్ విధానం, రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేశారన్నారు. టెండర్ ఇవ్వగానే 10శాతం అడ్వాన్స్ ఇచ్చి అందులో 8 శాతం కమీషన్ తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అమరావతిలో రోడ్లు,జాతీయరహదారుల నాలుగు లైన్లనిర్మాణం కోసం కిలోమీటరుకు రూ.11.16కోట్ల నుంచి రూ.14.42కోట్లు ఉండగా అదే అమరావతిలో కిలో మీటరుకు రూ.50కోట్లు ఖర్చు చేస్తున్నారని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక వైపు అమరావతి సెల్ఫ్‌ఫైనాన్స్ అంటూ ప్రపంచబ్యాంక్, ఎడిబి నుంచి రూ.15వేల కోట్లు, హడ్కోనుంచి రూ,11వేలకోట్లు, కెఎఫ్‌డబ్ల్యు (జర్మనీ) బ్యాంక్ నుంచి రూ.5వేలకోట్లు, సిఆర్‌డిఎ బాండ్ల నుంచి రూ.21వేకోట్ల వంతున రూ.52వేలకోట్లు అప్పులు చేశారన్నారు. ఇవి కాక బడ్జెట్ నుంచి రూ.6వేలకోట్లు కేటాయించారన్నారు. అప్పులు చేసి స్కాములు చేసే బదులు విజయవాడ -గుంటూరు మధ్య జాతీయ రహదారి పక్కన ఈ నిర్మాణాలు చేస్తే రెండు నగరాలు కలిసిపోతాయన్నారు.

శ్రీశైలం, సాగర్ నుంచి..
తెలంగాణకు 10.26 టిఎంసిలు

- **ఎపికి నాలుగు టిఎంసిలు**

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేసవి నీటి అవసరాల కోసం శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి తెలంగాణకు 10.26 టిఎంసిలు, ఎపికి నాలుగు టిఎంసిలు కేటాయించారు. త్వరలో నీటిని విడుదల చేయనున్నారు. ఈ మేరకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలంలో 800 అడుగులు, సాగర్‌లో 505 అడుగుల వరకు నీటిని వినియోగించుకోవచ్చని పేర్కొంది. ఎపి అవసరాల కోసం సాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 5500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని నిర్ణయించింది. అలాగే శ్రీశైలంలో జులై నెలాఖరు వరకు 800 అడుగుల కనీస మట్టం కొనసాగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ నెల ఐదున జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో తెలంగాణ అవసరాలకు సంబంధించి అధికారులు కెఆర్ఎంబికి స్పష్టంగా వివరించారు. ప్రత్యేకంగా లేఖను అందజేసిన విషయం విదితమే.

రేషన్ మాఫియాను అరికట్టేందుకే
ఎండియు వాహనాల తొలగింపు

- **రేషన్‌కార్డుల దరఖాస్తుకు గడువు లేదు**
- **నాదెండ్ల మనోహర్**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రేషన్ మాఫియాను అరికట్టేందుకే ఎండియూ వాహనాలను తొలగించామని రాష్ట్ర పౌరసరపరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. విజయవాడ కానూరులోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో గురువారం చౌక ధరల దుకాణాల అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రేషన్ కార్డుల దరఖాస్తుకు ఎలాంటి గడువూ లేదని, ఇది నిరంతర ప్రక్రియ అని మంత్రి పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రైస్‌కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. నూతన రేషన్ కార్డుల దరకాస్తు, మార్పులు చేర్పులు చేసేందుకు గడువు అంటూ ఏదీ లేదన్నారు. అర్హత ఉన్న వాళ్లు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. ప్రతి నెల ఒకటోతేదీ నుంచి ఐదో తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా వృద్ధులు, వికలాంగులకు రేషన్ సరుకులు వారి ఇంటివద్దనే అందించడం జరుగుతుందన్నారు. జూన్1 నుంచి చౌక ధరల దుకాణాల నుంచి రేషన్ సరుకులు అందించాలని, వినియోగదారుని దృష్టిలో పెట్టుకునిసేవా భావంతో పనిచేయాలన్నారు. ప్రతి రేషన్ షాపు వద్ద సిసి కెమెరా విధిగా ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని 30వేల మంది రేషన్ డీలర్లతో సివిల్ సప్లై కార్పొరేషన్‌కు అనుబంధం ఉందన్నారు. రేషన్ పంపిణీలో సాంకేతికను జోడించి రేషన్ పంపిణీని మరింత సులభతరం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పంపిణీ సక్రమంగా జరిగేందుకు వీలుగా కార్డుదారులకు గతంలో కంటే మెరుగైన సేవలందించడానికి వీలుగా రేషన్ డీలర్లు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కార్డులో ఒంటరిగా ఉన్న వృద్ధులు, వికలాంగులు రక్తసంబంధీకులున్న వారికి సంబంధించి ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రేషన్ పంపిణీలో కార్డుదారులకు ఇబ్బంది కలిగించే రీతిలో వ్యవహరించిన డీలర్లపై కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు పంపిణీ బాధ్యతలను విఆర్‌ఒలకు అప్పగిస్తామన్నారు. డోర్ డెలివరీ చేసే కార్డుదారులకు సంబంధించి ఇంటి వద్ద రేషన్ ఇవ్వడానికి కాటాతో సంబంధం లేకుండా ఇ పాస్‌లోనే వాళ్లకి సరుకులు అందే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. తక్కువ తూకం ఇచ్చినా ఎక్కువ ధరలు వసూలు చేసినటు వంటి వారిని తొలగిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనరు సౌరబ్‌గౌర్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో 15 శాతం వృద్ధి ఆర్భాటమే

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
వ్యవసాయ రంగంలో 15 శాతం వృద్ధి సాధిస్తామని చెప్పడం ప్రభుత్వ ఆర్భాటమే తప్ప ఆచరణలో సాధ్యం కాదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ పేర్కొంది. గత ఏడాది మిర్చి, పొగాకు, పత్తి, కొబ్బరి, కోకో, జీడి, కందులు, పెసలు, మినుములు, జొన్నలు, వంటి వాణిజ్య, ఆహార పంటల ధరలు అమాంతం పడిపోయి రైతులు తీవ్ర ఆందోళనలో ఉంటే ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా మార్కెట్ దోపిడీకి వదిలిపెట్టారని సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఏడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా సుమారు 150 మండలాల్లో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రమైన నష్టాలకు గురైనప్పటికీ, కృష్ణానది, బుడమేరు ముంపునకు గురైన రైతులకు కొంతవరకూ సాయం అందించి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతిన్న రాయలసీమ జిల్లాల్లో ఏ ఒక్క రైతుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించలేదన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్నా ఎక్కడా రైతులకు అవసరమైన విత్తనాలను అందించేందుకు వ్యవసాయ శాఖను సిద్ధం చేయకుండా, వ్యవసాయ ప్రణాళికలను సకాలంలో రూపొందించకుండా రైతులను గాలికి వదిలేసిన ప్రభుత్వం మాటలతో కాలం వెళ్లదీస్తుంది తప్ప రైతులను ఆదుకునే దిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. నకిలీ, కల్తీ విత్తనాల సమస్యను, ఎరువుల ధరల సమస్యను, ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలను కాపాడే అంశంపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని, రైతులందరికీ ఉచిత పంటల భీమాను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేల అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం తక్షణమే రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. మిర్చి, పొగాకు, కోకో, జీడి, మినుముల వంటి పంటల ధరలను నిలబెట్టి రైతులకు ధైర్యం ఇచ్చేందుకు అవసరమైన గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. పాత కౌలు చట్టంలో లోపాలను సవరించి కొత్త కౌలు చట్టం తీసుకురాలేదని, భూయజమానుల ప్రయోజనాలే తప్ప కౌలుదారుల ప్రయోజనాలు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు.

పోలీసుల సెలవుల రద్దు ఉపసంహరణ

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాధులు దాడి చేసిన నేపథ్యంలో ఈనెల 7నుంచి పోలీసులకు అత్యవసర వైద్యసేవలు మినహా మిగిలిన వారికి సెలవులు మంజూరును పోలీస్ శాఖ రద్దు చేసింది. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ప్రశాంతంగా ఉన్న నేపథ్యంలో సెలవుల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించినట్లు డిజిపి కార్యాలయం అన్ని జిల్లాల ఎస్‌పిలకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

సవరణ



విద్యార్థి దశ నుంచే.. శీర్షికన మొదటి పేజీలో ప్రచురించిన వార్తలో నంబాల కేశవరావు ఫైల్ ఫొటోకు బదులుగా అదే ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ ప్రచురణ సంస్థ 'జంగ్'కు చెందిన నవీన్ ఫొటో పొరపాటున ప్రచురితమైంది. నంబాల కేశవరావు యువకుడిగా ఉన్నప్పటి చిత్రం ఇది.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ లేదని ప్రకటన చేయించాలి

- షర్మిల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ లేదని చంద్రబాబు, పవన్ కేంద్రంతో ప్రకటన చేయించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ప్రధాని మోడీతో ఈ విషయంలో చర్చించాలన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఉక్కు కార్మికుల ఆందోళనలపై ఎందుకు మౌనం వహిస్తున్నారో చెప్పాలని కోరారు. ఇప్పటికే రెండువేల మందిని తొలగించారని, మరో మూడువేల మందిని తొలగించేందుకు యాజమాన్యం రంగం సిద్ధం చేసిందని అన్నారు. రెండు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని అన్నారు.

కార్మికులకు మద్దతుగా తాను దీక్ష చేస్తుంటే ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.11 వేల కోట్లలో అప్పుల పేరుతో రూ.8 వేల కోట్లు వెనక్కి తీసుకుందని, మిగిలిన మొత్తం ఇవ్వాలంటే ఐదు వేల మంది కార్మికులను తొలగించాలని షరతు విధించడంతో యాజమాన్యం ఈ చర్యలకు పాల్పడుతుందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములు ఇచ్చిన కుటుంబాల కార్మికులను తొలగించడం ఎంతవరకూ సమంజసమని ఆమె ప్రశ్నించారు. ఫ్యాక్టరీని అదాని, జిందాల్‌కు కట్టబెటేందుకు కేంద్రం కుట్ర పన్నుతున్నట్లు తెలిపారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్ష భగ్నం చేసినా ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. జగన్ హయాంలో మద్యం మాఫియాపై రోజూ థ్రిల్లర్ సిరీస్ తరహాలో కథనాలు వస్తున్నాయని తెలిపారు. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని అన్నారు. లిక్కర్ స్కామ్‌లో తప్పులేకుంటే అసెంబ్లీకి వెళ్లి మాట్లాడాలని, సిబిఐ విచారణ కోరాలని చెప్పారు.

అడుగడుగునా నిర్బంధం

- పోలీసు వలయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిసరాలు
- గ్రామాల్లోనూ బలగాల మోహరింపునకు ప్రభుత్వ నిర్ణయం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిసరాల్లో మూడో రోజు సమ్మె నేపథ్యంలో జైలు వాతావరణం కనిపించింది. 40 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఉక్కు పరిశ్రమలో ఎక్కడికక్కడ పోలీసు బలగాల మోహరింపు, ఖాకీల వాహనాల పరుగులతో ఉక్కు పరిసరాలు అట్టుడికిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకు పరిష్కారం చూపాల్సిందిపోయి పోలీస్ నిర్బంధాన్ని ప్లాంట్‌లోనూ, బయటా తీవ్రతరం చేసింది. పోలీసులు వందల సంఖ్యలో ఎక్కడికక్కడ గుమిగూడి కనిపిస్తుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టు కార్మికులను బెదిరిస్తూ, సమ్మె విరమించాలంటూ భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారని పలువురు చెప్పుకొచ్చారు. గతంలో ఎన్నడూ ప్లాంట్ లోపలకు రాష్ట్ర పోలీసులు ప్రవేశించలేదు. ఇప్పుడు ప్రతి డిపార్టుమెంట్ దగ్గరా కనిపిస్తున్నారు. సమ్మె చేస్తే అరెస్ట్ చేస్తామని బెదిరిస్తున్నారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ, కాంట్రాక్టు కార్మికుల్లో 4 వేల మందిని దశల వారీగా యాజమాన్యం తొలగించడాన్ని ఖండిస్తూ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 20 నుంచి సమ్మె బాట పట్టారు. పర్మినెంట్ కార్మికులు వారికి మద్దతుగా నిలుస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెనక్కి తీసుకుంటామని గానీ, కొత్తగా ఎవ్వరినీ విధుల్లో నుంచి తియ్యడం లేదని గానీ యాజమాన్యం చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలు సైతం ప్లాంట్‌లో నెలకొన్న తాజా పరిస్థితులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

నిర్వాసిత గ్రామాల్లోకి పోలీసు బలగాలు

ఉక్కు నిర్వాసిత ప్రాంతాలైన గంగవరం, గంట్యాడ, వడ్లపూడి, అగనంపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాల్లో శుక్రవారం నుంచి పోలీసుల పహారా పెట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఒకవైపు స్టీల్‌ప్లాంట్‌లో ఇప్పటికే 600 మంది వరకూ రాష్ట్ర ప్రభుత్వ పోలీసులను ప్రభుత్వం దించడమే గాకుండా గ్రామాలకు కూడా ఇంకొందరిని పంపడం వెనుక సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్ర దాగి ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్రానికి వత్తాసు పలకడంలో భాగంగానే ఇలా చేస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోరాటానికి యాజమాన్యం భయపడింది
: సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమ్మె పోరాటానికి భయపడిందని, అందుకే నిర్బంధాన్ని పెంచేందుకు చూస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన పోలీసు బలగాలతో సమ్మెను అణచివేయాలని చూస్తోందని, పోలీసులు గురువారం ప్లాంట్‌లోకి జొరబడి భయోత్పాతం సృష్టించారని తెలిపారు. నిర్బంధంతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. గత ప్రభుత్వం ఇళ్ల దగ్గర కార్మికులను అరెస్ట్ చేస్తే నాడు టిడిపి, జనసేన పార్టీల నాయకులు నిరంకుశత్వం అని అన్నారని, నేడు డిపార్టుమెంట్‌ల్లోకి, కాలనీల్లోకి పోలీసులు వచ్చి బెదిరిస్తుంటే దీన్ని ఏమంటారని నర్సింగరావు ప్రశ్నించారు.

టిజి వెంకటేష్ దురాగతాలను నిరసిస్తూ కవిత రాశారని సిపిఎం కార్యకర్త నిర్బంధం

- కర్నూలు పోలీసుల ఓవర్‌యాక్షన్
- సిఐ శేషయ్యపై చర్యలు తీసుకోవాలని డిజిపికి ప్రభాకర్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర మంత్రి టిజి భరత్ తండ్రి మాజీ ఎంపి, బిజెపి నేత టిజి వెంకటేష్ దురాగతాలను నిరసిస్తూ కవిత రాసిన సిపిఎం కార్యకర్తపై కర్నూలు పోలీసులు ఓవర్‌యాక్షన్‌కు దిగారు. పోలీసులు స్టేషన్లో ఆయన్ను ఒకరోజంతా అక్రమంగా నిర్బంధించారు. దీంతో తమ కార్యకర్తను తక్షణమే విడిచిపెట్టాని కోరుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి డిజిపి హరీష్ కుమార్‌గుప్తాకు లేఖ రాశారు. కర్నూలు నగరంలో ఈ సంఘటన చోటుచేసుకుంది.

ఏం జరిగింది...?

కర్నూల్ మండలం గొందిపర్ల గ్రామ పరిధిలో ఉన్న టిజి వెంకటేష్‌కు చెందిన శ్రీ రాయలసీమ ఆల్కాలిస్ కెమికల్ పరిశ్రమ విస్తరణపై మే 14వ తేదిన కర్నూల్ ఆర్‌డివో అధ్యక్షతన కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ సభ జరిగింది. పరిశ్రమ విస్తరణలో వాడే విష రసాయనాల వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అనారోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, విష రసాయనాలను వినియోగించి పర్యావరణానికి విఘాతం కలిగించే రసాయన పరిశ్రమ విస్తరణకు అనుమతించొద్దని ప్రజాసంఘాలు ఈ సభలో తమ అభిప్రాయాన్ని వినిపించే ప్రయత్నం చేశాయి. ఈ ప్రయత్నాన్ని అసాంఘిక శక్తులు అడ్డుకున్నాయి. ప్రజా సంఘాల నాయకులపై భౌతిక దాడులకు దిగాయి. టిజి వెంకటేష్ కన్ను సన్నల్లో ఈ దాడి జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. దాడికి గురైన వారిలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎండి ఆనంద్‌బాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొల్ల రాఘవేంద్ర ఉన్నారని పేర్కొన్నారు. టిజి వెంకటేష్ కన్ను సన్నల్లో పట్టణానికి చెందిన తెలుగు రమేష్ మరికొంతమంది రౌడీలు ఈ దాడికి పాల్పడ్డట్టు ప్రజా సంఘాల నేతలు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. అయితే, టిజి వెంకటేష్‌పైగానీ, దాడికి పాల్పడిన వారిపైగాని పోలీసులు ఇంతవరకు ఎటువంటి చర్య తీసుకోలేదు. ఈ ఘటనను నిరసిస్తూ కర్నూలు నగరానికి చెందిన సిపిఎం కార్యకర్త వడ్ల వెంకటేశ్వర్లు ఒక కవిత రాశారు. ఈ కవితపై పోలీసులు తీవ్రంగా స్పందించారు. వడ్ల వెంకటేశ్వర్లును మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సిఐ) శేషయ్య బుధవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. రోజంతా స్టేషన్‌లో ఉంచుకుని సాయంత్రానికి విడిచి పెట్టారు. గురువారం ఉదయం కూడా ఇదే విధంగా నిర్బంధించారు.

లేఖలో ఏం రాశారు?

దీంతో ఈ నిర్బంధ పర్వంపై డిజిపి లేఖ రాసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి టిజి వెంకటేష్, అతని కుమారుడు రాష్ట్రమంత్రి టిజి భరత్ మెప్పు పొందేందుకు, వారి ఆదేశాలతో సిఐ శేషయ్య అధికారాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఆయన అధికార దుర్వినియోగంపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు. అక్రమ నిర్బంధంలో ఉన్న వెంకటేశ్వర్లును తక్షణమే విడుదల చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని డిజిపిని కోరారు. లేఖ కాపీని హోంశాఖ మంత్రి వంగలపూడి అనితకు కూడా పంపారు.

మాట్లాడుతున్న ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి 5న ధర్నా

- ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి - ఉరవకొండ
కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి జూన్ ఐదున రాష్ట్రంలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల ముందు, 16వ తేదీన విజయవాడ సిసిఎల్ఎ భవనం ముందు ధర్నా చేపడుతున్నట్లు ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు చెప్పారు. కౌలు రైతులందరికీ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం అనంతపురం జిల్లా ఉరవకొండ మండల కేంద్రంలో కౌలు రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాలలో గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి అన్నదాత సుఖీభవను కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలకు దేవాదాయ భూములను కౌలుకు ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముందస్తు కౌలు లేకుండా పంట కోతల తర్వాత చెల్లించే విధానం ప్రభుత్వమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల అప్పులు మాఫీ చేసి బ్యాంకుల నుండి పంట రుణాలు ఇప్పించాలని కోరారు.

డిజిటల్ విధానంలో 'స్త్రీనిధి' రుణాల చెల్లింపు

యాప్‌ను ప్రారంభించిన మంత్రి కొండపల్లి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
స్త్రీనిధి రుణాలు చెల్లించేందుకు రాష్ట్రప్రభుత్వం యాప్‌ను ప్రవేశపెట్టింది. 'స్త్రీనిధి' పేరుతో రూపొందించిన ఈ యాప్‌ను సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం విజయవాడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెర్ప్ విభాగానికి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. నిరాక్షరాస్యత వల్ల గ్రామాల్లో మహిళలు రుణాలను తిరిగి సాంప్రదాయ పద్ధతిలో చెల్లింపులు జరపడం వల్ల సమయం వృథా అవుతుందని తెలిపారు. ఆర్థిక లావాదేవీలపై అవగాహన లోపం, రుణాలను తిరిగి చెల్లించామనే అంశాలపై స్పష్టత లేకపోవడం వల్ల మోసానికి గురికావొచ్చునని చెప్పారు. తద్వారా వారిపై మరింత ఆర్థికభారం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ మహిళల ఆర్థిక పురోగతిని వేగవంతం చేసేందుకు, మైక్రో ఫైనాన్స్ బారినపడకుండా కాపాడటం కోసం ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేయడం హర్షణీయమని తెలిపారు. డిజిటల్ విధానంలో చెల్లింపుల సౌకర్యాన్ని కల్పించడం ద్వారా లబ్ధిదారులకు మేలు చేకూరుతోందని తెలిపారు. ఈ యాప్‌పై అవగాహన కల్పించే దిశగా స్త్రీనిధి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. యాప్‌ను అమల్లోకి తీసుకురావడానికి సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా బ్యాంకింగ్ భాగస్వాములు సహకరించాయని అభినందించారు. లావాదేవీలకు సంబంధించిన విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా బ్యాంకు వారు జాగ్రత్త వహించాలని కోరారు. సెర్ప్ సిఇవో వాకాటి కరుణ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణాల్లో ఉన్న పేద మహిళల ఆర్థిక అభివృద్ధికి యాప్ దోహదపడుతుందన్నారు. స్త్రీనిధి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా డిజిటల్ యాప్‌ను రూపొందించామని స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ తెలిపారు. గ్రామీణ మహిళలకు జరుగుతున్న ఆర్థిక మోసాలను అరికట్టవచ్చని యూనియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ భాస్కరరావు అన్నారు.

మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలి

- జీవవైవిధ్య దినోత్సవంలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అటవీ భూములు ఆక్రమించుకునే వారు ఉన్నారని, కొత్తగా అడవులు సృష్టించాలన్న ఆలోచన ఉన్నవారు కరువయ్యారని చెప్పారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు మన ఇంటి నుంచే మొదటి అడుగు వేయాలని కోరారు. పర్యావరణం అంటే మొక్కలకు సంబంధించిన విషయం కాదని, మన జీవన శైలి అని చెప్పారు. సీడ్ బాల్స్ తయారు చేసి విసరడం ద్వారా వేల సంఖ్యలో మొక్కలు నాటే వీలు ఉంటుందన్నారు. సముద్ర తీరంలో సునామీ, తుపాన్ వంటి విపత్తుల నుంచి రక్షణగా ఉండే మడ అడవులను నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి విధ్వంసం ప్రమాదకరమని, దీనిని సరిదిద్దుకోకపోతే సమస్త మానవజాతి నష్టపోతుందన్నారు. ఒక్క పక్షి కూడా నివాసం ఉండని యూకలిప్టస్, కోనోకార్పస్ వంటి మొక్కలు నాటుతున్నామని, అవి ప్రాణవాయువును అతి తక్కువ మోతాదులో అందిస్తాయని చెప్పారు. పక్షులు కూడా వాలని మొక్కలు ఎలా అమ్ముతారని, నర్సరీలలో పెంచేప్పుడు సాధ్యమైనంత వరకు అటవీశాఖ మార్గదర్శకాలు పాటించాలని చెప్పారు. కడియం నర్సరీలు ఈ మొక్కల అమ్మకాలు నిలిపివేసే అంశంపై ఆలోచన చేయాలని తెలిపారు. జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తరపున ప్రతి జిల్లాలో ఒక బయోడైవర్సిటీ పార్కు, ప్రతి గ్రామంలో ఒక పల్లెవనం ఏర్పాటు చేస్తామన్నారు. పక్షులు, తేనెటీగలకు ఆశ్రయం కల్పించే మొక్కలు వీటిల్లో నాటుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్, ఎపిటిఎస్ చైర్మన్ మోహన్ కృష్ణ, బోర్డు మెంబర్ సెక్రటరీ రామకృష్ణ, అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి అనంతరాము, ఎపిఎఫ్‌డిసి ఎండి ఆర్‌పి ఖజురియా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లపై
సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు, ఇంక్రిమెంట్ల కోతలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ లేక రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ చేయించాలని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఫెడరేషన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్‌టిసిగా ఉన్న సమయంలోని సర్క్యులర్‌ను ఇప్పుడు ఇచ్చారని, ప్రస్తుతం పిటిడిగా మారిన నేపథ్యంలో జీఓ నెంబరు 70, 71మాత్రమే అమలవుతుందన్నారు. కేవలం 1/2019 సర్క్యులర్ గైడింగ్ ప్రిన్సిపల్‌గా చూడాలని ప్రస్తావించారే తప్ప యథావిధిగా సర్క్యులర్ అమలు చేయాలని పేర్కొనలేదని తెలిపారు. ముందుగా జీఓ నెంబరు 70పై వివిధ సంఘాల నుంచి సూచనలు తీసుకోవాలని, ప్రభుత్వంతో చర్చించి చేయాల్సిన మార్పుల గురించి యాజమాన్యం కృషి చేయాలని పేర్కొన్నారు. ఆర్‌టిసి అసోసియేషన్‌లా తాము కూడా ప్రభుత్వాన్ని ప్రాతినిధ్యం చేస్తామని ఎస్‌డబ్ల్యుఎఫ్ తెలిపింది. జీఓ నెంబరు 70లో ఏ అంశాల్లో మార్పులు చేయాలో యూనియన్లు, అసోసియేషన్లు నుంచి నిర్దిష్ట ప్రతిపాదనలను యాజమాన్యం తీసుకోవాలని పేర్కొంది.

ఎండియు వ్యవస్థను రద్దు చేయొద్దు

- వాహనాల ఆపరేటర్ల ఆందోళన

కాకినాడ జిల్లా గొల్లప్రోలులో రోడ్డుపై బైటాయించి నిరసన తెలుపుతున్న మాజీ ఎంపి వంగా గీత, ఎండియు ఆపరేటర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం
ప్రజలకు ఇంటి వద్దే రేషన్ సరఫరా చేసే ఎంఐయు వాహనాల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వాహనాల ఆపరేటర్లు గురువారం పలు జిల్లాల్లో ఆందోళనలు చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో 27 వేల మంది కుటుంబాలు రోడ్డున పడతాయని, రేషన్ పంపిణీకి తప్ప ఎండియు వాహనాలు ఎందుకు ఉపయోగపడవని ఆందోళన వ్యక్తం చేశారు.

తమకు న్యాయం చేయాలని కోరారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎండియు ఆపరేటర్లు బైటాయించి నిరసన తెలిపారు. ఆపరేటర్లు చేపట్టిన ఆందోళనకు కాకినాడ మాజీ ఎంపి వంగా గీత మద్దతు తెలిపారు. ఇంటి వద్దకే రేషన్ బియ్యం సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన ఎండియు వాహనాలను టిడిపి కూటమి ప్రభుత్వం తొలగించి పేదలకు అన్యాయం చేసిందన్నారు. వైసిపిపై అక్కసుతో ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. అర్ధాంతంగా ఆపరేటర్లను తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కెవి.సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆపరేటర్లు ధర్నా నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్‌డిఓ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఎండియు వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

- ఎన్‌కౌంటర్‌ను ఖండించిన సిపిఎం రాష్ట్రకమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
మావోయిస్టు రాజకీయాలతో భిన్నాభిప్రాయం ఉన్నప్పటికీ వారితో వెంటనే చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27 మందిని ఎన్‌కౌంటర్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. చర్చలకు తాము సిద్ధమేనని మావోయిస్టులు పదేపదే చేసిన విజ్ఞప్తులను కేంద్రప్రభుత్వం, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని, అమానవీయంగా మావోయిస్టులను తుడిచిపెట్టే విధానాన్ని అనుసరించాయని విమర్శించారు. పైగా ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రి ఎన్‌కౌంటర్‌పై హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటనలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. అనేక రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థలు మావోయిస్టులతో చర్చలు జరిపే విషయాన్ని పరిశీలించాలని పలు విజ్ఞప్తులు చేశాయని తెలిపారు. వెంటనే వారితో చర్చలు జరపాలని, పారా మిలటరీ దాడులను ఆపివేయాలని కోరారు.

మావోయిస్టుల మరణాలు కేంద్ర ప్రభుత్వ హత్యలే : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 27 మంది మావోయిస్టుల మరణాలను కేంద్రప్రభుత్వం చేసిన హత్యలుగా పరిగణించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఎన్‌కౌంటర్‌పై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని చెప్పినా కేంద్రప్రభుత్వం చర్చలకు ముందుకు రాకుండా ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్‌కౌంటర్లకు తెగబడిందన్నారు. నక్సల్ సమస్య కేవలం శాంతి భద్రతల సమస్యగానే పరిగణించకుండా, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యగా పరిగణించాలన్నారు. గత ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని, పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు ఇవ్వలేదన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక, అకాల వర్షాలకు చేతికి వచ్చిన పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. జూన్ 2 ధర్నాల గోడ పత్రికను రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న పీతల సుజాత

రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్ పర్సన్‌గా
పీతల సుజాత బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు
రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ చైర్ పర్సన్‌గా పీతల సుజాత గుంటూరులోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సమక్షంలో ఆమె పదవి స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పీతల సుజాత విలేకరులతో మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల రక్షణ, భద్రతకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ద్వారా నిస్సహాయస్థితిలో ఉన్న మహిళలకు ఆదరణ కల్పించడంతోపాటు వారిని మంచి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దటానికి అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా కృషి చేస్తానని తెలిపారు. మహిళలు స్వయంగా వారి కాళ్లపై వారు నిలబడేలా అవసరమైన అన్ని కార్యక్రమాలను చేపట్టడానికి కషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పద్మజ, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ రమణశ్రీ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు రక్షణ చట్టం

- వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
వ్యవసాయ కార్మికులకు రక్షణ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధిహామీ చట్ట రక్షణకోసం, చేసిన పనికి బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, అడిగిన ప్రతి కుటుంబానికి పనులు కల్పించి వలసలు ఆపాలని, కార్మికులకు రక్షణ చట్టం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా సంఘం ఇచ్చిన గ్రామీణ ఆందోళనలో మంగళ, బుధ వారాల్లో 50వేల మందికి పైగా కార్మికులు పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీకి భారీగా నిధులు తగ్గించిందని విమర్శించారు. వ్యవసాయ కార్మికులు పనులు చేయలేని పద్ధతుల్లో అనేక రకాల షరతులు విధించిందని విమర్శించారు.

అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్టు

- అమెరికా పౌరులే లక్ష్యంగా రూ. కోట్లు దోపిడీ

ప్రజాశక్తి - అనకాపల్లి
అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో అంతర్జాతీయ సైబర్ క్రైం కార్యకలాపాలను పోలీసులు ఛేదించారు. అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని టెక్నాలజీ సాయంతో వంచనలకు పాల్పడుతూ భారీగా డబ్బు దోచుకున్న 33 మందిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఎస్‌పి తుహిన్ సిన్హా తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. అచ్యుతాపురంలోని మూడు ముఖ్య కేంద్రాల్లో ఒకేసారి ఆకస్మిక దాడులు నిర్వహించి పెద్ద సంఖ్యలో కంప్యూటర్లు, నెట్‌వర్క్ పరికరాలు, డిజిటల్ సదుపాయాలు, రూ.3.లక్షల నగదు, పలు వాహనాలు, ఫర్నీచర్ స్వాధీనం చేసుకున్నారు. సైబర్ ముఠా విభజిత బాధ్యతలతో కూడిన వ్యవస్థగా ఉంది. డైలర్లు, వివో, ఐపిఎల్ కాల్స్ ద్వారా అమెరికా పౌరులను సంప్రదించి అమెజాన్ కస్టమర్ కేర్ నుంచి తాము మాట్లాడుతున్నట్లు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. అమెరికా బ్యాంకులు లేదా ఎఫ్‌టిసి అధికారులుగా నటించి వ్యక్తిగత, ఆర్థిక సమాచారం పొందడం, బాధితులతో గిఫ్ట్ కార్డులు కొనుగోలు చేయించి, వాటి కోడ్‌లు చెప్పించడం తదితర చర్యలకు పాల్పడుతున్నారు. అసోం, నాగాలాండ్, మేఘాలయ, గుజరాత్ రాష్ట్రాల నుండి ఉద్యోగులను నియమించి సైబర్ మోసాల పట్ల శిక్షణ ఇచ్చి బాధితులను లక్ష్యంగా చేసుకుని నెలకు కోట్ల రూపాయలు దోచుకున్నట్టు గుర్తించారు. ముఠాలో కీలక వ్యక్తులుగా ఉన్న మహారాష్ట్రకు చెందిన పునీత్ గోస్వామి, రాజస్థాన్‌కు చెందిన అవిహాంత్ దాగాను అరెస్టు చేశారు. ఈ ముఠాను నడిపిస్తున్న ప్రముఖ వ్యక్తులను గుర్తించేందుకు విచారణ కొనసాగుతోందని ఎస్‌పి తెలిపారు.

మరో ఎన్‌కౌంటర్

- ఒక మావోయిస్టు .. ఒక జవాన్ మృతి

చర్ల : పచ్చని అడవుల్లో మళ్లీ రక్తపుటేరు పారింది. సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తుమ్రేల్ దండకారణ్యంలో మావోయిస్టులకు పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మరో మావోయిస్టు మృతి చెందారు. ఆ కాల్పుల్లో ఒక జవాన్ మృతిచెందగా, ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలైనట్టు బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. గాయపడిన వారికి చికిత్స కొనసాగుతోంది. సుక్మా, బీజాపూర్ జిల్లాల సరిహద్దులో ఉన్న తుమ్రేల్ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిపై సమాచారం ఆధారంగా.. కోబ్రా, జిల్లా సుక్మా డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్‌ల సంయుక్త పోలీసుల బృందానికి, మావోయిస్టులకు మధ్య గురువారం ఉదయం నుంచి కాల్పులు కొనసాగాయి. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో గాలింపు చేపట్టగా, ఇప్పటివరకు ఒక మావోయిస్టు మృతదేహం, ఆయుధాలు ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

- ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లాల ముఠాను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి కోటి రూపాయలకు పైగా విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు తెలిపారు. అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇద్దరు యువకులు ఓ నేరచరిత్ర గల వ్యక్తితో కలిసి ఈ ముఠాగా ఏర్పాడ్డారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన తోట శివకుమార్, చిత్తూరు జిల్లా మొరవారిపల్లికు చెందిన జెట్టి సుబ్రమణ్యం, అన్నమయ్య జిల్లా మాధవరంపాడుకు చెందిన నిందితుల నుంచి దాదాపు కోటి రూపాయలు విలువ చేసే కిలో బంగారం, రూ. మూడు లక్షలు విలువ చేసే మూడు కిలోల వెండి, రూ.1.4 లక్షల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీరు గతంలో విజయవాడ, గుంటూరు, తాడేపల్లిగూడెం, అనకాపల్లి, రాజంపేట తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడి 150కిపైగా కేసుల్లో నిందితులుగా ఉన్నారు. అన్నమయ్య జిలా, మున్నూరు పిఎస్‌లో నమోదైన కేసులో ఈనెల 21న రాజంపేట మండలం ఊటుకూరు వద్ద వీరిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి తెలిపారు.

ఉగ్రమూలాల కేసులో

నిందితులకు వారం రోజుల కస్టడీ

ప్రజాశక్తి- విజయనగరం కంటోన్మెంట్

ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలపై అరెస్టయి విశాఖ సెంట్రల్‌జైలులో ఉన్న రిమాండ్ నిందితులను వారం రోజులు కస్టడికీ అప్పగిస్తూ గురువారం విజయనగరం కోర్టు అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ రిమాండ్ విధించింది. నిందితులను కస్టడీకి తీసుకునే ముందు, తరువాత వైద్య పరీక్షలు చేయాలని, వారిపట్ల ఎటువంటి అమానుష చర్యలకూ పాల్పడవద్దని న్యాయమూర్తి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. కస్టడీ ముగిసిన తరువాత వైద్య పరీక్షలు నిర్వహించి తిరిగి కోర్టులో హాజరుపర్చాలని ఆదేశించారు. విజయనగరానికి చెందిన సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌ను ఈ నెల 17న విజయనగరం టూటౌన్‌పోలీసులు అరెస్టు చేయగా, ఇప్పటికే ఎన్‌ఐఎ (జాతీయ దర్యాప్తు సంస్థ) అధికారులు విజయనగరం వచ్చి పలు విషయాలు సేకరించారు. సిరాజ్, సమీర్‌తో పాటు కర్ణాటక, మహారాష్ట్ర యువకులు కొందరు ఐసిస్ హ్యాండ్లర్ సౌదీ నుంచి ఇచ్చే ఆదేశాల అమలుపై పలుమార్లు చర్చించుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలతో పాటు కొన్నిముఖ్య ప్రాంతాల్లో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు సమాచారం.

విధులను బహిష్కరించి కూర్మన్నపాలెం కూడలికి చేరుకున్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు , ఉక్కు దీక్షా శిబిరం వద్ద అభివాదం చేస్తున్న పోరాట కమిటీ నేతలు

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం

- పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు
- మూడో రోజూ స్టీల్‌ప్లాంట్‌లో కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రానున్న కాలంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యమం మరింత ఉధృతం కానుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు స్పష్టం చేశారు. అక్రమ తొలగింపులను నిరసిస్తూ విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరింది. విధులను బహిష్కరించి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. వారంతా కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం వద్దకు చేరుకున్నారు. వారినుద్దేశించి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్‌లో ప్రస్తుతం పని చేస్తున్న వారు కూడా బయటకు వచ్చి సమ్మెలో భాగస్వామ్యం కావాలని కోరారు. దీక్షా శిబిరం వద్దకు పది వేల మంది చేరే వరకూ ఉద్యమం అంచెలంచెలుగా ఎదగాలన్నారు. ప్లాంట్ కోసం అన్ని పార్టీల ఎంపీలను కలిసి న్యాయం చేయాలని కోరుతామన్నారు. ప్రస్తుత కాంట్రాక్టు కార్మికుల ఉద్యమం గెలిస్తే పని కోల్పోయిన వారంతా పనిలోకి వస్తారని చెప్పారు. పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, ఎం రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తొలగించిన కార్మికులందరూ విధుల్లోకి చేరే వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. పోరాట కమిటీ కో కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులు లేనిదే పని జరగదన్నారు. ప్లాంట్ ప్రగతిలో వారి కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్.రామారావు, పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

సమ్మెపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ పలుచోట్ల నిరసనలు

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సిఐటియు ఆధ్వర్యాన పలుచోట్ల నిరసనలు తెలిపారు. జగదాంబ జంక్షన్‌లో సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి పి.మణి శిరోముండనం చేయించుకుని వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను అకారణంగా తొలగిస్తూ అన్యాయం చేయొద్దన్నారు.

రావివలస అభివృద్ధికి కృషి

- 'మా ఊరు - మాటామంతి'లో డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్ (శ్రీకాకుళం జిల్లా)

మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం రావివలసలో సిసి రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు రూ.15 కోట్లు మంజూరు చేస్తున్నట్లు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తెలిపారు. టెక్కలిలోని భవానీ థియేటర్‌లో గురువారం 'మాఊరు-మాటామంతి' అనే పేరుతో వర్చువల్‌గా ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో అమలు చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, విద్యా, వైద్యం, తదితర మౌలిక వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. మల్లికార్జున ఆలయం అభివృద్ధికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వర్షా కాలంలో నీరు వృథాగా పోకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతల వల్ల భూ గర్భ జలాలు పెరిగి భావితరాలకు తాగు, సాగుకు ఉపయోగపడతాయన్నారు. గ్రామాల్లో నాటే మొక్కలు మనమే సంరక్షించుకోవాలని కోరారు. మొక్కలను సంరక్షించుకొని సుందర వనాలుగా అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాల నుంచి ఉన్నత స్థాయికి చేరుకున్న వారు తమ గ్రామాలను మరచిపోకుండా గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ రవిబాబు, ఎంపిడిఒ లక్ష్మీబాయ్ పాల్గొన్నారు.

పర్యాటక రంగ సమగ్రాభివృద్ధికి నూతన పాలసీ

- అజయ్ జైన్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

రాష్ట్రంలో పర్యాటకరంగ సమగ్రాభివృద్ధికి నూతన పాలసీని తీసుకొచ్చామని, దీనిలో భాగంగా ప్రయివేటు భాగస్వామ్యంతో ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన చేశామని రాష్ట్ర పర్యాటక, గృహ నిర్మాణ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కోపల్లె మంతెన హెరిటేజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హోమ్ స్టే విధానాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా ఉన్నామని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 1,842 హోం స్టే యూనిట్లు ఉన్నాయని తెలిపారు. హోం స్టేకు పశ్చిమగోదావరి జిల్లా కోపల్లెలోని మంతెన హెరిటేజ్ ఆదర్శంగా నిలిచిందని, ఇక్కడ వాతావరణం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోందని తెలిపారు. సెర్ఫ్, మెప్మా మహిళల భాగస్వామ్యంతో దిండి, అరకు ప్రాంతాల్లో పైలెట్ ప్రాజెక్టులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించిన 12వ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు.

పోలవరం నుంచి పట్టిసీమ మధ్య తీగల వంతెన, విజయవాడలోని భవానీ ద్వీపంలో థీమ్ పార్క్, వాటర్ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పెట్టుబడుల ప్రోత్సాహక మండలి అనుమతితో మంత్రివర్గం ఆమోదం తర్వాతే కేటాయింపులు చేసేలా కొత్త విధానం రూపొందించామని తెలిపారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టరు టి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ కె ప్రవీణ్ కుమార్‌రెడ్డి, టూరిజం సహాయ సంచాలకులు ఎ లాజ్ వంతినాయుడు, మేనేజర్ ఎ రాజ్యలక్ష్మి, కన్సల్టెంటు డి సాహితి, ప్రతినిధులు పాల్గొన్నారు.

పొగాకును పరిశీలిస్తున్న వడ్డే శోభనాశ్వరరావు, వి.కృష్ణయ్య

నల్లబర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

- వడ్డే శోభనాద్రీశ్వరరావు, వి కృష్ణయ్య డిమాండ్

ప్రజాశక్తి-పర్చూరు (బాపట్ల జిల్లా)

నల్లబర్లీ పొగాకు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. పొగాకు రైతుల ఇబ్బందులను తెలుసుకోవడానికి బాపట్ల జిల్లా పర్చూరు మండలంలోని ఉప్పుటూరులో వారు గురువారం పర్యటించారు. పొగాకు మండెలను పరిశీలించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు రైతులతో మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో జిపిఐ కంపెనీ గతేడాది ఇచ్చిన ధరకే పొగాకు కొనుగోలు చేస్తామని రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సహించి పొగాకు సాగు పెంచారని, తీరా ఇప్పుడు పొగాకు కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల బాధ, కూలీలకు డబ్బులు ఇవ్వాలని రైతులపై ఒత్తిడి పెడుతుంటే.. బ్యాంకులు బంగారం రుణం మొత్తం కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయన్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. ఫోన్‌లో స్థానిక ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావుతో సమస్య తీవ్రతను శోభనాద్రీశ్వరరావు వివరించారు. వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ పొగాకు కొనుగోలు చేయడానికి కంపెనీలతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. పొగాకు కొనుగోలు చేయించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. జూన్ 2న వివిధ పొగాకు కంపెనీల కార్యాలయాల ముట్టడి, ముఖ్యమంత్రితో రాయబారం జరపడానికి రైతులు పెద్ద సంఖ్యలో కదలి రావాలని కోరారు. అనంతరం గ్రామంలోని రైతులందరినీ కలుపుకొని స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడారు. రుణాలపైనా, బంగారం రుణాల గురించి ఒత్తిడి చేయొద్దని, ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, బ్యాంకు రుణాలు రెన్యువల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరు, నాగులపాలెం, పర్చూరుకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటి క్యాంపస్ రద్దు కాదు

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-టంగుటూరు (ప్రకాశం జిల్లా)

ఒంగోలులో ట్రిపుల్ ఐటి క్యాంపస్ రద్దు అవుతుందన్న కొన్ని పత్రికల కథనాలు అవాస్తవమని, విద్యార్థులు ఆందోళన చెందవద్దని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఒంగోలులోని ట్రిపుల్ ఐటి క్యాంపస్ రద్దు అవుతుందంటూ కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాలపై ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ట్రిబుల్ ఐటి క్యాంపస్ అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించిన విషయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఒంగోలులో ట్రిపుల్ ఐటి క్యాంపస్‌ను రావ్ అండ్ నాయుడు ఇంజనీరింగ్ కాలేజ్, ఎస్‌ఎస్‌ఎన్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు రావ్ అండ్ నాయుడు కాలేజీ యాజమాన్యం లీజుకు నిరాకరిస్తోందని, అందువల్ల రావ్ అండ్ నాయుడు కళాశాలలో మొదటి సంవత్సరం విద్యనభ్యసించే ఇంజనీరింగ్ విద్యార్థులను మాత్రమే ఇడుపులపాయ ట్రిపుల్ ఐటి క్యాంపస్‌కు మార్చడం జరుగుతుందని తెలిపారు. ఎస్‌ఎస్‌ఎన్ కాలేజీలో ఇంజనీరింగ్ విద్యనభ్యసించే సెకండ్ ఇయర్ నుంచి ఫైనల్ ఇయర్ విద్యార్థులు యథావిధిగా ఇక్కడే కొనసాగుతారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. గత ప్రభుత్వం ట్రిపుల్ ఐటి క్యాంపస్‌కు భవనాలు నిర్మించకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్నారు. కొత్త క్యాంపస్ భవనాలు నిర్మించే వరకు ఈ సర్దుబాటు కొనసాగుతుందని తెలిపారు.

డిఎస్సీ ప్రత్యేకం-ఎస్‌ఎ/ఎస్‌జిటి

విద్యా మనోవిజ్ఞానశాస్త్రం -ప్రేరణ రకాలు

కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083

ప్రేరణ

అవసరాల నుండి ఏర్పడి ఆ అవసరాలను సంతృప్తి పర్చుకునే లక్ష్యం వైపుగా వ్యక్తిని నడిపించే లేదా కదలించే మానసిక శక్తినే 'ప్రేరణ' అంటారు.

ప్రేరణ వలయం:



- అవసరాలను సంతప్తి పర్చుకునే ప్రక్రియే ప్రేరణ అని అన్న వ్యక్తి **-అబ్రహం మాస్లో**
- అభ్యసనానికి మూలధారం ప్రేరణ అనినవారు - **క్రో అండ్ క్రో**
- అన్ని ప్రవర్తనలకు మూలాధారం ప్రేరణ **- ఉడ్‌వర్త్**
- 'ఒక పని చేయడానికి వ్యక్తిలో శక్తిని, ఉత్సాహాన్ని నింపి వ్యక్తిని లక్ష్యం వైపుగా నడిపించే మానసిక శక్తినే ప్రేరణ అంటారు.

  డ్రైవర్
- ప్రత్యేకమైన లక్ష్యాల వైపు ప్రవర్తనను ఉత్తేజపరిచే మానసిక శక్తియే ప్రేరణ **- బెర్నార్డ్**

Motivation అనే ఆంగ్ల పదానికి మూల పదం**-మొవీర్** (Movere)

- లాటిన్ భాషలో Movere అనగా కదలిక/చలనం

నోట్ : అనగా వ్యక్తిని కదిలించి వ్యక్తిలో శక్తిని నింపి లక్ష్యం వైపుగా నడిపిస్తుందని అర్థం.

- ప్రేరణ పొందిన వ్యక్తి కనబరిచే ప్రవర్తన- గమ్యోన్ముఖ ప్రవర్తన
- బలమైన ప్రేరణ పొందిన వ్యక్తి
  1. తనలో చాలా శక్తి ఉన్నట్లు భావిస్తాడు.
  2. చాలా ఉత్సాహంతో లక్ష్యం వైపుగా పయనిస్తుంటాడు.
  3. లక్ష్యం చేరటం కోసం శక్తివంచన లేకుండా అహర్నిశలు కష్టపడతాడు.
  4. లక్ష్యాన్ని చేరుకున్నాక తటస్థ స్థితికి వస్తాడు.

ప్రేరణ అనేది

- అభ్యసనానికి రాచబాట
- అభ్యసనానికి మూలాధారం
- అన్ని ప్రవర్తనలకీ మూలాధారం
- వ్యక్తి యొక్క అంతర్గత అభిరుచి
- గమ్యోన్ముఖ ప్రవర్తనను కలిగించే మానసిక శక్తి.
- వ్యక్తిలో శక్తిని, ఉత్సాహాన్ని నింపి లక్ష్యం వైపుగా నడిపించే

ప్రేరణ - రకాలు:

- వ్యక్తి తన స్వీయ ఆనందం కోసం, స్వీయ సంతృప్తి కోసం, తన అభిరుచులను, తన కోరికలను, తన శారీరక అవసరాలను తీర్చుకోవడం కోసం ఆత్మగౌరవాన్ని పొందటం కోసం ఇతరుల ప్రమేయం లేకుండా తనకై తానే ఒక పని చేయాలని సహజంగా/స్వాభావికంగా ప్రేరేపించబడటాన్ని "అంతర్గత ప్రేరణ" అంటారు.

1.అంతర్గత ప్రేరకాలు:

- శారీరక అవసరాలు
- అభిరుచులు
- స్వార్థపూరిత కోరికలు
- గౌరవకాంక్ష
- స్వీయ సంతృప్తి
- స్వీయ ఆనందం

ఉదా :

1. విద్యార్థి తన ఆనందం కోసం చిత్రలేఖనం నేర్చుకోవాలని ప్రేరేపించబడితే అది **- అంతర్గత ప్రేరణ.**

2. విద్యార్థి తన అభిరుచి మేరకు క్రికెట్ నేర్చుకోవాలని ప్రేరేపించబడి నేర్చుకుంటున్నట్లయితే ఆ విద్యార్థి- **అంతర్గతంగా ప్రేరేపించబడ్డాడు.**

3. ఒక ఉపాధ్యాయుడు వృత్తిలో వుండే సంతృప్తిని పొందడం కోసం నూతన బోధనా మెళకువలు నేర్చుకోవాలని ప్రేరేపించబడితే అది **- అంతర్గత ప్రేరణ**

2. బహిర్గత ప్రేరణ/బాహ్య ప్రేరణ / కృత్రిమ ప్రేరణ :

- వ్యక్తి తన అవసరాలతో, కోరికలతో నిమిత్తం లేకుండా ఇతరులను సంతృప్తి పరచడం కోసం ఇతరులు నిర్దేశించిన గమ్యాలను చేరుకోవడం కోసం ఇతరులు ప్రవేశపెట్టిన ఉద్దీపనలు పొందడం కోసం, బహుమతులకు ఆశపడి, శిక్షలకు భయపడి ఒక పని చేయాలని ప్రేరేపించబడితే అలాంటి ప్రేరణను "బహిర్గత ప్రేరణ" అంటారు.

  బహిర్గత ప్రేరకాలు:
- మార్కులు, ర్యాంకులు, గ్రేడులు, అవార్డులు, రివార్డులు, బహుమతులు, శిక్షలు, విమర్శలు, దండనలు మొదలైనవి.

నోట్ : బహిర్గత ప్రేరణ- **తాత్కాలికమైనది.** అంతర్గత ప్రేరణ **- దీర్ఘకాలికమైనది**

కాబట్టి ఉపాధ్యాయుడు ఎప్పుడూ విద్యార్థుల్లో అంతర్గత ప్రేరణను ప్రోత్సహించాలి.

ఉదా:

1.మాస్టారు కొడతాడనే భయంతో విద్యార్థి హోమ్ వర్క్ పూర్తిచేయాలని ప్రేరణ చెందితే అందులో విద్యార్థి- **బహిర్గతంగా ప్రేరేపించబడ్డాడు.**

2.నాన్నను సంతృప్తి పరచడం కోసం ట్యూషన్‌కు వెళ్ళాలని విద్యార్థి ప్రేరేపించబడితే అది **- బహిర్గత ప్రేరణ**

3.ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం, పై అధికారుల మెప్పుకోసం నూతన బోధన మెళకువలను నేర్చుకోవాలని ఉపాధ్యాయుడు ప్రేరేపించబడితే అది **-బహిర్గత ప్రేరణ**

3. సాధనా ప్రేరణ :

- సాధనా ప్రేరణ అనే నూతన భావనను వెలుగులోకి తెచ్చినవారు **- మెక్లీలాండ్ అండ్ అట్కిన్సన్ (అమెరికా)**
- సాధనా ప్రేరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు**-మెక్లీలాండ్ అండ్ అట్కిన్సన్**
- వ్యక్తిలోని సాధనా ప్రేరణను కనుగొనటానికి CIE అనే పరీక్షను రూపొందించిన వారు **- దత్ అండ్ రస్తోగి**
- అనేక లక్ష్యాలలతో సంబంధం ఉండి కొన్ని ఉన్నత ప్రమాణాలను సాధించాలనే ధ్యేయం వైపుగా కొనసాగింపులతో చేసే చర్యలతో కూడిన గమ్య నిర్దేశక ప్రవర్తనే "సాధన ప్రేరణ" అన్న వారు **-మెక్లీలాండ్ అండ్ అట్కిన్సన్**
- కొన్ని ఉన్నత లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటిని సాధించేంత వరకు కఠోర శ్రమను, పట్టుదలను కనబరుస్తూ ఎప్పటికప్పుడు నూతన ఉత్తేజంతో ఆ లక్ష్యాలను చేరుకోవాలనే గమ్య నిర్దేశక ప్రవర్తనను "సాధన ప్రేరణ" అంటారు.

ఉదా :

1.ఒక సామాన్య ఛాయ్ వాలా నుండి భారత ప్రధానిగా ఎదిగిన సరేంద్రమోడీలో ఉన్న ప్రేరణ **- సాధన ప్రేరణ**

2.క్రికెట్ అనేక రికార్డులను లక్ష్యంగా పెట్టుకుని ఒక్కొక్క రికార్డును తిరగరాసి కొత్త రికార్డులను నెలకొల్పిన సచిన్ టెండూలర్‌లోని ప్రేరణ **-సాధన ప్రేరణ**

- 'నేను ఈనాడు ఈ స్థాయిలో ఉండటానికి కారణం రేపు నేను ఏ స్థాయిలో ఉండాలో నిన్ననే ఆలోచించుకుని దాన్ని సాధించాలి అనే ప్రేరణతో పనిచేయడమే" అన్న మైకేవర్ మాటలు అతనిలోని ఏ ప్రేరణను సూచిస్తాయి **- సాధన ప్రేరణ**

'ప్రేరణలో బహుమతి, శిక్షల పాత్ర గురించి పరిశోధన చేసి శిక్షల కంటే బహుమతులు మేలైన కారకాలు అని చెప్పినవారు**-థారన్‌డైక్**

- ప్రేరణలో పొగడ్త, నిందల పాత్రలపై పరిశోధన చేసి నింద కంటే కూడ పొగడ్త చాలా శక్తివంతమైన ప్రేరకం అని చెప్పిన వారు. **- ఎలిజబెత్ హర్లాక్**

  అబ్రహం మాస్లో అవసరాల సిద్ధాంతం/ప్రేరణకారక

సిద్ధాంతం:

- అవసరాల క్రమానుగత శ్రేణి సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు-

  అబ్రహం మాస్లో (అమెరికా)

నోట్ : (వీరిని మానవతావాద మూల పురుషుడిగా చెప్పుకుంటారు)

- మాస్లో అవసరాల సిద్ధాంతాన్ని 'ప్రేరణ కారక సిద్ధాంతం' అని కూడా అంటారు.

నోట్ : మాస్లో ప్రకారం ప్రేరణ ఎప్పుడూ అవసరాలతో ముడిపడి వుంటుంది.

3.మాస్లో ప్రకారం వ్యక్తి అవసరాల శ్రేణుల సంఖ్య **- 5, వీటిని ఒక నిచ్చెన క్రమంలో అమర్చారు.**



- ఈ 5 శ్రేణుల్లో 1, 2 అవసరాల శ్రేణులను ప్రాథమిక అవసరాలు అంటారు. ఇవి వ్యక్తి యొక్క శారీరక మనుగడకి ముఖ్యమైనవి.
- 3, 4, 5వ శ్రేణి అవసరాలను గౌణ అవసరాలు అంటారు.

  ఇవి వ్యక్తి మానసిక మనుగడకు ముఖ్యమైనవి.
- ఆత్మ ప్రస్తావన అనే మాటను కర్ట్ గోల్డ్ స్టీన్ సిద్ధాంతం నుండి మాస్లో స్వీకరించారు.

అభ్యసన - సిద్ధాంతాలు

ప్రవర్తనావాద సిద్ధాంతాలు:

- ఉద్దీపనకు, ప్రతిస్పందనకు మధ్య "సంధానం" (Connec tion) "సంసర్గం" (Association) ఏర్పాటు చేయడం ద్వారా వ్యక్తి ప్రవర్తనలో శాశ్వతమైన మార్పుని తీసుకు రావొచ్చునని వివరించిన సిద్ధాంతాలే "ప్రవర్తనా వాద సిద్ధాంతాలు/సంసర్గ వాద సిద్ధాంతాలు"
- ప్రవర్తనా వాద సిద్ధాంతాలన్నీ అభ్యసనంలో ఉద్దీపనలకు,



ప్రతిస్పందనలకు వాటి మధ్య ఏర్పడే సంధానాలకు లేదా సంసర్గాలకు ప్రాధాన్యత ఇచ్చాయి. కావున ఉద్దీపనలు, ప్రతిస్పందనలు, సంధానాలు అనే మాటలను ఉపయోగిస్తూ అభ్యసనాన్ని వివరించిన సిద్ధాంతాలన్నీ ప్రవర్తనావాద సిద్ధాంతాలే. ఈ వాదాన్ని వివరించిన అభ్యసనాలన్నీ

1. సరళ అభ్యసనాలు
2. యాంత్రిక అభ్యసనాలు
3. జంతు అభ్యసనాలు

ఉదా:

1. పావ్‌లోవ్-శాస్త్రీయ నిబంధనా సిద్ధాంతం
2. స్కిన్నర్-కార్యసాధక నిబంధనా సిద్ధాంతం
3. థారన్‌డైక్-యత్నదోష అభ్యసనా సిద్ధాతం

శాస్త్రీయ నిబంధన సిద్ధాంతం

ఈ సిద్ధాంతానికి ఇతర పేర్లు :

1. సాంప్రదాయక నిబంధన సిద్ధాంతం
2. S-type నిబంధనం
3. ఉద్దీపన ప్రాధాన్యత నిబంధనం

- శాస్త్రీయ నిబంధన సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు

IP పావ్‌లోవ్ (రష్యా)

- ఆయన సైకాలజిస్టు కాదు, పిజియాలజిస్టు (శరీరధర్మ శాస్త్రవేత్త). ఆయన కుక్క యొక్క లాలాజల గ్రంథులపై ప్రయోగాలు చేసి నిబంధన సహిత ప్రతి చర్యలు (Conditioned Re-flexes) గురించి వివరించారు.

దీనికి గాను Nobel Award కూడా పొందారు.

2. పావ్‌లోవ్ రచించిన గ్రంథాలు

1. The Work of digestive glands
2. Conditioned Reflexes

నిబంధనం:

3. ఒక ఉద్దీపనకు ఇంతకు ముందు లేని సహజ సిద్ధం కాని ప్రతిస్పందనను కల్పించడాన్నే "నిబంధనం" అంటారు. - **డ్రైవర్**

నిబంధన - అభ్యసనం:

13 ఒక అసహజ ఉద్దీపనను సహజ ఉద్దీపనతో సంసర్గం చేయడం ద్వారా సహజ ఉద్దీపనకు వచ్చే ప్రతిస్పందననే ఆ అసహజ ఉద్దీపనకి కూడా తెప్పించి జీవి ప్రవర్తనలో శాశ్వతమైన మార్పుని తీసుకురావడమే 'నిబంధనా అభ్యసనం".

నోట్ : నిత్యజీవితంలో అసహజ ఉద్దీపనలుగా-గంట శబ్దాలు, విజిల్ శబ్దాలు, డ్రమ్ శబ్దాలు, సైగలు, ట్రాఫిక్ సిగ్నల్స్, వీటికి వ్యక్తి ప్రతిస్పందించడం "నిబంధనా అభ్యసనం" అవుతుంది.

నిబంధనా అభ్యసనానికి ఉదాహరణ :

1.బడి గంట శబ్దానికి విద్యార్థులు బడికి రావడం.

2.డ్రిల్ మాస్టారు వేసే విజిల్ శబ్దాలకు అనుగుణంగా విద్యార్థులు ఎక్సర్‌సైజులు చేయడం.

3.డ్రమ్ శబ్దాలకు అనుగుణంగా పోలీసులు, సైనికులు మార్చ్ నిర్వహించడం.

4. ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అనుగుణంగా ఛోదకులు వాహనాలను నడపడం.

5. తరగతి ఉపాధ్యాయుడు "ఉష్" అని మూతి మీది వేలు వేయగానే విద్యార్థులు అందరూ నిశ్శబ్దంగా ఉండిపోవడం.

6. A-Apple, B-Bat, అ-అమ్మ, ఆ-ఆవు లాంటి పదాలు చిన్న పిల్లలు నేర్చుకోవడం అనేది "నిబంధనా అభ్యసనం" అవుతుంది.

పావ్‌లోవ్ కుక్క మీద చేసిన ప్రయోగంలో:

1.ఆహారం : సహజ ఉద్దీపన/నిర్నిబంధిత ఉద్దీపన/UCS (Un conditioned Stimulation)

2. గంట శబ్దం : అసహజ ఉద్దీపన/ నిర్నిబంధిత ఉద్దీపన/CS (Conditional Stimulation)

3. ఆహారానికి లాలాజలం: సహజ ప్రతిస్పందన/నిర్నిబంధిత /UCR (Un Conditioned Respond)

4.గంటకు లాలాజలం: అసహజ ప్రతిస్పందన/బంధిత /CR (Conditioned Respond)

రేపు : పావ్‌లోవ్ ప్రయోగంలోని దశలు

సంపాదకీయం

ప్రగతి స్వరానికి పురస్కారం

కన్నడ కథా రచయిత్రి బాను ముస్తాక్‌కు ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ బుకర్ సాహిత్య పురస్కారం లభించటం సంతోషదాయకం. మతపరంగా మహిళలపై కనపడేవిధంగానూ, కనపడకుండానూ సాగే అణచివేత, వివక్షలపై ఆలోచింపచేసే విధంగా రాసిన చిన్ని కథలకు ఈ బహుమతి రావడం ప్రగతి స్వరానికి పట్టాభిషేకం. భారతీయ సాహిత్యకారులకు ఈ అవార్డు రావడం ఇది రెండోసారి. మూడేళ్ల క్రితం గీతాంజలి శ్రీ రచించిన 'ది టూంబ్ సాండ్'కు బుకర్ పురస్కారం వచ్చింది. అణచివేతను స్వయంగా అనుభవించి, అధిగమించి... ఆ గాయాల నుంచి తనను తాను రూపుదిద్దుకున్న బాను ముస్తాక్ రచయిత్రి మాత్రమే కాదు; న్యాయవాది, సామాజిక కార్యకర్త కూడా. ఎందరో బాధితులకు బాసటగా నిలుస్తున్న బాను సృజియించిన వాస్తవిక కథలకు పురస్కారం లభించటం ద్వారా ఆమె లేవనెత్తిన సమస్యల పైనా ప్రపంచ దృష్టి పడుతుంది. పురుషాధిపత్యం, మత మౌఢ్యం మహిళల అభ్యున్నతికి అడుగడుగునా ఎలా అడ్డు పడతాయో, ధిక్కరించి ముందడుగు వేసినప్పుడు అవి ఎలా ప్రవర్తిస్తాయో ఆమె కథలు కళ్లకు కట్టేలా చెబుతాయి.

కర్ణాటకలోని హాసన్ పట్టణంలో నివసించే 77 ఏళ్ల బాను ముస్తాక్ తన జీవితంలో అడుగడుగునా వివక్షను, వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. మత ఛాందసవాదుల తిట్లకు, వెలివేతకు, దాడులకు గురయ్యారు. అయినా సరే ఆమె ఎక్కడా ఎప్పుడూ ధైర్యాన్ని కోల్పోలేదు. తండ్రి, భర్త ఇచ్చిన మద్దతుతో వాటిని గట్టిగా ఎదుర్కొని, జర్నలిస్టుగా, రచయిత్రిగా, న్యాయవాదిగా, హక్కుల కార్యకర్తగా నిలదొక్కుకున్నారు. ప్రతి సందర్భంలోనూ అస్తవ్యస్తతని, అసమానత్వాన్ని ప్రశ్నించటమే తన వ్యక్తిత్వంగా మలచుకున్నారు. ఆ విధంగా ప్రగతిశీల భావాలకు, ఉద్యమాలకు దగ్గరయ్యారు. నిజ అనుభవాల ప్రేరణతోనే కథలు, కవితలు, నవలలు రాశారు. కర్ణాటక సాహిత్య అకాడెమీ, దాన చింతామణి అత్తిమబ్బె వంటి పురస్కారాలను పొందారు. 1990 - 2023 మధ్య రాసిన 'హసీనా - ఇతర కథలు' అన్న 12 కథల సంపుటినే మరొక రచయిత్రి దీపా భస్తీ 'హార్ట్ ల్యాంప్' పేరిట ఆంగ్లంలోకి అనువదించి, ఇంగ్లాండులో ప్రచురించారు. ఆ పుస్తకమే 13 గ్రంథాల లాంగ్‌లిస్టుని, ఆరు ఎంపికల షార్ట్‌లిస్టుని దాటి, ఈ ఏడాది బుకర్ పురస్కారాన్ని గెలుచుకొంది. ఈ బహుమతి కింద లభించే రూ.57 లక్షలను రచయిత్రి, అనువాదకురాలికి చెరో సగం మంగళవారం రాత్రి లండన్‌లో ప్రదానం చేశారు. 'మహిళల జీవన సంఘర్షణలను 'హార్ట్‌ల్యాంప్' కథలు పరిశీలనాత్మకంగా విశ్లేషించాయి.' అని బుకర్ ప్రైజ్ జ్యూరీ పేర్కొంది. 1969లో ప్రారంభించిన ఈ అవార్డులను తొలుత కామన్వెల్త్ దేశాల రచయితలు ఇంగ్లీషులో రాసిన ఫిక్షన్‌కే ఇచ్చేవారు. తరువాతి కాలంలో పురస్కార నగదును, దేశాల విస్తృతిని పెంచుకుంటూ వచ్చారు. 2016 నుంచి ఇంటర్నేషనల్ బుకర్ పేరుతో అన్ని దేశాల రచయితలకు దీనిని వర్తింపచేస్తున్నారు. 'రచనలు ఇంగ్లీషులో ఉండాలి, ఇంగ్లాండు లేదా ఐర్లాండులో మాత్రమే ప్రచురించాలి' అన్న నిబంధన మాత్రం కొనసాగుతోంది. రచన షార్ట్‌లిస్టులోకి వెళ్లినా, సర్వ ప్రథమంగా నిలిచి పురస్కారం పొందినా – ప్రకటించిన మొత్తాన్ని మూల రచయితకు, అనువాదకులకూ సమంగా పంచుతారు. "ప్రపంచంలో ఎవరు, ఎక్కడ, ఎలాంటి సమాజంలో నివసిస్తున్నా మానవ సంవేదనలన్నీ ఒకటే! వాటిని పంచుకోవటం, సహానుభూతి చెందటం సాహిత్యం ద్వారానే సాధ్యమవుతుంది. ఈ పురస్కారం విశ్వ సాహిత్యపు కిటికీలను తెరుస్తుంది." అంటారు బుకర్ ఫౌండేషన్ నిర్వాహకులు. బాను కథల స్వరాన్ని విన్నప్పుడు ప్రపంచంలోని వివిధ సమాజాలపై వివక్షతో కూడిన మతాల పర్యవేక్షణ, ఆధిపత్య ధోరణి పాఠకుల హృదయాలపై కదలాడి తీరతాయి. బుకర్ పురస్కారం పొందటం ద్వారా ఆమె కథలు అంతర్జాతీయ సమాజానికి దగ్గరవుతాయి. అంతరాలను, అసమానతలను ప్రశ్నించే అక్షర స్వరాలకు సంఘీభావాన్ని, సహానుభూతిని సమకూర్చుతాయి. ఎక్కడి అనుభవాన్నయినా ఇక్కడి సంవేదనలతో అనుసంధానించటమే విశ్వ సాహిత్యపు లక్షణం. ఎక్కడెక్కడి మనుషులతోనైనా సుహృద్భావ సంబంధాన్ని, మానవీయ అనుబంధాన్ని కలిగించటమే సాహిత్య ప్రయోజనం, పరమార్థం!

మంచి మాట

ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థిగానే ఉండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.
- డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, భారత పూర్వ రాష్ట్రపతి.

Radhakrishnan

విశ్లేషణ

నాలుగేళ్ల 'అగ్నిపథ్' ఎవరి కోసం?

పహల్గాం ఉగ్ర దాడి తరువాత భారత్-పాకిస్తాన్‌ల మధ్య చోటుచేసుకున్న కాల్పుల్లో మన రాష్ట్రంలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన 'అగ్నిపథ్ సైనికుడు' మురళీ నాయక్ మృతి చెందారు. దేశ వ్యాప్తంగా నెలకొని ఉన్న భావోద్వేగ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన కుటుంబానికి పరిహారం ప్రకటించాయి. వ్యక్తిగత హోదాలో కొందరు మంత్రులు కూడా సాయం ప్రకటించారు. అయితే, ఇవేవీ హక్కుగా, అధికారికంగా వచ్చినవి కావు. బీమా మొత్తంతో పాటు, ఉదారంగా ఇచ్చినవే! దీంతో రెగ్యులర్ సైనికులు యుద్ధ రంగంలో మరణిస్తే ఇచ్చే విధంగా అన్ని రకాల సహాయాలను 'అగ్ని వీరుడి' కుటాంబానికి అందించాలన్న డిమాండ్ ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో రెగ్యులర్ సైనికులకు, అగ్నిపథ్ జవాన్లకు ఉన్న తేడా ఏమిటి? 'అగ్నిపథ్' యువతకు లాభామా, నష్టమా? అసలు 'అగ్నిపథ్' ఎవరి కోసం?

ఆయుధాలను ప్రయోగించగల సామర్థ్యం ఉన్న అగ్నివీర్‌లు సంవత్సరానికి 37,500 మంది కఠోరమైన నిరుద్యోగ ప్రపంచంలోకి వచ్చిపడుతుంటారు. వారికి కడుపు నింపుకోవడమే సమస్య అవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలోచించారా? ప్రభుత్వ నిరాకరణకు నిరసనగా ఇంత పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత ఒక ఉగ్రవాద సంస్థలో చేరితే తలెత్తే పరిణామాలను మోడీజీ ఆలోచించారా? ఆర్మీ ప్రయోజనాల దృష్ట్యా, దేశ ప్రయోజనాల రీత్యా, ఈ 'అగ్నివీర్' ప్రాజెక్టును వెంటనే ఉపసంహరించుకుని, సైన్యం-పౌర రక్షణలో ఉన్న అన్ని ఖాళీలను పూర్వపు పద్ధతిలో భర్తీ చేయడం ఎంతైనా అవసరం.

శ్యామల్ కుమార్ మిత్రా

భారత్‌కు ఏడు పొరుగు దేశాలతో భూ, సముద్ర సరిహద్దులున్నాయి. ఇవి వరుసగా 14,868 కిమీ, 7,000 కిమీ (మొత్తం 21,868 కిమీ). ఒక్క బంగ్లాదేశ్‌తోనే 4,026 కిమీ భూ సరిహద్దు ఉంది. వీటిలో చాలా వరకు కంచె గాని, బి.ఎస్.ఎఫ్ పహారా గాని లేదు. ఇక, పాకిస్తాన్‌తో 3,323 కిమీ సరిహద్దు ఉంది. భారత్‌కు పొరుగు దేశాలతో సత్సంబంధాలనేవి గతానికి సంబంధించినవి. సోవియట్ రష్యా పతనం తర్వాత, యుద్ధ పరిస్థితిలో భారత్‌కు ప్రత్యక్షంగా అండగా నిలిచే దేశం ప్రపంచంలో మరేదీ లేదు. పైగా దేశంలో సైన్యం వినియోగం పెరుగుతోంది! అంతే కాదు. త్రివిధ దళాలు ఒకేసారి యుద్ధంలో పాల్గొనడం అసాధ్యం. ఈ పరిస్థితుల్లో, సైన్యాన్ని బలహీనపరిచే ఒక ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టడం చాలా ప్రమాదకరం. ఈ చర్యను ఖండించాలి కూడా.

భారత ఆర్మీ 12 లక్షల మంది సైనికులతో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద సైనిక దళం. ప్రతి సంవత్సరం 55,000 మంది సైనిక సిబ్బంది పదవీ విరమణ చేస్తున్నారు. ప్రతి సంవత్సరం సగటున 60,000 మంది సైన్యంలోకి నియమితులవుతున్నారు. దేశంలోనే అతి పెద్ద ఉద్యోగ సంస్థ సైన్యం. భారత సైనికుల శారీరక, మానసిక బలం, వృత్తి నైపుణ్యాలు, క్రమశిక్షణ, సామర్థ్యం, దేశభక్తి, త్యాగాలు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందుతున్నాయి. దీనికి కారణం అధిక-నాణ్యత, దీర్ఘకాలిక సైనిక శిక్షణా పద్ధతులు. ఆర్మీ లోని ఒక్కో సైనికుడు ఏడు సంవత్సరాల పాటు అత్యంత కఠినమైన శిక్షణ పొందుతాడు. శిక్షణలో విజయం సాధించిన వారిని యుద్ధ భూమిలో సైనికులకు సహాయకులుగా నియమిస్తారు.

అక్కడ అవసరమైన అనుభవాన్ని గడించడానికి సైనికులను సహాయకులుగా నియమిస్తారు. అప్పుడు వారు నేరుగా యుద్ధంలో పాల్గొనవచ్చు. సైనికులకు ఇటువంటి సుదీర్ఘ శిక్షణ ఇవ్వడమనేది చాలా సాధారణమైన విషయం. 15 సంవత్సరాలపాటు సైన్యంలో సేవ చేసిన ఒక సైనికుడు ఉద్యోగ విరమణ చేసినప్పుడు...7 సంవత్సరాల శిక్షణతో కూడిన 15 సంవత్సరాల పని అనుభవమున్న సైనికుడిని ఆర్మీ కోల్పోతుంది. కఠోరమైన వ్యాయామం, క్రమశిక్షణ, సమతుల ఆహారం, అనుకూలమైన పని వాతావరణం, ఐక్యతా భావం, దేశం కోసం పని చేయాలనే మక్కువ వంటివన్నీ పౌర సమాజంలోని తోటివారితో పోలిస్తే రిటైర్మెంట్ సమయంలో ఆర్మీ జవాన్ శారీరక, మానసిక ఆరోగ్యంతో చురుకుగా వుంటాడు.

32 నుంచి 36 ఏళ్ల మధ్య సైనిక సిబ్బంది ఉద్యోగ విరమణ చేయాలనే నియమాన్ని దేశ తొలి రక్షణ దళాధిపతి, దివంగత బిపిన్ రావత్ వ్యతిరేకించారు. వీరిలా నైపుణ్యం, క్రమశిక్షణ కలిగిన మానవ వనరులను మరో 15 సంవత్సరాలు ఉపయోగించడం ఆర్మీకి ఎంతో ప్రయోజనకరమని ఆయన విశ్వసించారు. 62 సంవత్సరాల వయస్సులో ఉన్న ఒక సైనిక అధికారి ఆశించిన సామర్థ్యం, నాణ్యత, వేగంతో సేవలను అందించగలిగినప్పుడు...32-36 సంవత్సరాల మధ్య వయస్సుగల జవాన్ ఏ కారణం చేత ఆవిధంగా పనిచేయలేడనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. సైనిక సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు పెంచాలని ఆయన ప్రభుత్వానికి లిఖితపూర్వక ప్రతిపాదనను సమర్పించారు. అయితే, సైనికుల రిటైర్మెంట్ వయస్సు, సైన్యం సగటు వయస్సు ఎంత ఉండాలనే దానిపై సైన్యంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

యుద్ధం ప్రజలకు హాని కలిగిస్తుంది. ఈ ప్రపంచం యుద్ధం నుండి విముక్తి పొందితే మంచిది. ప్రపంచంలో యుద్ధానికి, సైన్యానికి ఖర్చు చేసే భారీ మొత్తాన్ని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించినట్లయితే ప్రపంచ ముఖచిత్రమే మారిపోతుంది. కానీ దాడి, దురాక్రమణ, యుద్ధం నిజమైనప్పుడు, దేశ ప్రయోజనాల కోసం సైన్యానికి డబ్బు కేటాయించేందుకు ఏ దేశమూ ఏమాత్రం వెనుకాడదు. సైన్యం సగటు వయస్సు తగ్గింపును, సైన్యం మీద చేసే ఖర్చు తగ్గింపును కారణంగా చూపించిన మోడీ ప్రభుత్వం...2022 నుండి 'లెఫ్టినెంట్' స్థాయి కంటే దిగువన ఉన్న అన్ని శాశ్వత పోస్టులకూ నియామకాలను నిలిపివేసింది. 'అగ్నిపథ్' ద్వారా మాత్రమే సైనిక నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది.

వాస్తవం ఏమిటంటే...సైన్యానికి, దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న ఈ అగ్నిపథ్ ప్రాజెక్టును ఉపసంహరించు కోవాలని, సైన్యంలో భారీ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ, వ్యక్తిగతంగా లేదా సమిష్టిగా ఒక ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి...వామపక్షాలు మినహా ఏ బిజెపి యేతర పార్టీ కూడా చొరవ తీసుకోలేదు. 17 నుండి 21 సంవత్సరాల మధ్య వయస్సుగల యువకులను 'అగ్నివీర్ ప్రాజెక్ట్' కింద 4 సంవత్సరాల పాటు సైన్యంలో నియమించుకుంటారు. ఏటా 46,000 మంది అగ్నివీర్ సిబ్బందిని నియమిస్తారు. వీరిలో 75 శాతం మంది (34,500) 4 సంవత్సరాల తర్వాత 25 సంవత్సరాల వయస్సులో రిటైర్ అవుతారు. మిగిలిన 25 శాతం మంది (11,500) 4 సంవత్సరాల తర్వాత శాశ్వత సైనిక సిబ్బందిగా నియమితులవుతారు. ఇతర శాశ్వత నియామకాలేవీ ఉండవు.

దీని ఫలితం ఎలా వుంటుంది?

మొదటిది-2019 జనవరి 1 నాటికి, సైన్యంలో 1,04,653 ఖాళీలు ఉన్నాయి. 2019 నుండి 2023 వరకు నాలుగు సంవత్సరాలలో శాశ్వత నియామకాలు జరగలేదు. 2025 వరకు శాశ్వత నియామకాలు ఉండవు. సంవత్సరానికి సగటున 55,000 ఉద్యోగ విరమణలతో 2026 జనవరి 1 నాటికి సైన్యంలో (1,04,653 + 55,000 x 7) 4,89,653 ఖాళీలు ఉంటాయి. 12 లక్షల మంది సైనికుల స్థానంలో 7 లక్షల మంది సైనికులు ఎంత పని చేయగలరు? అత్యవసర సమయాల్లో సైన్యానికి సహాయం చేయగల సెంట్రల్ సివిల్ డిఫెన్స్ ఫోర్స్‌లో 2022 జనవరి1 నాటికి 2,50,000 ఖాళీలు ఉన్నాయి. సైన్యంలో ఇంత పెద్ద సంఖ్యలో ఖాళీలున్న సమయంలో ఒకవేళ యుద్ధాన్ని ఎదుర్కోవాల్సి వస్తే! పౌర రక్షణ మాటేమిటి? దేశం ఇబ్బందుల్లో పడుతుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

రెండవది-2026 నుండి ఏటా 11,500 మంది అగ్నివీర్‌లను శాశ్వత స్థానాలకు నియమిస్తారు. చాలా పెద్ద సంఖ్యలో సైనికులు ఉద్యోగ విరమణ చేస్తారు. కాబట్టి 2026 నుండి, ఈ 7 లక్షలుగా వున్న సైన్యం సంఖ్య ప్రతి సంవత్సరం తగ్గుతూనే ఉంటుంది.

మూడవది-నాలుగు సంవత్సరాల అగ్నివీర్ లను 6 నెలల నామ్ కే వాస్తే శిక్షణ తర్వాత నేరుగా యుద్ధానికి పంపుతారు. ఏడేళ్ల శిక్షణ తర్వాత సైన్యానికి సహాయకులుగా వెళ్లడానికి... కేవలం ఆరు మాసాల శిక్షణతో సైనికులకు సహాయకులుగా పంపడానికి ఎంత వ్యత్యాసం వుంటుంది? ఇది ప్రత్యామ్నాయం అవుతుందా? యుద్ధం జరిగే అవకాశం ఉన్న దేశాలు తమ దళాల సంఖ్యను పెంచడంతో పాటు శిక్షణా వ్యవధిని, నాణ్యతను నిరంతరం మెరుగు పరుస్తున్నాయి. యుద్ధ భూమిలో సైనిక శిక్షణ పొందిన శత్రు సైనికులతో పోటీ పడటానికి...6 నెలల శిక్షణతో నాలుగేళ్ల కాంట్రాక్ట్ సైనికులు ఏ మంత్రదండాన్ని ఉపయోగిస్తారు?

నాల్గవది-2026 నుండి ఏటా 60,000 మందికి బదులుగా 11,500 మంది అగ్నిమాపక సిబ్బందిని శాశ్వత స్థానాలకు నియమిస్తారు. అంటే ఏటా 48,500 శాశ్వత నియామకాలకు అవకాశం తగ్గిపోతుంది. దేశ జనాభాలో 50 శాతం 24 ఏళ్ల లోపువారు. 65 శాతం మంది 35 ఏళ్ల లోపువారు. జనాభా సగటు వయస్సు 27.5 సంవత్సరాలు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి చూసినట్లయితే ప్రస్తుతం దేశంలో నిరుద్యోగం అత్యధిక స్థాయిలో ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ ఉపాధి దాదాపు సున్నా. ప్రభుత్వం సంవత్సరానికి ఉద్యోగ అవకాశాల సంఖ్యను 45,500కు తగ్గించడం ద్వారా నిరుద్యోగుల సంఖ్యను పెంచింది. ఇది ఉద్యోగార్థులను నిరాశపరిచింది.

ఐదవది-నాలుగేళ్ల తర్వాత రిటైర్ అయిన అగ్నివీర్ లకు ఎటువంటి పెన్షన్ లభించదు. 4 సంవత్సరాల సర్వీస్ సమయంలో తమ నెలవారీ జీతం నుండి 30 శాతం చొప్పున పక్కన పెట్టిన రూ.5,04,000 (వడ్డీని మినహాయించి), ప్రభుత్వం నుండి రూ.6,67,000 పొందుతారు. నాలుగేళ్ల సర్వీస్ తర్వాత, 21-25 సంవత్సరాల మధ్య వయస్కులైన అగ్నివీర్‌లు ప్రతి సంవత్సరం 37,500 మంది తమ ఉద్యోగాలను కోల్పోయి మళ్ళీ ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తారు. 25 సంవత్సరాల వయస్సులో ఉద్యోగం చేస్తూ మళ్ళీ నిరుద్యోగిగా మారడం, నెలవారీ ఆదాయం పూర్తిగా ఆగిపోవడం ఇవన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి వున్న సమస్యలు. ఈ 4 సంవత్సరాలు వారికి చదువుకోవడానికి లేదా మరో ఉద్యోగానికి సిద్ధం కావడానికి అవకాశం ఉండదు. కాబట్టి ఈ అగ్నిపథ్ సిబ్బంది అత్యంత పోటీ వాతావరణం వున్న ఉపాధి మార్కెట్‌లో కొత్త ఉద్యోగాలను పొందలేరని భావించవచ్చు. వాస్తవానికి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉద్యోగ విరమణ చేసిన సైనిక సిబ్బందికి కేటాయించిన 92-95 శాతం స్థానాలు ఎల్లప్పుడూ ఖాళీగా ఉంటాయి. భర్తీ చేయబడవు. ప్రభుత్వం సైన్యం కోసం రిజర్వు చేసిన ఉద్యోగాలను తగ్గించాలన్న 'వ్యూహా'న్ని వేసినప్పుడు...అగ్నివీర్ అనే ఈ నాలుగేళ్ల కాంట్రాక్టు కార్మికులను ఉద్యోగ విరమణ తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో నియమించడం చాలా కష్టం. ఈ విషయాన్ని పక్కన పెడితే, రిటైర్ అయిన వారికి ఆర్మీ ప్రదానం చేసే బ్యాచిలర్ డిగ్రీలను ఏ ప్రభుత్వమూ గుర్తించదు.

ఆరవది-ఆయుధాలను ప్రయోగించగల సామర్థ్యం ఉన్న అగ్నివీర్‌లు సంవత్సరానికి 37,500 మంది కఠోరమైన నిరుద్యోగ ప్రపంచంలోకి వచ్చిపడుతుంటారు. వారికి కడుపు నింపుకోవడమే సమస్య అవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆలోచించారా? ప్రభుత్వ నిరాకరణకు నిరసనగా ఇంత పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత ఒక ఉగ్రవాద సంస్థలో చేరితే తలెత్తే పరిణామాలను మోడీజీ ఆలోచించారా? ఆర్మీ ప్రయోజనాల దృష్ట్యా, దేశ ప్రయోజనాల రీత్యా, ఈ 'అగ్నివీర్' ప్రాజెక్టును వెంటనే ఉపసంహరించుకుని, సైన్యం-పౌర రక్షణలో ఉన్న అన్ని ఖాళీలను పూర్వపు పద్ధతిలో భర్తీ చేయడం ఎంతైనా అవసరం. జాతీయ భద్రత విషయంలో రాజీ పడటానికి ఆస్కారం లేదు. అవాస్తవ ఆలోచనలను అమలు చేయాలనుకోవడం కూడా సరి కాదు.

/ 'గణశక్తి' సౌజన్యంతో /

వ్యాఖ్య

పాలకుల సైన్స్, గణిత పరిజ్ఞానం అమోఘం!



మహా కుంభమేళాకు అరవై ఆరు కోట్ల మంది వచ్చి పుణ్యస్నానాలు చేశారని మన దేశ నాయకులు, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర నాయకులు కలిసికట్టుగా డప్పుకొట్టి ప్రచారం చేసుకున్నారు. అదెలాగా? అని అడిగితే మన లాంటి సామాన్యులకు వారు సమాధానం చెప్పరు. మనం అల్పులం కదా? వారి గణిత స్థాయిని మనం అందుకోలేమని వారు అనుకొని ఉండొచ్చు. అందుకే కొన్ని సంస్థలు, కొందరు స్వతంత్ర జర్నలిస్టులు లెక్కలు వేశారు. ఏలిన వారి గణిత పరిజ్ఞానం ఇదీ అని ప్రజల ముందు పెట్టారు. దేశ జనాభా 140 కోట్లు. ఇందులో 66 కోట్లు అంటే, సుమారు సగం జనాభా కుంభమేళా స్నానాలు చేశారని కదా చెప్పుకుంటున్నారు. దేశంలో పసిపాపలు, పదేళ్ల లోపు పిల్లల జనాభా 25 కోట్లు. సుమారు 15 కోట్ల మంది వయోవృద్ధులు, వికలాంగులు-ముస్లింలు-క్రైస్తవులు ఇంకా ఇతర మతస్థులు 20 కోట్ల మంది ఉన్నారు. వీరెవరూ కుంభమేళా స్నానాలకు రాలేదు. రానివారి లెక్క చూస్తే, అది సుమారు 55 కోట్ల మంది అవుతున్నారు. వీరుగాక, అలాంటి సనాతన సంప్రదాయం పట్ల అభిరుచి లేని వారు విముఖత చూపేవారు మరి, కోట్ల మందే ఉంటారు. వీరందరిని తీసేస్తే స్నానాలు చేసిన వారి సంఖ్య 66 కోట్లు ఎలా వస్తుంది? వచ్చారనడానికి ఆధారమే లేదు.

కేంద్రంలో అధికారంలో ఉన్న మన దేశ నాయకుల ఆలోచనా విధానం ఎలా ఉంది? గణితం, సైన్సు వంటి విషయాల పట్ల వారికున్న పరిజ్ఞానం ఎంత అనేది బేరీజు వేసుకుందాం!

మహా కుంభమేళాకు అరవై ఆరు కోట్ల మంది వచ్చి పుణ్యస్నానాలు చేశారని మన దేశ నాయకులు, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర నాయకులు కలిసికట్టుగా డప్పుకొట్టి ప్రచారం చేసుకున్నారు. అదెలాగా? అని అడిగితే మన లాంటి సామాన్యులకు వారు సమాధానం చెప్పరు. మనం అల్పులం కదా? వారి గణిత స్థాయిని మనం అందుకోలేమని వారు అనుకొని ఉండొచ్చు. అందుకే కొన్ని సంస్థలు, కొందరు స్వతంత్ర జర్నలిస్టులు లెక్కలు వేశారు. ఏలిన వారి గణిత పరిజ్ఞానం ఇదీ అని ప్రజల ముందు పెట్టారు. దేశ జనాభా 140 కోట్లు. ఇందులో 66 కోట్లు అంటే, సుమారు సగం జనాభా కుంభమేళా స్నానాలు చేశారని కదా చెప్పుకుంటున్నారు. దేశంలో పసిపాపలు, పదేళ్ల లోపు పిల్లల జనాభా 25 కోట్లు. సుమారు 15 కోట్ల మంది వయోవృద్ధులు, వికలాంగులు-ముస్లింలు-క్రైస్తవులు ఇంకా ఇతర మతస్థులు 20 కోట్ల మంది ఉన్నారు. వీరెవరూ కుంభమేళా స్నానాలకు రాలేదు. రానివారి లెక్క చూస్తే, అది సుమారు 55 కోట్ల మంది అవుతున్నారు. వీరుగాక, అలాంటి సనాతన సంప్రదాయం పట్ల అభిరుచి లేని వారు విముఖత చూపేవారు మరి, కోట్ల మందే ఉంటారు. వీరందరిని తీసేస్తే స్నానాలు చేసిన వారి సంఖ్య 66 కోట్లు ఎలా వస్తుంది? వచ్చారనడానికి ఆధారమే లేదు. ఇలా కాకుండా, మరో రకంగా కూడా ఒక సంస్థ వారు సర్వే నిర్వహించారు. బస్సులు, రైళ్లు, విమానాలు, కార్లు వంటి వాటిపై అక్కడికి చేరుకున్న వారి సంఖ్య లెక్క కట్టారు. ఏ వాహనంలో ఎంతమంది ప్రయాణించగలరో మనకు తెలుసు గనుక, రోజుకు అవి ఎన్ని ట్రిప్‌లు వేయగలవో తెలుసు గనక ఒక రోజులో ప్రయాగ్‌కు ఎంతమంది చేరుకోగలరో తెలిసిపోతుంది. ఆ రకంగా మన పాలకులు చెప్పే 66 కోట్ల జనం అబద్ధం అని తేలింది.



డా॥ దేవరాజు మహారాజు

కుంభమేళాలో తొక్కిసలాట జరిగి కొందరు మరణిస్తే, అక్కడి టెంట్‌లు తగలబడి కొందరు, రోడ్డు ప్రమాదాల్లో కొందరు, రైల్వేస్టేషన్‌లలో తొక్కిసలాట జరిగి కొందరు మరణిస్తే, రాష్ట్ర, దేశ నాయకులెవరూ సంతాపం తెలుపలేదు. తమ అసమర్థతను ఒప్పుకుని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సింది-చెప్పలేదు. మృతుల కుటుంబాలను ఏ రకంగానూ ఆదుకోలేదు. పైగా-కుంభమేళా మృతులకు "భగవంతుడు లభించాడని'-యు.పి ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ యోగి కూడా అదేవిధంగా భగవంతుడిలో ఐక్యం కావడానికి ప్రయత్నించవచ్చు కదా? రోగాల బారిన పడ్డ వాళ్లూ, కాళ్లూ, చేతులూ విరిగినవారు ఎందరో ఆస్పత్రుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. యోగి చెప్పిన విధంగా వారికి భగవంతుడు ప్రాప్తించడం లేదు. ఇక్కడ సామాన్య జీవితమూ దొరకడం లేదు. ఇక యోగి, మోడీలు కూడా దేశ ప్రజల్ని నమ్మించడానికి చుట్టూ తాళ్లు కట్టుకుని, బాడీగార్డులను పెట్టుకుని కుంభమేళా స్నానం చేశామనిపించారు. వారికి బాడీగార్డుల మీద ఉన్న విశ్వాసం దేవుడి మీద లేదన్నది ఈ దేశ ప్రజలకు అర్థమైంది. ఆ సందర్భంలోనే ఒక సంఘటన జరిగింది. ఒక బిజెపి అంధభక్తుడు మురికి గంగలో పలుమార్లు మునిగి తేలడం వల్ల, పవిత్ర జలాలనుకుని వాటిని మింగడం వల్ల- తీవ్రంగా జబ్బుపడ్డాడు. అతనికి గత ప్రభుత్వం కాంగ్రెస్ అంటేనే చిర్రెత్తుకొస్తుంది. అందువల్ల తమ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కట్టించిన ఆసుపత్రిలోనే తనను చేర్పించాలని పట్టుబట్టాడు. కుటుంబ సభ్యులూ, మిత్రులూ కలిసి ఆసుపత్రుల చరిత్ర తవ్వుతూ తిరిగారు. వారి పట్టణంలో కాదుగదా, దేశమంతా దుర్భిణి వేసి వెతికినా అలాంటిది ఏదీలేదని, తెలిసేసరికి పేషెంట్‌కు ప్రాణం మీదికి వచ్చింది. విధి లేక అందుబాటులో ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రిలోనే చేర్పించారు.

ఈ ప్రపంచమే నిద్రలో జోగుతున్న మనుషుల గుంపు! నిద్రలో ఉన్నవారు మెలకువగా ఉన్నవారిని భరించలేరు. విశ్వాసకులు అవిశ్వాసకుల్ని భరించలేనట్టుగా మెలకువగా ఉన్నవారు ఏవేవో శబ్దాలు చేస్తున్నారని, తమను నిద్రపోనివ్వడం లేదని నిద్రలో జోగే జనం, మనోభావాలు దెబ్బ తీసుకుంటారు. ఉత్తరప్రదేశ్‌లోని ఒక జైలు అధికారులు మహా కుంభమేళా త్రివేణి సంగమం నుండి కొన్ని నీళ్ల తెప్పించారు. జైలు ట్యాంకులో కలిపి అక్కడి ఖైదీలందరికీ ఆ నీళ్లతో స్నానం చేసే అవకాశం కలిగించారు. వారి పాపాలు తొలగిపోతాయన్నది వారి విశ్వాసం. అదే నిజమైతే, పాపాలు తొలిగిన ఖైదీలు కొందరైనా విడుదల కావాలి కదా? బీఫ్ కంపెనీల నుండి బలవంతంగా చందాలు వసూలు చేసుకునేవారు వరుసగా మహాకుంభ మేళాకు క్యూ కట్టారట! బీఫ్ కంపెనీ యజమానులంతా బిజెపి వారే గనుక, వారెలాగూ, ముందే వెళ్లి మునిగి ఉంటారు. వీరందరి పాపాలు పోవాలి కదా! ముస్లింల పేర్లతో బీఫ్ ఎగుమతులు చేసే బిజెపి వారు పవిత్రులైపోయినట్టేనా? వారు మళ్లీ కొత్త పాపాలు చేసుకోవచ్చా?

కుంభమేళా పేరుతో చాలా గమ్మత్తులు జరిగాయి. అందులో ఒకటి ఇలా జరిగింది. కుంభమేళాకు వెళ్లలేని వారు వారి ఫొటోలు పంపితే ఆ ఫొటోలను త్రివేణి సంగమంలో ముంచి, మంత్రోచ్చారణతో మంగళ స్నానం చేయిస్తాం. దీనివల్ల కుంభమేళా స్నాన ఫలితం ఆ ఫొటోలో ఉన్న వారికి సంపూర్ణంగా లభిస్తుంది. ఈ అవకాశం ఉపయోగించుకోదలచిన వారు ఈ కింది ఫోన్ నెంబర్‌కు రూ.500 ఫోన్ పే గాని, గూగుల్ పే గాని చేయవచ్చు అని ఒక సంస్థ ప్రకటించింది. ఇకనేం మన దేశంలో అంధవిశ్వాసులకేం తక్కువ? వేల మంది ఎగబడ్డారు. వాడెవడో తెలివిగా కూచున్నచోట నుంచి కదలకుండా డబ్బు సంపాదించుకున్నాడు. వచ్చిన ఫొటోలు ఏరోజుకారోజు కాల్చేశాడు. విషయం బయటికి రాకుండా జాగ్రత్తపడ్డాడు. అయినా ఆ సంస్థ చేసిన మోసం పత్రికలెక్కింది. "పావన్ గంగాకి జల్ పవిత్ర్ హై, స్వచ్ఛ్ హై"-అని యు.పి ముఖ్యమంత్రి గొప్పగా మాట్లాడితే సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ "మిస్టర్ యోగీ! ఆ నీటిని తాగి చూపించు" అని సవాల్ విసిరారు. మహా కుంభమేళా నీటిలో ఫీకల్ (మలంలో వుండే) బ్యాక్టీరియా అధికంగా వుందన్న రిపోర్టు సంచలనంగా మారిన నేపథ్యంలో యోగికి ఆ సవాల్ విసిరారు ఆయన. యోగి నోరు మెదపలేదు.

మోసపోవడానికి రెండు మార్గాలున్నాయి. 1.సత్యం కాని దాన్ని నమ్మడం. 2.సత్యాన్ని నమ్మడానికి ఇష్టపడక, తిరస్కరించడమే అంటారు డానిష్ తత్వవేత్త, రచయిత సోరెన్ ఆబీ కీర్కెగార్డ్.

జీవశాస్త్రం మీద, వైద్యశాస్త్రం మీద మంచి "పట్టు" సాధించిన సంప్రదాయ సనాతన వాది కృష్ణ స్వరూప్‌దాస్‌జీ తన ప్రవచనంలో భక్తులకు ఇలా చెప్పాడు. "నెలసరిలో భర్తలకు వంట చేసి పెట్టే భార్యలు కుక్కలుగా పుడతారు." -గుజరాత్‌లోని భుజ్‌లో స్వామి నారాయణ్ మందిర్‌లో ఈ "వైజ్ఞానిక" అంశాన్ని సెలవిచ్చారు. దీన్ని మనం నమ్మాలి అని వారి భావన! అలాగే కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సత్య పాల్ సింగ్ మరొక అంశాన్ని వెలుగులోకి తెచ్చాడు. "వానరం నరుడిగా మారడాన్ని మనం చూడలేదు. మన పూర్వీకులు కూడా చూడలేదు. అసలు ఇంత వరకు ఎవరూ చూడలేదు. అందువల్ల జీవ పరిణామ సిద్ధాంతం తప్పు-దీన్ని మన విద్యాసంస్థల సిలబస్‌ల నుండి తీసివేయాలి!" అన్నాడు. దీన్ని అలా ఉంచి, వారు నమ్మే సృష్టి సిద్ధాంతాన్నే పరిశీలిద్దాం. మరి దేవుడిని ఎవరు చూశారూ? దేవుడు మనుషులను యథాతథంగా సృష్టిస్తున్నప్పుడు ఎవరు చూశారు? సత్యపాల్ సింగ్ కానీ, అతని పూర్వీకులు గానీ, వారివారి పూర్వీకులుగానీ చూశారా? ఆయన మనల్ని అడిగిన లాజిక్‌నే ఉపయోగించి మనం ఆయన్ని అడుగుతున్నాం కదా?

'కమలం గుర్తు ఈ దేశంలో ఒక తాయెత్తు లాంటిది. అది దగ్గరుంచుకుంటే-ఈడి, ఐటి లాంటివేవీ పట్టి పీడించవు' అన్నాడొక యువ సైన్సు కార్యకర్త వ్యంగ్యంగా-నిజమే కదా మనం చూస్తున్నది!

/ వ్యాసకర్త త్రిపురనేని రామస్వామి జాతీయ పురస్కార తొలి గ్రహీత /

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality

మంగళగిరి బ్రాంచ్, డి.నెం.ఎఫ్-427 & 428, 1వ అంతస్తు, అంకమ్మస్ ప్లాజా, తెనాలి రోడ్డు, మంగళగిరి-522503
CIN : L85110KA1987PLC008699.
ఇ-మెయిల్ : mangalagiri@canfinhomes.com
ఫోన్ : 7625079244, ల్యాండ్‌లైన్ నెం : 08645-234589

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

[proviso to rule 9 (1)]

(సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద నిబంధన 9 (1) ప్రకారం, బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తి అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు) ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులు తనఖా/చార్జ్‌డ్, సెక్యూర్డ్ క్రెడిటార్ వారికి ఉంచబడినవి. సదరు ఆస్తులు అధీకృత అధికారి, **కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్, గుంటూరు బ్రాంచ్** వారిచే **భౌతికంగా స్వాధీనత** చేసుకోబడి **తేది.09.06.2025** న **"ఎక్కడ ఉన్నది అక్కడే", "అక్కడ ఏమున్నదో అదే"** మరియు **"అక్కడ ఏది ఉన్నా సరే"** అనే ప్రాతిపాదికపై వేలం ద్వారా అమ్మకం జరుపబడును. కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారిచే **ఋణగ్రహీత : లేటు గల్లవల్లి రామకృష్ణ మరియు శ్రీమతి గల్లవల్లి రాజ్య లక్ష్మీ, శ్రీ గల్లవల్లి భాస్కర్, శ్రీ గల్లవల్లి యశ్వంత్, శ్రీ గల్లవల్లి పునీత్** వార్లను **తేది.22.05.2025** నాటికి **రూ.46,60,542/- (అక్షరాల నలభై ఆరు లక్షల అరవై వేల ఐదు వందల నలభై రెండు రూపాయలు మాత్రమే)** వసూలు కొరకు, తదుపరి వడ్డీ మరియు ఇతర అన్ని ఛార్జీలతో సహా.

రిజర్వు ధర రూ.34,00,000/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల రూపాయలు మాత్రమే)
ధరావత్తు రూ.3,40,000/- (అక్షరాల మూడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు - ఎ : విజయవాడ రూరల్, గొల్లపూడి, ఆర్ఎస్ నెం.561లో, ప్లాటు నెం.28 భాగం మరియు ప్లాటు నెం.29లో ఉన్న విస్తీర్ణం 300 చ॥గ॥లలో 27 చ॥గ॥లు అవిభాజ్యమైన వాటా కలిగిన యావత్తు ఆస్తి నకు **హద్దులు : తూర్పు :** 33 అ॥ల వెడల్పు గల రోడ్, **పడమర :** ప్లాటు నెం.20, 21 భాగము, **ఉత్తరం :** ప్లాటు నెం.30, **దక్షిణం :** ప్లాటు నెం.28.

షెడ్యూలు -బి : షెడ్యూలు ఎ నందు చూపబడిన స్థలం లో ఉన్న **"వై.ఎస్.ఆర్.హోమ్స్"** నందు ప్లింత్ ఏరియా, కామన్ బాల్కని ఏరియా 1250 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లు కలిగి, గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నెం.103 యావుత్తు ఆస్తినకు **హద్దులు : తూర్పు :** కామన్ కారిడార్, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ప్లాటు నెం.102, **దక్షిణం :** ఓపెన్ టు స్కై.

ఋణభారములు : లేవు

అమ్మకం పూర్తి నియమములు మరియు నిబంధనలు **కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి అధికారిక వెబ్‌సైట్ : **(https://www.canfinhomes.com/SearchAuction.aspx)** నందు ఇవ్వబడినవి.
ఇ-వేలంలో పాల్గొనడానికి **www.bankeauctionwizard.com** లింకను చూడగలరు.

తేది : 22.05.2025
ప్రదేశం : మంగళగిరి

సం/- అధీకృత అధికారి
కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ, చిరునామా : 4వ ఫ్లోర్, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూల్ 6(2)/8(6) ప్రకారం)

వీరికి : ఋణగ్రహీతలు: శ్రీ సోము సుబ్రహ్మణ్యం, తండ్రి : సోము నరసింహారావు, డి.నెం.41-1-17-4, రాణిగారి తోట, బాపనయ్య నగర్, కృష్ణలంక, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520013. **వేరొక చిరునామా: శ్రీ సోము సుబ్రహ్మణ్యం,** తండ్రి : సోము నరసింహారావు, ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-1, మొదటి అంతస్తు, సాయి టవర్స్, డోర్ నెం.12-4, రావి సుబ్బయ్య కాలనీ, రావి ప్రసాద్ వీధి, యనమలకుదురు గ్రామం, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 520007. **శ్రీమతి సోము సరస్వతి,** భర్త : సోము సుబ్రహ్మణ్యం, డి.నెం.41-1-17-4, రాణిగారి తోట, బాపనయ్య నగర్, కృష్ణలంక, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520013. **వేరొక చిరునామా: శ్రీమతి సోము సరస్వతి,** భర్త : సోము సుబ్రహ్మణ్యం, ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-1, మొదటి అంతస్తు, సాయి టవర్స్, డోర్ నెం.12-4, రావి సుబ్బయ్య కాలనీ, రావి ప్రసాద్ వీధి, యనమలకుదురు గ్రామం, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 520007. **వేరొక చిరునామా: శ్రీమతి సోము సరస్వతి,** భర్త : సోము సుబ్రహ్మణ్యం, కేరాఫ్ : సాయి దుర్గ స్టోర్స్, డి.నెం.30-19-30ఎ, చాప్రాలవల వీధి, వార్డు నెం.25, సీతారామపురం, విజయవాడ - 520004.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం బ్యాంకు వారికి శ్రీ సోము సుబ్రహ్మణ్యం వారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001 వారి సెక్యూర్డ్ క్రెడిటార్ మీరు బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం **తేది.04.11.2023**న డిమాండ్ నోటీసును జారీ చేసినారు. నిర్దేశించిన సమయంలో, నిర్ణీత వ్యవధిలో మీరు నోటీసులో పేర్కొన్న బకాయిని చెల్లించడంలో విఫలమైనందున అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6/8తో చదివే చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం స్థిరాస్తులను **తేది.22.04.2024**న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని లాంఛనంగా స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించలేదు. కావున ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తులను విక్రయించడం కొరకు బహిరంగ ఇ-వేలం నిర్వహిస్తారు. ఇ-వేలం యొక్క తేదీ మరియు సమయం, ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించాల్సిన సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కావున, మీరు బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో పాటు బ్యాంక్‌కు చెల్లించినట్లయితే ఆస్తి అమ్మకంపై తదుపరి చర్యలు తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ ఆస్తిని విడిపించుకోవచ్చు.

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు-ఎ: కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామం & పంచాయితీ, సుబ్బయ్య రోడ్డు, రావి ప్రసాద్ వీధి, ఆర్.ఎస్.నెం.86/1 లోని సమీప డోర్ నెం.12-4 వద్ద 265.41 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో 37.90 చ॥గ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణంతో గల స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** రావి కొండలరావు గారి ఆస్తి, **దక్షిణం:** పేరేవి లక్ష్మి గారి ఆస్తి, **పడమర :** 30 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** రావి ప్రసాద్ గారు ఇతరులకు అమ్మిన ఆస్తి.

షెడ్యూలు-బి: షెడ్యూలు ఎ ఆస్తి మొత్తం విస్తీర్ణంలో గల సాయి టవర్స్ అను పేరు గల గ్రూప్ హౌస్ మొదటి అంతస్తు నందు 1000 చ॥అ॥ల ప్లింత్ ఏరియా, 50 చ॥అ॥ల కామన్ ఏరియా, 150 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా, కామన్ నీటి సదుపాయాలు, డ్రైనేజ్, దారులు మరియు మెట్లు మొ॥ వాటితో గల ఫ్లాట్ నెం.ఎఫ్ఎఫ్-2. **హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై మరియు బాల్కనీ, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర :** ఫ్లాట్ నెం.1 మరియు కామన్ కారిడార్, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

తేది : 15-05-2025
స్థలం : విజయవాడ

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ, చిరునామా : 4వ ఫ్లోర్, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001. E-mail: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూల్ 6(2)/8(6) ప్రకారం)

వీరికి : ఋణగ్రహీతలు: శ్రీ కూలి సుబ్బారావు, తండ్రి : వెంకటేశ్వర్లు, డోర్ నెం.133-10-2334, 1వ లైన్, ప్రశాంతి నగర్, బివిఆర్ కనెక్షన్‌కు ఎదురు రోడ్డు, నగరాలు, గోరంట్ల, గుంటూరు - 522034. **వేరొక చిరునామా: శ్రీ కూలి సుబ్బారావు,** తండ్రి : వెంకటేశ్వర్లు, డోర్ నెం.4-8-280, సాకేతపురం వీధి, కొరిటెపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522007. **వేరొక చిరునామా: శ్రీ కూలి సుబ్బారావు,** తండ్రి : వెంకటేశ్వర్లు, డి.నెం.11-483, గోరంట్ల, అమరావతి రోడ్డు, నగరాలు, ప్రశాంతి నగర్, 1వ లైన్, గుంటూరు - 522034. **శ్రీమతి కూలి జ్యోతిర్మయి,** భర్త : కూలి సుబ్బారావు, డోర్ నెం.133-10-2334, 1వ లైన్, ప్రశాంతి నగర్, బివిఆర్ కనెక్షన్‌కు ఎదురు రోడ్డు, నగరాలు, గోరంట్ల, గుంటూరు - 522034. **వేరొక చిరునామా: శ్రీమతి కూలి జ్యోతిర్మయి,** భర్త : కూలి సుబ్బారావు, డోర్ నెం.4-8-280, సాకేతపురం వీధి, కొరిటెపాడు, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522007. **వేరొక చిరునామా: శ్రీమతి కూలి జ్యోతిర్మయి,** భర్త : కూలి సుబ్బారావు, డి.నెం.11-483, గోరంట్ల, అమరావతి రోడ్డు, నగరాలు, ప్రశాంతి నగర్, 1వ లైన్, గుంటూరు - 522034.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం బ్యాంకు వారికి శ్రీ కూలి సుబ్బారావు మరియు శ్రీమతి కూలి జ్యోతిర్మయి వారి బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్, గుంటూరు ఖాతా నుండి ఇప్పుడు అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), 4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ - 520001నకు బదిలీ అయిన వారి సెక్యూర్డ్ క్రెడిటార్ మీరు బకాయిలు చెల్లించవలసినదిగా కోరుతూ సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002లోని సెక్షన్ 13(2) ప్రకారం **తేది.14.06.2022**న డిమాండ్ నోటీసును జారీ చేసినారు. నిర్దేశించిన సమయంలో, నిర్ణీత వ్యవధిలో మీరు నోటీసులో పేర్కొన్న బకాయిని చెల్లించడంలో విఫలమైనందున అధీకృత అధికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6/8తో చదివే చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం స్థిరాస్తులను **తేది.16.09.2022**న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని లాంఛనంగా స్వాధీనం చేసుకున్న తరువాత కూడా మీరు బ్యాంకుకు చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించలేదు. కావున ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తులను విక్రయించడం కొరకు బహిరంగ ఇ-వేలం నిర్వహిస్తారు. ఇ-వేలం యొక్క తేదీ మరియు సమయం, ఆస్తి రిజర్వు ధర మరియు ఇ-వేలం నిర్వహించాల్సిన సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి.

కావున, మీరు బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని విక్రయ నోటీసును ప్రచురించే తేదీకి ముందు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో పాటు బ్యాంక్‌కు చెల్లించినట్లయితే ఆస్తి అమ్మకంపై తదుపరి చర్యలు తీసుకోబడదు మరియు చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ ఆస్తిని విడిపించుకోవచ్చు.

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు-ఎ: గుంటూరు జిల్లా, కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలో, గుంటూరు సిటీ, అమరావతి రోడ్డు, నగరాలు, ప్రశాంతి నగర్, 1వ లైన్, కొరిటెపాడు గ్రామ డోర్ నెం.149 లోని 336 చ॥గ॥ల స్థల విస్తీర్ణంలో అసెస్మెంట్ నెం.2018 మరియు డోర్ నెం.11-483తో గల "వాసవీ హోమ్స్" అపార్ట్‌మెంట్ నకు **హద్దులు : తూర్పు :** చావలి దేవానంద ప్రసాద్ గారి ఆస్తి, **దక్షిణం:** 30 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** దాసరి జయలక్ష్మి మొ॥ వారి భూమి, **పడమర :** నాదెండ్ల వెంకటేశ్వర్లు గారి ఆస్తి.

షెడ్యూలు-బి: పైన తెలిపిన మొత్తం స్థల విస్తీర్ణంలో 42 చ॥గ॥లు లేదా 35.11 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా స్థల విస్తీర్ణంతో నిర్మించిన "వాసవీ హోమ్స్" రెండవ అంతస్తు నందు 1050 చ॥అ॥ల ప్లింత్ ఏరియాతో (కామన్ ఏరియా మరియు కార్ పార్కింగ్‌తో సహా) గల ఫ్లాట్ నెం.301. **హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** మెట్లు & లిఫ్ట్ & కామన్ కారిడార్.

ఈ హద్దులలోని స్టిల్ట్, క్రింది, మొదటి అంతస్తులతో కూడిన "వాసవీ హోమ్స్" అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తు నందు 1050 చ॥అ॥ల ప్లింత్ ఏరియా మరియు అన్నీ ఎమెనిటీస్ మరియు కామన్ మరియు ఉమ్మడి హక్కులు, ఈజిమెంట్స్ హక్కులతో సహా, సదుపాయాలు మొ॥, స్టిల్ట్ ఫ్లోర్ నందు ఒక కార్ పార్కింగ్ సదుపాయంతో గల ఫ్లాట్ నెం.301 శ్రీ కూలి సుబ్బారావు మరియు శ్రీమతి కూలి జ్యోతిర్మయి గార్ల పేరున కలదు.

తేది : 16-05-2025
స్థలం : విజయవాడ

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

జ్యోతిమల్హోత్రాకు ఏ ఉగ్ర సంస్థతోనూ సంబంధాలు లేవు

- హిసార్ పోలీసుల ప్రకటన
- కస్టడీ పొడిగించిన కోర్టు

గురుగ్రామ్ : జ్యోతిమల్హోత్రాకు ఏ ఉగ్రవాద సంస్థతోనూ సంబంధాలు లేవని హిసార్ పోలీసులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్తాన్‌కు గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలతో అరెస్టయిన యూట్యూబర్ జ్యోతిమల్హోత్రాను హర్యానా రాష్ట్ర పోలీసులతో పాటు, మరికొన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఆమె ప్రస్తుతం తమ కస్టడీలోనే ఉన్నట్లు తెలిపారు.

ఆమెకు గతంలో విధించిన ఐదు రోజుల పోలీస్ రిమాండ్ పూర్తికావడంతో గురువారం పోలీసులు ఆమెను మళ్లీ కోర్టు ముందు హాజరుపర్చారు. మరిన్ని విషయాలపై విచారించాల్సి ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ కార్యకర్తలతో ఆమె పంచుకున్న సమాచార వివరాలను నిర్ధారించడానికి ఆమె మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌ను విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాయని, అక్కడ నుంచి నివేదిక రావాల్సి ఉందని చెప్పారు. దీంతో కోర్టు ఆమెకు మరో నాలుగు రోజుల పోలీస్ కస్టడీని విధించింది.

బజాజ్ ఆటో చేతికి కెటిఎం

న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆస్ట్రియా కంపెనీ కెటిఎంను బజాజ్ ఆటో స్వాధీనం చేసుకుంది. తన అనుబంధ సంస్థ బజాజ్ ఆటో ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ బివి ద్వారా 800 మిలియన్ యూరోలు (దాదాపు రూ.7,765 కోట్లు) రుణ నిధి ప్యాకేజీని కెటిఎంకు అందించనుంది. నియంత్రణ అనుమతులు పూర్తయితే ప్రస్తుతం మైనారిటీ వాటాదారుగా ఉన్న బజాజ్ ఆటో ఆ సంస్థలో మెజారిటీ వాటాదారుగా మారి నియంత్రణ హక్కులు దక్కించుకోనుంది. ప్రీమియం మోటార్ సైకిళ్ల తయారీలో ఉన్న కెటిఎంలో ఎప్పటి నుంచి బజాజ్‌కు భాగస్వామ్యం ఉంది. భవిష్యత్తులో కెటిఎం నెట్‌వర్క్ ద్వారా 80 దేశాలకు ఎగుమతిని కొనసాగిస్తామని బజాజ్ ఆటో పేర్కొంది.

త్వరలో ఎన్ఎస్ఇ లిస్టింగ్

ముంబయి : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఇ) ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు పబ్లిక్ ఇష్యూకు రానుంది. సెబీ అనుమతులు లభించే అవకాశం ఉంది. ఎన్ఎస్ఇ లిస్టింగ్ అంశాన్ని స్వయంగా సెబి ఛైర్మన్ తుహిన్ కాంత పాండే వెల్లడించారు. ఎన్ఎస్ఇ ఐపిఒకు సంబంధించిన అన్ని పెండింగ్ సమస్యలు త్వరలోనే తొలగనున్నాయన్నారు. అయితే ఎప్పటిలోగా ఈ సమస్యలు పరిష్కారమవుతాయనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. రెగ్యులేటరీ ఆందోళన నేపథ్యంలో ఎన్ఎస్ఇ ఐపిఒ ప్రతిపాదన గత ఎనిమిదేళ్లకు పైగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ వద్దనే పెండింగ్‌లో ఉంది. సిబ్బందికి ఇచ్చే పరిహారం, క్లియరింగ్ కార్పొరేషన్‌లో యాజమాన్యం, టెక్నాలజీ వంటి అనేక అంశాలపై సెబీ పలు ప్రశ్నలు సంధించింది. దీని కారణంగా ఐపిఒ రాక ఆలస్యం అవుతోంది. ఎన్ఎస్ఈ విలువ సుమారు రూ.4.7 లక్షల కోట్లుగా ఉంది. దీంతో భారత్‌లోనే 10వ అత్యంత విలువైన ప్రయివేటు కంపెనీగా నిలిచింది.

ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ లాభాల్లో 83 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ లాభాలు 82.6 శాతం వృద్ధితో రూ.63 కోట్లుగా నమోదయినట్లు తెలిపింది. ఇంతక్రితం ఏడాది రూ.34.5 కోట్ల లాభాలు ప్రకటించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో 40.54 శాతం పెరుగుదలతో రూ.26 కోట్లుగా చోటు చేసుకుంది. 2024-25లో కంపెనీ రెవెన్యూ 47.5 శాతం వృద్ధితో రూ.2,709 కోట్లకు చేరింది.

ఒబెన్ 'ఒ100' వేదిక ఆవిష్కరణ

100 సిసి ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లపై దృష్టి

బెంగళూరు : ఒబెన్ ఎలక్ట్రిక్ కొత్తగా తన రెండో ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్ వేదిక 'ఒ100'ను ప్రారంభించినట్లు తెలిపింది. దీంతో 100 సిసి సమాన మోటార్ సైకిల్ సెగ్మెంట్‌లోకి ప్రవేశించినట్లయ్యిందని పేర్కొంది. దేశీయ మొత్తం ద్విచక్ర వాహన రంగంలో 100 సిసి వాటా 30 శాతంగా ఉందని అంచనా వేసింది. తమ ఒ100 వేదిక ద్వారా దేశంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తరణపై దృష్టి కేంద్రీకరించనున్నట్లు పేర్కొంది. ఈ వేదికపై 2025 ద్వితీయార్థంలో కొత్త మోటార్ సైకిళ్లను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపింది.

మే 27 నుంచి బ్లూ వాటర్ లాజిస్టిక్స్ పబ్లిక్ ఇష్యూ

హైదరాబాద్ : బ్లూ వాటర్ లాజిస్టిక్ లిమిటెడ్ మే 27 నుంచి ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్‌కు రానుంది. ఈ ఇష్యూలో ధరల శ్రేణీని రూ.132-135గా ప్రకటించింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ కంపెనీ కనీస లాట్ సైజ్‌ను 1000 ఈక్విటీ షేర్లుగా నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం మే 26నే ఇష్యూను తెరువనున్నట్లు పేర్కొంది. ఈ ఇష్యూలో ఎన్ఎస్ఇ ఎమర్జ్ ప్లాట్‌ఫాంపై రూ.40.56 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సెన్సెక్స్ 645 పాయింట్ల పతనం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలను చవి చూశాయి. దీంతో ఇంతక్రితం రోజు భారీ లాభాలు ఆవిరయ్యాయి. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలతో. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 1100 పాయింట్ల మేర పతనం కాగా.. నిఫ్టీ 24,500 పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరలో కొంత కొనుగోళ్ల మద్దతు లభించడంతో తుదకు 645 పాయింట్ల నష్టంతో 80,952 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 203.75 పాయింట్ల నష్టంతో 24,610 వద్ద నమోదయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండస్ ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. అమెరికా అప్పులపై ఆందోళన, బాండ్ ఈల్డ్స్ పెరగడం వంటి కారణాలు ఇతర మార్కెట్‌లపై ప్రభావం చూపాయి.

కరోనా జాగ్రత్తలు పాటించండి

- మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కరోనా నిబంధనలను పాటించాలని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఆ శాఖ డైరెక్టర్ కె పద్మావతి గురువారం విడుదల చేశారు. దేశంలో కరోనా విస్తరిస్తున్న సందర్భంగా ఈ నియమ, నిబంధనలను విడుదల చేశారు. ప్రజలు గుంపులుగా ఉండొద్దని, ప్రార్థనా సమావేశాలు, సామాజిక సమావేశాలు, పార్టీలు, వంటి సామూహిక సమావేశాలను నిలిపివేయాలని తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఎయిర్‌పోర్టులలో కోవిడ్-19 నిబంధనలు పాటించాలని కోరారు. వృద్ధులు, గర్భిణులు ఇళ్లల్లోనే ఉండాలని, క్రమం తప్పకుండా చేతులను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని పేర్కొ న్నారు. కరోనా లక్షణా లుంటే తక్షణం పరిక్షలు చేయించుకోవాలని కోరారు. ఇతర దేశాలనుండి వచ్చిన వ్యక్తులు పరీక్షలు చేయించుకోవాలని వెల్లడించారు. జ్వరం, చలి, దగ్గు అలసట, గొంతు నొప్పి రుచి లేదా వాసన కోల్పోవడం తలనొప్పి వంటి లక్షణాలుంటే నిర్ధారణ కోసం సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని తెలిపారు.

నికర ఎఫ్‌డిఐల్లో 96 శాతం పతనం

అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంతరాము మాట్లాడుతూ.. ఖనిజాల వ్యర్థాలను పునర్వినియోగించే ఆలోచనే సర్క్యులర్ ఎకానమీ అని వివరించారు. పునర్వినియోగం సక్రమంగా చేయగలిగితే వ్యర్థాల నుంచి సంపద సృష్టి జరుగుతుందన్నారు. ఎపిపిసిబి ఛైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ.. వ్యర్థాలను పునర్వినియోగంలోకి తీసుకువచ్చి ఆర్థిక రంగాన్ని పరిపుష్టం చేసేందుకు, పర్యావరణ పరిరక్షణకు, ఉపాధి కల్పనకు వర్క్‌షాపులో వచ్చిన సూచనలతో కార్యాచరణ రూపొందించి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని చెప్పారు. ఎలక్ట్రానిక్స్, బ్యాటరీలు, పాత వాహనాలను పునర్వినియోగించే సమగ్ర ప్రణాళిక ప్రస్తుతం మన రాష్ట్రంలో అందుబాటులో లేదని, వ్యర్థాలు ఎంత ఉత్పత్తి అవుతున్నాయన్న అంచనా కూడా లేదన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ వ్యర్థాలతో కంప్రెస్డ్ బయోగ్యాస్ తయారు చేసేందుకు రూ.500 కోట్లతో రిలయన్స్ సంస్థ ఇప్పటికే ప్లాంట్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శరవణన్, ఎపిఇఎంసి ఛైర్మన్ పి.దినేష్‌రెడ్డి, రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

Chola Enter a better life

కార్పొరేట్ ఆఫీసు : "చోల క్రెస్ట్", సి54 & 55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గ్యాండి, చెన్నై-600032.
బ్రాంచి చిరునామా: హౌస్ నెం. 6-9-23, వార్డు నెం. 3, 9వ లైన్, రెండవ ఫ్లోర్, అరండల్ పేట, గుంటూరు-522002

(రూల్ 8(1)) క్రింద స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు **మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్, అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002, మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలను, ఎవరి పేర్లైతే కాలం నం.(బి)లో సూచించిన వారి కాలం (సి)లో సూచించిన తేదీల నాటికి కాలం (డి)లో సూచించిన బకాయి మొత్తాలను సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా దానిపై వడ్డీతోసహా తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ చట్టం యొక్క సెక్షన్ 13(4) దాని క్రింద రూపొందించిన రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడుతూ అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, కాలం (ఇ)లో పేర్కొన్న సదరు తేదీన ఇందు దిగువ కాలంలలో వివరించిన, కంపెనీతో తాకట్టుపెట్టిన ఆస్తులను క్రింది సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.**

ప్రత్యేకించి రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, దిగువ పేర్కొన్న ఆస్తులతో లావాదేవీలు జరుపరాదని ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు ఏవేని అట్టి లావాదేవీలు **మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** కు వడ్డీ& ఇతర చార్జీలతోపాటు కాలం (డి)లో పేర్కొన్న మొత్తాలను చెల్లించుటకులోబడి ఉంటుంది.

రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13(8) యొక్క నియమాలపై శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీతలు పేరు & చిరునామా & రుణఖాతా నంబరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి మొత్తాలు	ఆస్తి వివరాలు	స్వాధీనత తేదీ
[A]	[B]	[C]	[D]	[E]	[F]
1)	**Loan A/c No. HE01GUN00000080123** **1) షేక్ మహ్మద్ రఫీ** (అభ్యర్థి), **2) గౌసియా షేక్** (సహ-అభ్యర్థి), ఇరువురి చిరునామా: డోర్ నం.16-28-105, అలినగర్, పాత గుంటూరు, గుంటూరు, కొత్తపేట గుంటూరు, ఆం.ప్ర-532001. **3) షేక్ మహ్మద్ రఫీ** (అభ్యర్థి), డోర్ నం.16-16-196డి, పాత గుంటూరు, అలినగర్ మజీదు, గుంటూరు, ఆం.ప్ర-522001. **4. మా షెల్ ప్రాసెస్సర్స్** (సహ-అభ్యర్థి), డోర్ నం. 27-4-24, 4వ లైన్, జామియా నగర్, నందివెలుగు రోడ్, గుంటూరు గ్రామం & తూర్పు మండలం, గుంటూరు, ఆం.ప్ర-522001.	16-01-2025	16.01.2025 నాటికి రూ. 39,44,074/- మరియు దానిపై వడ్డీ.	**శ్రీ షేక్ మహ్మద్ రఫీ** కు చెందిన ఆస్తి. గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-రిజిస్ట్రార్, గుంటూరు మున్సిపల్ ఏరియా, గుంటూరు సిటీ, పాత గుంటూరు, పాత వార్డు నం.7, బ్లాక్:7, టి.ఎస్.నం.606 వద్దగల పాత అసెస్మెంట్ నం.26834, ప్రస్తుత అసెస్మెంట్ నం.23017, డోర్ నం.16-16-196డి, విస్తీర్ణం: 116-5చ.గ.ల దానిలో టైల్స్ గల ఇంటి ఆస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు:** ఉత్తరం:ఈ ఆస్తి మరియు ఎం. తిరుపతమ్మ మొ॥వారి మధ్య ఉమ్మడి శరకత్తు గోడ 53-4అ.లు, దక్షిణం: షేక్ సకీనాబీ ఇల్లు 53-4అ.లు, తూర్పు: వి. పర్వతమ్మ సైటు మరియు ఈ ఇంటి సైటు ఆస్తిగోడ-19-8అ.లు, పడమర: మున్సిపల్ రోడ్డు 19-8అ.లు.	21.05.2025

ప్రదేశం: గుంటూరు
తేది: 23.05.2025
సం/- అధీకృత అధికారి
మెసర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్.

ద్వైపాక్షికంగానే అవగాహన కుదుర్చుకున్నాం!

- నెదర్లాండ్స్‌లో విదేశాంగ మంత్రి స్పష్టీకరణ
- అమెరికా, అమెరికాలోనే వుందని వ్యాఖ్య

ది హేగ్ : ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఇటీవల కాల్పుల విరమణకు సంబంధించి భారత్, పాకిస్తాన్‌లు ద్వైపాక్షికంగానే అవగాహన కుదుర్చుకున్నాయని విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టంచేశారు. ఇరు పక్షాలు ప్రత్యక్ష చర్చలు జరిపిన అనంతరమే ఈ అవగాహనకు వచ్చినట్లు చెప్పారు. భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణ కుదిరేలా చేసినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో జై శంకర్ ఈ స్పష్టతనిచ్చారు. నెదర్లాండ్స్, డెన్మార్క్, జర్మనీల పర్యటనల్లో భాగంగా ప్రస్తుతం నెదర్లాండ్స్‌లో జై శంకర్ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా డచ్ బ్రాడ్‌కాస్టర్ ఎన్‌ఓఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆయన, పహల్గాం ఉగ్రదాడి తరహాలో భవిష్యత్తులో మరోసారి దాడి జరిగితే, పాక్ ఉగ్ర స్థావరాలపై మళ్లీ దాడి తప్పదని హెచ్చరించారు. అందుకే ఆపరేషన్ సిందూర్‌ను ముగించలేదని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ అంటే పరస్పరం కాల్పులు జరుపుకోవడం కాదని, ఉగ్రమూకల ఏరివేత అని, ఆ ఆపరేషన్‌లోనే ఆ సందేశం వుందని చెప్పారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాదులు ఎక్కడున్నా వారిని ఏరివేస్తామని చెప్పారు. రెండు దేశాలు ఘర్షణ పడుతున్నప్పుడు ప్రపంచ దేశాలు ఫోన్ చేసి మాట్లాడడం, వారి ఆందోళన తెలియజేయడం సహజమేనని, అమెరికా సహా అనేక దేశాల నుండి తమకు ఫోన్ కాల్స్ వచ్చాయని చెప్పారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ప్రధాని మోడీతో, మార్క్ రూబియో నాతో మాట్లాడారు– కాకపోతే ఆందోళనలను వ్యక్తం చేయడం వరకే వారి పాత్ర అని ఆయన స్పష్టం చేశారు. "ఈ సందర్భంగా మాతో మాట్లాడిన ప్రతి ఒక్కరికీ ఒక విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పాం, ఈ పోరాటం ఆగాలని పాకిస్తాన్ కోరుకుంటే వారే మాకు ఆ విషయం తెలియ/జేయాలి, పాక్ సైనిక జనరల్ భారత్ ఆర్మీ జనరల్‌కు ఫోన్ చేశారు. కాల్పులను ఆపాలని కోరారు. అదే ఇక్కడ జరిగింది." అని వివరించారు. మరి ఇందులో అమెరికా ఎక్కడ వుందని ప్రశ్నించగా, 'అమెరికా, అమెరికాలోనే వుంది.' అని జై శంకర్ బదులిచ్చారు. ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడి చాలా ఆటవికమైనదని, మతపరమైన విభేదాలు సృష్టించాలనే లక్ష్యంతోనే ఉగ్రవాదులు 'మతం' ఏమిటో తెలుసుకుని మరీ అమాయకుల ప్రాణాలను వారి కుటుంబ సభ్యుల ముందే తీశారని విమర్శించారు. ఈ చర్యపై పాక్ వైపు నుండి ఎలాంటి స్పందన లేనందున తాము రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి భారత్‌కు అప్పగించడంపై, తీవ్రవాదంపై పాకిస్తాన్‌తో చర్చలు జరిపేందుకు భారత్ సుముఖంగా వుందని చెప్పారు. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల పొడవునా తలెత్తుతున్న భద్రతా పరమైన ఆందోళనలు భారత్ ఆర్థిక పురోభివృద్ధిపై కలిగించే ప్రభావం గురించి ప్రశ్నించగా, భద్రత, ఆర్థికాభివృద్ధి ఒకే నాణానికి రెండు కోణాలు వంటివని వ్యాఖ్యానించారు.

తీవ్రవాదంపై పోరులో బాసటగా వుంటాం

- పునరుద్ఘాటించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్
- భారత అఖిలపక్ష బృందంతో భేటీ

అబూదాబి : ఉగ్రవాదంపై అంతర్జాతీయంగా చేసే పోరాటంలో భారత్‌కు తమ పూర్తి మద్దతు వుంటుందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) గురువారం పునరుద్ఘాటించింది. ఉగ్రవాదమనేది అంతర్జాతీయ ముప్పు అని మానవాళికి ఒక రుగ్మత వంటిదని వ్యాఖ్యానించింది. ఆపరేషన్ సిందూర్, పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం గురించి ప్రపంచ దేశాలకు తెలియజెప్పేందుకు శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే నేతృత్వంలో వచ్చిన భారత అఖిలపక్ష ప్రతినిధి బృందంతో సమావేశం అనంతరం ఫెడరల్ నేషనల్ కౌన్సిల్‌కి చెందిన రక్షణ, హోం, విదేశాంగ వ్యవహారాల కమిటీ చైర్మన్ అలీ రషీద్ అల్ నౌమి ఈ వ్యాఖ్యలు చేశారు. తీవ్రవాదం కేవలం ఒక దేశానికి లేదా ప్రాంతానికి చెందిన ముప్పు కాదు, ఇది అంతర్జాతీయ ముప్పు. ఈ విషయమైన అంతర్జాతీయ సమాజమంతా ఏకతాటిపైకి రావాలని మేం విశ్వసిస్తున్నాం. మానవాళికి మరింత మెరుగైన భవితవ్యాన్ని కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు, వ్యూహాలను రూపొందించడంలో కసరత్తు చేయడానికి పార్లమెంట్ సభ్యులు కలిసికట్టుగా ముందుకు రావాలి." అని అల్ నౌమి కోరారు. భారత ప్రజల భద్రత విషయంలో రాజీపడేది లేదని, భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని చెప్పారు. యుఎఇ బృందంతో తమ సమావేశం, చర్చలు విజయవంతంగా జరిగాయని, భారత్‌పై దాడిని ఖండించిన మొదటి దేశం యుఎఇ అని షిండే తెలిపారు.

జపాన్ నేతలతో కరచాలనం చేస్తున్న జాన్ బ్రిట్టాస్

భారత్‌కు అండగా వుంటాం

భారత అఖిలపక్ష బృందానికి జపాన్ హామీ

టోక్యో : ఉగ్రవాదంపై అంతర్జాతీయంగా జరుపుతున్న పోరాటంలో భారత్‌కు అండగా వుంటామని జపాన్ స్పష్టం చేసింది. ఈ పోరాటంలో భాగంగా భారత్ తీసుకుంటున్న చర్యలకు సంఘీభావం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్, పాక్ ప్రేరేపిత తీవ్రవాదంపై ప్రపంచ దేశాలకు వివరించేందుకు భారత్ నుండి బయలుదేరిన అఖిల పక్ష ప్రతినిధి బృందాల్లో భాగంగా జపాన్ చేరుకున్న అఖిల పక్ష ప్రతినిధి బృందానికి సాదర స్వాగతం లభించింది. సిపిఎం రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్ ఈ బృందంలో సభ్యులుగా వున్నారు. భారత రాయబారి, కొట్టాయం వాసి సిబి జార్జి భారత బృందానికి స్వాగతం పలికారు. అనంతరం భారత ప్రతినిధి బృంద సభ్యులందరూ జపాన్ విదేశాంగ మంత్రి ఇవాటా తకెషితో సహా పలువురు జపాన్ నేతలతో సమావేశమై, చర్చలు జరిపారు. మాజీ ప్రధాని, జపాన్ – భారత్ అసోసియేషన్ చైర్మన్ యోషిహిడె సుఖా, పార్లమెంట్ సభ్యులతో బృందం సమావేశమైంది. అంతకుముందు భారత బృందం అక్కడి గాంధీ మెమోరియల్‌ను సందర్శించి పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించింది.

ఆక్రమిత్ కాశ్మీర్‌పైనే చర్చలు

- బికనీర్ సభలో ప్రధాని మోడీ

బికనీర్ : పాకిస్తాన్‌తో వాణిజ్యం లేదా మరే ఇతర చర్చలు జరిపేది లేదని, జరిగితే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను తిరిగి అప్పగించడం పైనే జరుగుతాయని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా రాజస్థాన్‌లోని పలానాలో గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పహల్గాం ఉగ్ర దాడికి ప్రతిగా 22 నిముషాల వ్యవధిలో అతిపెద్దవైన 9 ఉగ్ర స్థావరాలను నాశనం చేసిన భారత సాయుధ బలగాలను సామర్థ్యాలను ప్రశంసించారు. సిందూర్‌ను తుడిచిపెట్టినవారిని దుమ్ముధూళిలో కలిపారని వ్యాఖ్యానించారు. ఈ తరహాలో మరో దాడిని భారత్ ఎదుర్కొనాల్సి వస్తే, తీవ్రమైన ప్రతీకార చర్య తప్పదని పాక్‌ను హెచ్చరించారు. ఎప్పుడు, ఎలా అనేది తమ సాయుధ బలగాలు నిర్ణయిస్తాయన్నారు. అణు బెదిరింపులు తమను అడ్డగించలేవన్నారు. ఉగ్రవాదానికి పాల్పడేవారిని, అందుకు ప్రోత్సహించే ప్రభుత్వాన్ని వేర్వేరుగా చూడబోమని స్పష్టం చేశారు. త్రివిధ దళాలకు స్వేచ్ఛగా వ్యవహరించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, వారందరూ కలిసి పాకిస్తాన్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టగలిగారని మోడీ వ్యాఖ్యానించారు. బికనీర్‌లోని నాల్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేందుకు పాక్ ప్రయత్నించినా, ఏమీ చేయలేకపోయిందన్నారు. పాకిస్తాన్‌లోని రహింయార్ ఖాన్ ఎయిర్‌బేస్ పూర్తిగా నాశనమై, అది ఐసియులో వుందని వ్యాఖ్యానించారు. భారత్‌తో ఎప్పుడు ప్రత్యక్షంగా పోరాటానికి దిగినా పాకిస్తాన్‌కు ఓటమి తప్పదని హెచ్చరించారు. నేరుగా గెలవలేక భారత్‌పై ఉగ్రవాదాన్ని ఆయుధంగా ప్రయోగిస్తోందని విమర్శించారు.

సినిమా డైలాగులు కాదు ఈ ప్రశ్నలకు జవాబులేవీ : కాంగ్రెస్ విమర్శ

ప్రధాని మోడీ మాట్లాడిన సినిమా డైలాగుల్లా వున్నాయని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ప్రజలు అడుగుతున్న తీవ్రమైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కమ్యూనికేషన్ చీఫ్ జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన వారు ఇంకా స్వేచ్ఛగానే ఎందుకు తిరుగుతున్నారు? గత 18 మాసాల కాలంలో పూంఛ్, గుల్మార్గ్, గగన్‌గిర్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్ర దాడులకు వారే బాధ్యులని కొన్ని వార్తలు వెలువడ్డాయని పేర్కొన్నారు. అఖిల పక్ష సమావేశానికి ప్రధాని ఎందుకు హాజరు కాలేదని మరో ప్రశ్న సంధించారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో కనిపించిన చైనా – పాకిస్తాన్ సంబంధాలను దృష్టిలో వుంచుకుని, 1994 ఫిబ్రవరి 22న ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని పునరుద్ఘాటించేందుకు, దాన్ని ఆధునీకరించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదు? అని రమేష్ ప్రశ్నించారు. తమ మధ్యవర్తిత్వం వల్లే భారత్, పాక్ కాల్పుల విరమణ జరిగిందని పదేపదే అమెరికా అధ్యక్షుడు అంటున్నా ప్రధాని మోడీ మౌనం ఎందుకు పాటిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉగ్రవాదానికి మద్దతు విరమిస్తేనే సింధు జలాలు

- స్పష్టం చేసిన భారత్

న్యూఢిల్లీ : విశ్వసనీయంగా, తిరుగులేని రీతిలో సీమాంతర తీవ్రవాదానికి పాక్ తన మద్దతును విరమించుకునేవరకు సింధు నదీ జలాల ఒప్పందం అమల్లోకి రాదని భారత్ స్పష్టం చేసింది. 'నీరు, రక్తం' కలిసి పారలేవని వ్యాఖ్యానించింది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, పాక్ అక్రమంగా ఆక్రమించుకున్న కాశ్మీర్ భూభాగాన్ని ఖాళీ చేయాలన్న అంశంపైనే ఆ దేశంతో ద్వైపాక్షిక చర్చలు జరుగుతాయని స్పష్టం చేశారు. భారత్, పాక్ మధ్య జరిగే ఏ ప్రకియ అయినా ద్వైపాక్షికంగానే వుంటుందనేది భారత్ వైఖరని, అందరికీ తెలుసని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. చర్చలు, తీవ్రవాదం ఒక బాటన సాగవని జైస్వాల్ అన్నారు. చాలా ఏళ్ల క్రితమే భారత్‌కు అప్పగించాల్సిన తీవ్రవాదుల జాబితాను పాకిస్తాన్‌కు అందజేశామని, దానిపై చర్చించడానికి మాత్రమే తాము సిద్ధంగా వున్నామని చెప్పారు.

డాడీ... బిజెపిపై మెతకవైఖరి మంచిది కాదు..!

- బిజెపికి బిఆర్‌ఎస్ దూరమని ప్రజలకు స్పష్టం చేయాలి
- బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌కు కవిత లేఖ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్‌లో వారసత్వ వార్ రోడ్డుకెక్కింది. బిఆర్‌ఎస్ పార్టీలో గత కొంతకాలంగా తీసుకుంటున్న నిర్ణయాల వల్ల కేడర్ అసంతృప్తితో ఉందంటూ ఆ పార్టీ అధినేత, మాజీ సిఎం కెసిఆర్‌కు ఆయన కుమార్తె ఎమ్మెల్సీ కవిత ఆరు పేజీల లేఖ రాశారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది తెలంగాణతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. లేఖలో ముఖ్యంగా, బిజెపితో బిఆర్‌ఎస్ పార్టీ వ్యవహరిస్తున్న మెతక వైఖరి మంచిదికాదని, మతతత్వ బిజెపికి బిఆర్‌ఎస్ దూరమనే విషయాన్ని ప్రజలకు స్పష్టంచేయాలని కెసిఆర్‌కు సూచించారు. బిజెపితో బిఆర్‌ఎస్ ఎన్నికల పొత్తు ఉంటుందని జరుగుతున్న చర్చను ఖచ్చితంగా ఖండించలేకపోతున్నామని, దీనివల్ల కేడర్‌లో గందరగోళం నెలకొందని తెలిపారు. స్వయంగా తాను బిజెపి వల్ల తీవ్ర ఇబ్బందులకు గురయ్యానని గుర్తుచేశారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన బిఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహణపై కవిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభ ప్రారంభంలో కెసిఆర్ స్టేజ్ పైకి వచ్చే ముందు సీనియర్ నేతలతో మాట్లాడించాల్సిందని, వారికి తగిన ప్రాధాన్యత దక్కడంలేదని ఆమె లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పోటీ చేయ కుండా బిజెపికి మద్దతు ఇచ్చిందని కాంగ్రెస్ ప్రజల్లో కి బలంగా తీసుకెళ్లిందని, దాన్ని తిప్పికొట్టడంలో విఫలమయ్యామని అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ఒకటి, రెండు ప్లీనరీలు పెట్టాలని కెసిఆర్‌కు కవిత సూచించారు. ఎస్‌సి వర్గీకరణపై వరంగల్ సభలో మాట్లాడలేదని, వక్ఫ్ చట్టం ఊసే ఎత్తకపోవడం వల్ల ఆయా తరగతులు పార్టీపై అసంతృప్తితో ఉన్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను పాత ఇన్‌ఛార్జ్‌లకు అప్పజెప్పడం వల్ల వారు తెలంగాణ ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదన్నారు. వరంగల్ సభలో కెసిఆర్ దిశా నిర్దేశం చేస్తారని అనుకున్న పార్టీ శ్రేణులకు..కెసిఆర్ ప్రసంగం రుచించలేదని కవిత తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖపై పార్టీ నాయకత్వం కానీ, కవిత కానీ ఇప్పటివరకు స్పందించలేదు.

భారత హైకమిషన్ సిబ్బందిని బహిష్కరించిన పాకిస్తాన్

ఇస్లామాబాద్ : భారత్ హైకమిషన్ స్టాఫ్ మెంబర్‌ను బహిష్కరించినట్లు పాకిస్తాన్ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. గూఢచర్యంలో పాల్గొన్నారనే ఆరోపణలపై పాకిస్తాన్ హైకమిషన్‌లో పనిచేస్తున్న ఒక అధికారిని భారత ప్రభుత్వం బుధవారం బహిష్కరించింది. దీంతో, ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్‌లో నియమించిన స్టాఫ్ మెంబరును పాకిస్తాన్ బహిష్కరించింది. ప్రత్యేక హోదాకు విరుద్ధమైన కార్యకలాపాలలో పాల్గొన్నందున పర్సనా నాన్‌గ్రెటాగా ప్రకటిస్తున్నామని, సంబంధిత అధికారి 24 గంటల్లోపు దేశం విడిచి వెళ్లాలని పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్ణయాన్ని తెలిపేందుకు భారత చార్జి డి అఫైర్స్‌ను విదేశాంగ మంత్రిత్వ శాఖకు పిలిపించారు.

అశోకా వర్సిటీ ప్రొఫెసర్‌పై దర్యాప్తునకు సిట్

చండీగఢ్ : అశోకా యూనివర్శిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్‌పై నమోదైన రెండు ఎఫ్‌ఐఆర్‌లపై దర్యాప్తు నిర్వహించేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం హర్యానా డిజిపి శత్రుజిత్ కపూర్ గురువారం సిట్‌ను ఏర్పాటు చేశారు. అదనపు డిజిపి (క్రైమ్) మమతా సింగ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ బృందంలో ఎస్‌పి (కర్నాల్) గంగారామ్ పునియా, ఎస్‌పి (ఎస్‌టిఎఫ్, గురుగ్రామ్) విక్రాంత్ భూషణ్‌లు సభ్యులుగా వున్నారు. మమతా సింగ్ సోనిపట్ పోలీసు కమిషనర్‌గా కూడా వున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై తన సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుకు గానూ ఈనెల 18న హర్యానా పోలీసులు ప్రొఫెసర్‌ను అరెస్టు చేశారు. దానిపై ఆయన సుప్రీంను ఆశ్రయించగా, 21వ తేదిన సుప్రీం కోర్టు తాత్కాలిక బెయిల్‌ను మంజూరు చేసింది.

దర్యాప్తుపై స్టే ఇవ్వడానికి తిరస్కరించింది. ప్రొఫెసర్‌పై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లపై దర్యాప్తును త్వరితంగా పూర్తిచేసి బిఎన్‌ఎస్–ఎస్‌లోని 193 సెక్షన్ కింద సిట్ నివేదికను అందచేస్తుందని డిజిపి జారీ చేసిన ఉత్తర్వులు పేర్కొన్నాయి.

సిట్ బృందంలో నియమించే వారిలో సూపరింటెండెంట్ ర్యాంక్ మహిళా అధికారి వుండాలని, ఇనస్పెక్టర్ జనరల్ ర్యాంక్ అధికారి నేతృత్వం వహించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. పైగా హర్యానా లేదా ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన ఐపిఎస్ అధికారులెవరూ ఈ సిట్‌లో వుండరాదని పేర్కొంది. అందుకు అనుగుణంగానే సిట్ ఏర్పాటైంది.

అన్ని పరిమితులూ దాటుతున్నారు

- ఫెడరల్ నిర్మాణాన్ని ఉల్లంఘిస్తున్నారు ఇడిపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- టిఎఎస్‌ఎంఎసిపై దర్యాప్తు నిలుపుదల

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర దర్యాప్తు ఏజెన్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)పై భారత సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ (టిఎఎస్‌ఎంఎసి)పై మనీ లాండరింగ్‌కు సంబంధించి ఇడి దర్యాప్తును తప్పుబట్టింది. కేంద్ర ఏజెన్సీ అన్ని పరిధులను దాటుతున్నదని, సమాఖ్య నిర్మాణాన్ని ఉల్లంఘిస్తున్నదని తెలిపింది. టిఎఎస్‌ఎంఎసి ప్రధాన కార్యాలయంలో ఇడి సోదాలను సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయ్ నేతృత్వంలోని జస్టిస్ ఎజి మసీహ్‌తో కూడిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం విచారిస్తున్నది.

తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. మద్యం దుకాణాలను కేటాయించిన కొంత మంది వ్యక్తులు నగదు తీసుకుంటున్నట్టు కార్పొరేషన్ గుర్తించిందని ఆయన చెప్పారు. 2014 నుంచి 2021 వరకు రాష్ట్ర ప్రభుత్వమే 41 ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేసిందనీ, ఇవి కూడా వ్యక్తుల పైనే కానీ కార్పొరేషన్‌పై కాదని కపిల్ సిబల్ కోర్టుకు స్పష్టం చేశారు. 2025లో ఇడి రంగంలోకి దిగి.. కార్పొరేషన్, ప్రధాన కార్యాలయంపై దాడులు చేసిందని వివరించారు.

కేంద్ర సంస్థ తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జీ) ఎస్.వి రాజుకు సిజెఐ నోటీసు జారీ చేశారు. కార్పొరేషన్‌పై నేరం ఎలా ఉంటుందని ఎఎస్‌జిని సీజేఐ ప్రశ్నించారు. వ్యక్తులపై కేసు నమోదు చేయొచ్చు కానీ క్రిమినల్ విషయాల్లో కార్పొరేషన్‌పై ఎలా చేస్తారని అడిగారు. "మిస్టర్ రాజు, మీ ఇడి అన్ని పరిమితులనూ దాటుతోంది" అని సిజెఐ గవాయ్ అన్నారు. రెండువారాల్లోగా ఇడి ప్రతిస్పందనను దాఖలు చేయాలని ఆదేశించారు. ఈలోగా, పిటిషనర్ల వాదన మేరకు తదుపరి చర్యలపై స్టే ఉంటుందని కోర్టు తెలిపింది. టిఎఎస్‌ఎంఎసి తరపున హాజరైన మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ఇడి చర్యల గురించి కోర్టుకు తెలిపారు. కేంద్ర ఏజెన్సీ.. కార్పొరేషన్ ఉద్యోగుల ఫోన్లను తీసుకొని, వాటిని క్లోన్ చేసిందని చెప్పారు. ఇడి చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసు రాజకీయ నాయకుల రూ.1000 కోట్ల మోసానికి సంబంధించిందని, ఇడి దర్యాప్తులో ఎలాంటి దురుద్దేశం లేదనీ, అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు. ప్రతిస్పందనను దాఖలు చేసిన తర్వాతే ఈ కేసును కోర్టు వింటుందని సిజెఐ గవాయ్ స్పష్టం చేశారు.

తమిళనాడులో మద్యం అమ్మకాలను పర్యవేక్షించే టిఎఎస్‌ఎంఎసి అవినీతి, ఆర్థిక అవకతవకలకు పాల్పడిందంటూ పెద్ద ఎత్తున దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో మార్చి 6 నుంచి 8 మధ్య చెన్నైలోని కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో సహా 20 ప్రదేశాలలో ఇడి అధికారులు దాడులు చేశారు. తమిళనాడులో డిఎంకె ప్రభుత్వం అధికారంలో ఉన్నది. వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నది. బిజెపి, ఎఐఎడిఎంకె ఒక కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఈ తరుణంలో ఇడి రంగంలోకి దిగటంతో.. రాజకీయంగా ఇది ప్రాధాన్యతను సంతరించుకున్నదని విశ్లేషకులు చెప్తున్నారు.

తాయారమ్మకు తుది వీడ్కోలు

- వైద్య కళాశాలకు భౌతికకాయం అప్పగింత

హైదరాబాద్ : అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన ఐద్వా సీనియర్ నాయకురాలు కంచి తాయారమ్మకు సిపిఎం, ఐద్వా, ఇతర ప్రజా సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు బుధవారం తుది వీడ్కోలు పలికారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిటిజన్ ఆస్పత్రిలో ఆమె మరణించారు. బుధవారం ఆమె భౌతికకాయానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్, సీనియర్ జర్నలిస్టు జి.రాజకుమారి తదితరులు నివాళులర్పించారు. అనంతరం గాంధీనగర్ నుంచి ఆమె అంతిమయాత్ర బయలుదేరి, ముషీరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి చేరుకుంది. అక్కడ తాయారమ్మ భౌతికాకాయాన్ని ఆమె కుటుంబ సభ్యులు అశ్రునయనాల మధ్య గాంధీ వైద్య కళాశాలకు అప్పగించారు.

'వక్ఫ్'పై మధ్యంతర ఉత్తర్వుల పట్ల తీర్పు రిజర్వ్

- ఆ ఆస్తుల స్వాధీనానికి ఓ మార్గం
- పిటిషనర్ల తరపు న్యాయవాదులు

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ (సవరణ) చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం కూడా విచారించింది. పిటిషన్లతోపాటు కేంద్రం వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం మూడు కీలక అంశాల పట్ల మధ్యంతర ఉత్తర్వులపై తీర్పు రిజర్వ్ చేసింది. వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న పిటిషనర్ల తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, రాజీవ్ ధావన్, అభిషేక్ మను సింఘ్వీల వాదనలను సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం దాదాపు మూడు రోజుల పాటు వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. వక్ఫ్‌చట్టం లౌకికవాదంతో ముడిపడి ఉందని.. పార్లమెంట్ ఆమోదించిన ఏదైనా చట్టం రాజ్యాంగబద్ధంగా భావించబడుతున్నందున.. దాన్ని నిలిపివేయలేమంటూ కేంద్రం స్పష్టం చేసింది.పిటిషనర్ల తరపున హాజరైన కపిల్‌సిబల్ వాదనలు వినిపిస్తూ రాజ్యాంగ సూత్రాలను విస్మరించారన్నారు. చట్టం న్యాయ వ్యవస్థేతర ప్రక్రియ ద్వారా వక్ఫ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ఓ మార్గమని అన్నారు. పిటిషనర్లు మూడు కీలక అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వక్ఫ్ బై కోర్ట్స్, వక్ఫ్ బై యూజర్, వక్ఫ్ బై డీడ్‌గా ప్రకటించిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారం ఈ మూడు అంశాలలో ఒకటి. రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ కూర్పునకు సంబంధించినది రెండో అంశం. ఎక్స్ అఫిషియో సభ్యులు తప్ప మిగిలిన సభ్యులందరూ ముస్లింలే ఉండాలన్నది పిటిషనర్ల వాదన. ఇక మూడవది.. వక్ఫ్ ఆస్తా లేక ప్రభుత్వ ఆస్తా అన్న విషయాన్ని నిర్ధారించడానికి కలెక్టర్ విచారణ చేపట్టిన తరువాత ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించరాదన్న నిబంధనను పిటిషనర్లు వ్యతిరేకిస్తున్నారు.

మధ్యప్రదేశ్ పోలీసులపై సుప్రీం ఆగ్రహం

- కస్టడీలో గిరిజన యువకుడి మృతి కేసును నీరుగార్చే ప్రయత్నంపై మండిపాటు
- సిబిఐకి బదిలీ

పోలీసుల అరెస్టుకు ముందు పెళ్లి దుస్తులతో ...

పోలీసు స్టేషన్‌లో దేవా పార్థీ

న్యూఢిల్లీ : పెళ్లి పీటలపైనున్న గిరిజన యువకుడిని బలవంతంగా మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచే యడంతో కస్టడీలో మరణించిన ఘటనకు సంబంధించిన కేసు విచారణను సిబిఐకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. ఈ నెల 15న వెలువరించిన ఈ తీర్పులో మధ్యప్రదేశ్ పోలీసులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కస్టడీలో గిరిజన యువకుడిని దారుణంగా వేధించడం, తరువాత అతడి మరణంలో మధ్యప్రదేశ్ పోలీసుల పాత్రపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. పోలీసుల ప్రవర్తనలో తీవ్రమైన లోపాలను గుర్తించింది. న్యాయాన్ని అడ్డుకోవడం, సరైన సాక్ష్యాలు ఉన్నా నిష్క్రియాత్మకంగా ఉండటం, నిందితులైన అధికారులను రక్షించడానికి స్పష్టమైన ప్రయత్నాలు వంటి పోలీసు చర్యలను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ కేసులో ఏకైక ప్రత్యక్ష సాక్షిపై బూటకపు కేసులు బనాయించడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతేడాది జులై 13న మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాకు చెందిన గిరిజనుడు దేవా పార్థీ పెళ్లి జరుగుతుండగా, ఆ ప్రాంగణంలోకి దాదాపు 40 మంది పోలీసులు వచ్చి కుటుంబ సభ్యులపై తీవ్రంగా దాడి చేశారు. దేవా, అతని మామ గంగారామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిని సిసిటివి కెమెరాలను అమర్చిన కొత్త పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా, నిఘా నుంచి తప్పించుకునేందుకు పాత పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఇద్దర్నీ తీవ్రంగా హింసించారు. గంగారాం కథనం ప్రకారం దేవాపై వేడినీళ్లు, పెట్రోల్, ఉప్పు, కారం వంటి వేశారు. పై కప్పు నుంచి తలక్రిందులుగా వేలాడదీశారు. నీళ్లలో తల ముంచి ఊపిరాడకుండా చేశారు. మూడు గంటల పాటు జరిగిన ఈ వేధింపులతో దేవా కుప్పకూలిపోయాడు. పోలీసులు సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే దేవా మరణించినట్లు వైద్యులు చెప్పారు. కేసు నమోదు చేసేందుకు పోలీసులు నిరాకరించారు. ఎనిమిది రోజుల తరువాత మెజిస్ట్రీరియల్ విచారణ తరువాత ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. నేరపూరిత హత్య (సెక్షన్ 302 ఐపిసి) వంటి తీవ్రమైన అభియోగాలు చేర్చకుండా, తక్కువ తీవ్రమైన నేరాలతో కేసు నమోదు చేశారు. ఇప్పటి వరకూ ఎవర్నీ అరెస్టు చేయలేదు. ఈ కేసులో సాక్షి అయిన గంగారామ్‌పై నాలుగు ఎఫ్ఐఆర్లు నమోదు చేసి నిర్బంధించారు. గంగారామ్ బెయిల్ పిటీషన్‌ను మధ్యప్రదేశ్ హైకోర్టు తిరస్కరించింది. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దేవా కస్టడీ మరణం కేసు వివరాలు చేసి సుప్రీంకోర్టు దిగ్భ్రాంతికి గురయింది. పోలీసులు ప్రవర్తనతోపాటు అస్పష్టంగా ఉన్న పోస్టుమార్టం నివేదికపై సందేహాలు వ్యక్తం చేసింది. దేవ దేహంపై తీవ్రమైన గాయాలు ఉన్నా, అవే మరణానికి కారణమని చెప్పడానికి బదులుగా గుండెపోటుతో అతను మరణించాడని చెప్పడాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. నిందితులైన అధికారుల్ని రక్షించడానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సుప్రీంకోర్టు ఖండించింది. ఏకైక సాక్షి అయిన గంగారామ్‌కు బెయిల్ రాకుండా అడ్డుకోవడాన్ని ప్రశ్నించింది. దేవా మృతి కేసు సిబిఐకి బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది.

చదువు విలువ



రామాపురం అనే గ్రామంలో రాజు అనే కుర్రవాడు ఉన్నాడు. పదో తరగతి ఫెయిలై బయట తిరుగుళ్లకు అలవాటు పడ్డాడు. అమ్మానాన్న ఎంత చెప్పినా వినలేదు. ఆ బడిలో ఓ మాస్టారు ఉన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులను తిరిగి చదువుకునేలా చేయడం ఆయన బాధ్యతగా తీసుకున్నారు. రాజు గురించి మాస్టారికి తెలిసింది. రాజు వాళ్లింటికి వెళ్లారు. అయితే అక్కడ రాజు లేడు.

రాజు వాళ్ల అమ్మ రాజు గురించి మాస్టారికి ఏడుస్తూ చెప్పింది. 'ఒక్కగానొక్క బిడ్డ చదువుకోకుండా మొండిగా తయారయ్యాడని, ఎలాగైనా తనలో మార్పు తెమ్మని బతిమాలింది. మాస్టారు బాగా ఆలోచించారు. రాజు ఆడుకునే స్థలం దగ్గరికి ఆయనే స్వయంగా వెళ్లారు. అక్కడ రాజు, తనకంటే వయసులో చాలా పెద్దవారితో ఆటలు ఆడుతున్నాడు. ఆ వాతావరణం చాలా అసహ్యంగా ఉంది. ఇంకొన్ని రోజులు అక్కడే, వాళ్లతో స్నేహం చేస్తే రాజు కూడా వాళ్లలాగా తయారవుతాడని మాస్టారు గ్రహించారు.

రాజు సాయంత్రం ఇంటికి వచ్చేవరకు మాస్టారు అక్కడే ఉన్నారు. రాజుకి ఏం అర్థం కాలేదు. మాస్టారిని అలా నిలబెట్టడం ఎందుకో రాజుకి నచ్చలేదు. స్నేహితులతో ఆడేవాడు కాస్త మధ్యలోనే ఆట ఆపేసి మాస్టారి దగ్గరికి వచ్చాడు.

మాస్టారు రాజుని దగ్గరకి తీసుకుని 'ఏం రాజు ఆట మధ్యలోనే ఆపేశావు?' అని అడిగారు. 'మీరు నాకోసం వచ్చి అలా నుంచోవడం నచ్చలేదు. అందుకే కలుద్దామని వచ్చా' అన్నాడు రాజు. 'చూడు రాజు.. నేను నీలాంటి పిల్లల్లో మార్పు తేవడం కోసం ఎంతసేపైనా నిలబడతాను. మీరు చదువు విలువ తెలుసుకునే వరకు మీవెంట పడతాను. ఎందుకంటే మీ జీవితాలను మార్చేది చదువొక్కటే. బాగా చదివితేనే మీరు, మీ కుటుంబాలు బాగుపడతాయి. నువ్విలా తయారైతే అమ్మానాన్న ఎంతో బాధపడుతున్నారు. చదువుకోకపోతే నువ్వు పెద్దాయ్యాక చాలా కష్టపడాలి. నీకు ఆ కష్టం రాకూడదనే అమ్మానాన్న, మాలాంటి మాస్టార్లు నీకు చెబుతాం' అని అన్నారు. మాస్టారి మాటలు రాజుకు బాగా నచ్చాయి.

మాస్టారితో ఇంటికి వచ్చిన రాజు, తరువాతి రోజు నుండి రోజూ స్కూలికి వెళ్లాడు. బాగా చదువుకున్నాడు. పదో తరగతి పరీక్షలు మళ్లీ రాశాడు. ఈసారి మంచి మార్కులతో పాసై అమ్మానాన్నని, మాస్టారిని సంతోషపెట్టాడు. ఉన్నత చదువులు చదివి మంచి స్థితిని సాధించాడు.

- యం. కౌశిక్,
9వ తరగతి,
జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల,
కొండపాక.

సరికొత్తగా 'సమ్మర్ క్లాసెస్'

హాయ్ ఫ్రెండ్స్,

మేము విజయవాడ మధురానగర్‌లోని ఎస్ఎస్ఎస్ కోచింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా కార్యక్రమాల్లో కొన్ని రోజులుగా పాల్గొంటున్నాం. ఇక్కడ పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి. డ్రాయింగ్, పెయింటింగ్, సంగీతం, నృత్యం, క్రీడలు, ఇతర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మా మాస్టారు కె.నరేంద్రకుమార్ సార్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ తరగతులు దోహదపడుతున్నాయి. క్రీడలు, యోగా, ఇతర ఫిట్‌నెస్ కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారు. ఎన్నో సృజనాత్మక విషయాలు తెలియజేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీతోపాటుగా మిగతా సబ్జెక్టులను సులువుగా చదవటం, గుర్తుపెట్టుకోవటం ఎలాగో వివరిస్తున్నారు. జనరల్ నాలెడ్జ్, క్విజ్ వంటి విషయాలపై అవగాహన కలిగేలా ప్రోత్సహిస్తున్నారు. సింపుల్ మేథ్స్ గురించి ప్రతిరోజూ కొత్త తరహాలో చెబుతున్నారు. ఫజిల్స్, డ్రాయింగ్ గీయటంలో మెళకువలు నేర్పిస్తున్నారు. కథలు చెప్పటం, మాతో చెప్పించటం వంటివి కూడా చేయిస్తున్నారు.

కె.మహిధర్

ఆశా సుహాన


ఎస్‌కె ఆల్తఫ్

- ఎస్‌కె అల్తఫ్, 10వ తరగతి,
కె.మహిధర్, ఎస్‌కె ఆశా సుహాన,
7వ తరగతి,
మధురానగర్.

బొమ్మల కొలువు

డి.చంద్రలేఖ,
6వ తరగతి,
యం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాల,
మహానంది(మం), నంద్యాల జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com 83329 25496

జీవన సౌరభం

ఆలోచించి తీసుకున్న నిర్ణయం, కష్టపడి తెచ్చుకున్న అవకాశం, ఓటమి తర్వాత వచ్చే అనుభవం, గొప్ప వ్యక్తిత్వం వల్ల వచ్చే అభిమానం ఎప్పటికీ వృథా పోవు.

వేసవి ఆటలు.. సరదాగా పిల్లలు

ఏడాది మొత్తం పుస్తకాలతో కుస్తీ పడిన విద్యార్థులు వేసవిలో కొన్ని క్రీడలను నేర్చుకోవటం ద్వారా చక్కని ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. వారిలో సృజనాత్మకత పెంచొచ్చు. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తూ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంచుకుంటారు. ఐక్యతాభావాన్ని మరింత పెంచుకోగలుగుతారు.

వేసవి ఆటవిడుపుతో ఖాళీ స్థలాలు, క్రీడామైదానాలు కిక్కిరిసి ఉంటున్నాయి. విద్యాసంవత్సరం మొత్తంగా చదువుతో కుస్తీ పడిన చిన్నారులు వేసవిలో ఆట విడుపుకోసం అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. చాలామంది పిల్లలు అనేక రకాల ఆటలపై మక్కువ చూపుతున్నారు. ఇందులో సింహభాగం క్రికెట్ ఆటపైనే పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. పల్లెటూర్లు, పట్టణాలు, నగరాల్లో ఎక్కడ చూసినా క్రికెట్ మ్యాచ్‌ల జోరు కొనసాగుతోంది. ఇవే కాకుండా చదరంగం, ఖోఖో, మార్షల్ ఆర్ట్స్, డ్యాన్స్, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్ వంటి ఆటలతో పిల్లలు క్షణం తీరిక లేకుండా గడిపేస్తున్నారు. ఓ పక్క ఆటలాడుకుంటూనే ప్రస్తుతం పదో తరగతికి వెళ్లనున్న విద్యార్థులు సెలవుల్లో సిలబస్‌పై పట్టు సాధించి మెరుగైన ఫలితాల సాధనపై దృష్టిసారిస్తున్నారు. మరి కొందరు చిత్రలేఖనం, స్విమ్మింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ పరిజ్ఞానంపై దృష్టిసారించారు. తల్లిదండ్రులు కూడా తమపిల్లలకు ఇష్టమైన రంగంలో శిక్షణలు ఇప్పించటానికి ముందుకొస్తే పిల్లలు మరింత మెరికలుగా తయారవుతారు. పిల్లలు ఆటల్లో పాల్గొనటం, నేర్చుకోవటం ద్వారా సృజనాత్మకతను పెంచుకుంటారు. పిలల్లో సామాజిక దృక్పథం పెంపొందుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ఆయా జిల్లాల వ్యాప్తింగా వేసవి శిక్షణా శిబిరాలు కొనసాగుతున్నాయి. వీటిలో నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు చిన్నారులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఆయా క్రీడాంశాల్లో చిన్నారులు ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తులో ఉపయోపడే క్రీడలు, పట్టు సాధించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. అలాంటి వాటిలో కొన్నింటిని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

తైక్వాండో : ఇదొక ఆత్మరక్షణ యుద్ధకళ. పాదం, పిడికిలి ఉపయోగించే విధానం. ఇది కేవలం చేయి, పాదాల ద్వారా చేస్తారు. మంచి ఆలోచనా విధానం అలవడుతుంది. స్వీయ క్రమశిక్షణ వస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. శరీరం, మనస్సు మధ్య సమతుల్యత ఏర్పడుతుంది. శారీరక, మానసిక ఆరోగ్యం పెరుగుతుంది. ఆత్మవిశ్వాసంతో క్రమశిక్షణ పాటిస్తూ జీవితంలో ఉన్నతులుగా ఎదుగుతారు. నాలుగేళ్ల వయస్సున్న పిల్లల నుంచి ఇంటర్ విద్యార్థులు సైతం ఇందులో తైక్వాండోలో శిక్షణ పొందొచ్చు.

కరాటే : కరాటేలో శిక్షణ తీసుకోవటం వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత ఏర్పడుతుంది. అంతేకాకుండా రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా వారి పనులను వారు చురుగ్గా చక్కబెట్టుకుంటారు. చదువుతో ఏకాగ్రత, క్రమశిక్షణ అలవడుతుంది. ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే సమస్యలను అధిగమించే నైపుణ్య సాధనలో శిక్షణ సహాయపడుతుంది.

క్రికెట్ : విద్యార్థులు ప్రస్తుతం అత్యంతగా ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే చాలు బ్యాట్, బాల్ పట్టుకొని గల్లీలో క్రికెట్ ఆడే పిల్లలు చాలామంది కన్పిస్తుంటారు. ఫ్రెండ్స్ కలిస్తే గ్రౌండ్‌కు వెళ్లి క్రికెట్ ఆడుతూనే ఉంటారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఇదే సందడి. పైగా ఐపిఎల్ మ్యాచ్‌లు కూడా కొనసాగుతుండటంతో పిల్లలు మరింతగా ఆసక్తిని పెంపొందించుకుంటున్నారు. గల్లీల్లోనైతే తాటిమట్టలు, చెక్క బ్యాట్‌లతో కూడా క్రికెట్ ఎంచక్కా ఆడేస్తున్నారు. అంతగా ఈ క్రికెట్ ఆట ఆదరణ పొందింది. ఈ ఆట ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. శారీరక దృఢత్వం, జట్టుగా పనిచేసే గుణం అలవడుతుంది.

స్విమ్మింగ్ : పిల్లలకు ఈత (స్విమ్మింగ్) నేర్చుకోవటం ఎంతో సరదా. ఈత నేర్చుకోవటం కూడా ఓ నైపుణ్యం. అందువల్ల నేర్చుకోవటం చాలా అవసరం కూడాను. పిల్లలకు ఈత నేర్పే శిబిరాలు కూడా చాలా ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని ప్రభుత్వ, మరికొన్ని ప్రయివేటు సంస్థలు నామమాత్రపు రుసుంతో స్మిమ్మింగ్‌లో శిక్షణనిస్తున్నాయి. పిల్లలు ఈత నేర్చుకునేందుకు ఈ స్విమ్మింగ్ శిక్షణలు ఎంతగానో దోహదపడతాయి. ఈత నేర్చుకోవటం ద్వారా తమను తాము రక్షించుకునే మానసిక దృఢత్వం అలవడుతుంది. అంతేకాకుండా బావులు, నదులు, సముద్రాల వద్దకు పిక్నిక్, ప్రయాణాలకు వెళ్లినప్పుడు స్విమ్మింగ్ వచ్చివుంటే నీటి ప్రమాదాల నుంచి బయటపడొచ్చు.

ఖోఖో : గ్రామీణ ప్రాంత క్రీడల్లో అతిముఖ్యమైన చెప్పుకోదగిన క్రీడ ఖోఖో. గత కొన్ని దశాబ్దాలుగా ఈ క్రీడకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ ఆటకు ఎలాంటి పరికరాలు అవసరం లేదు. సులభంగా ఆడుకోగల స్వాభావికమైన ఆట. ఈఆట ద్వారా పిల్లల్లో శారీరక సామర్థ్యం పెరుగుతుంది. సమర్థత శక్తి అలవడుతుంది. పనిలో వేగాన్ని పెంపొందిస్తుంది. శరీరంలో రక్త ప్రసరణ పెరిగి, ఆరోగ్యం మెండుగా మారుతుంది. ఈ ఆటలో పాల్గొనే క్రీడాకారుల సంఖ్య కూడా ఎక్కువ కావటం వల్ల జట్టుగా పనిచేసే, కలివిడితనంగా ఉండే గుణం అబ్బుతుంది.

కబడ్డీ : గ్రామీణ ఆటల్లో కబడ్డీ ఒకటి. ఈ క్రీడకు కాస్త ఆదరణ తగ్గిన సమయంలో ప్రో కబడ్డీతో ఇప్పుడిప్పుడే ఆదరణ పెరగటం ప్రారంభమైంది. ఇది జట్టుగా ఆడే క్రీడ. ఈ ఆటతో శరీర దృఢత్వం పెరగటంతపాటుగా వేగంగా ఆడే ఆటకావటంతో రక్త ప్రసరణ వృద్ధి చెందుతుంది. ఎముకలు బలపడతాయి. ప్రస్తుతం ఐపిఎల్ మ్యాచ్‌ల్లాగా గ్రామీణులు నేడు ప్రొకబడ్డీ పోటీలను టివిలకు అత్కుపోయి చూస్తున్నారంటే నేడు ఈక్రీడకు క్రికెట్ మ్యాచ్‌కంటే ఆదరణ పెరుగుతుందనడంలో సందేహంలేదు.

చదరంగం : పిల్లల్లో మేథస్సుకు పనిచెప్పే ఆటల్లో చదరంగం ముఖ్యమైనది. ఈ క్రీడతో పిల్లల్లో సమయస్ఫూర్తి, ఆలోచనాశక్తి, సమస్యకు పరిష్కారం చేసే నైపుణ్యం అలవడుతుంది. ఇంటి వద్దనే పిల్లలు శిక్షకుడి సహాయంతో ఈ ఆటను నేర్చుకోవచ్చు. **క్యారమ్స్:** ఏకాగ్రతతో లక్ష్యానికి ఎలా గురిపెట్టాలో నేర్పే ఆట ఇది.

వేసవిలో వాకింగ్, పరుగు తీయటం వల్ల చక్కని శరీర ఆకృతి ఏర్పడుతుంది. ప్రతిరోజూ కొంతదూరం నడక, పరుగెత్తడం ఆరోగ్యానికి చాలామంచిది. **ఆల్ ది బెస్ట్...పిల్లలూ...సెలవు రోజులను సద్వినియోగం చేసుకోండి.**

– సిహెచ్ మహేష్
బ్లాక్ బెల్ట్ 6వ డాన్,
కెఎఐ రిఫరీ–ఎ,
ఎపిఎస్‌కెఎ,
మంగళగిరి,
గుంటూరు జిల్లా.

జూన్‌లో సినిమా థియేటర్లు బంద్!

ఈ ఏడాది వేసవికి కూడా పెద్ద సినిమా విడుదలలు లేవు. జూన్‌లో కూడా చాలా తక్కువగా ఉన్నాయి. థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరగటం లేదు. దీంతో థియేటర్ల యజమానులు గతేడాది మాదిరిగానే షోలు నడకకుండా హాళ్లు మూసేయటమే మేలనే నిర్ణయానికి వచ్చేశారు. జూన్ ఒకటో తేదీ నుంచి థియేటర్లను బంద్ చేస్తామని ఇప్పటికే తెలుగు రాష్ట్రాల ఎగ్జిబిటర్లు వెల్లడించారు. దీంతో జూన్‌లో ఆ నెలలో విడుదలయ్యే సినిమాలపై ఈ ప్రభావం ఉండనుంది. ఈ నేపథ్యంలోనే మరోసారి ఈ విషయంపై సమావేశం నిర్వహించారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల డిమాండ్లపై ఫిల్మ్ ఛాంబర్‌లో చర్చించారు. శుక్రవారంనాడు మరోసారి ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో సంయుక్త సమావేశం నిర్వహించాలని నిర్మాతలు నిర్ణయించారు. ఈ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లను అద్దె విధానంలో నడుపుతున్నారు. దీని వల్ల తాము నష్టపోతున్నామని ఎగ్జిబిటర్లు వాదిస్తున్నారు. అందుకే పర్సంటేజీ రూపంలో చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విధానం అమలు చేయకపోతే జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేస్తామని ప్రకటించారు. అయితే తాజా సమావేశంలో పర్సంటేజీ విధానంపై కొందరు నిర్మాతలు మొగ్గు చూపగా.. మరికొందరు ఓకే చేయలేదని సమాచారం. ఈ సమావేశంలో టాలీవుడ్ నిర్మాతలు ఎఎంరత్నం, దిల్‌రాజు, సురేష్‌బాబు, మైత్రీ రవిశంకర్, స్రవంతి రవికిశోర్, చదలవాడ శ్రీనివాసరావు, డీవీవీ దానయ్య, సాహు గారపాటి, బాపినీడు, నాగవంశీ పాల్గొన్నారు.

కేన్స్‌లో 'విశ్వంభర' బుక్ విడుదల

చిరంజీవి ప్రధాన పాత్రలో వశిష్ఠ దర్శకత్వంలో రానున్న చిత్రం 'విశ్వంభర'. సోషియో ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ సినిమా రానుంది. తాజాగా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఈ సినిమాకు సంబంధించిన పుస్తకాన్ని నిర్మాత విక్రమ్ విడుదల చేశారు. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఫొటోలు పంచుకుంది. 'విశ్వంభర' ప్రపంచం మీ ముందుకు ఓ అద్భుతాన్ని తీసుకురానుంది. ఈ పుస్తకంలో ఏం ఉందో తెలుసుకోవాలంటే వేచి ఉండండి' అని తెలిపింది. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రేక్షకులకు వెల్లడించనున్నారు. ఈ సినిమా కోసం 13 భారీ సెట్‌లతో ఓ ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించారు. ఇంతకుముందెన్నడూ చూడని సరికొత్త అవతారంలో చిరంజీవి కనిపించనున్నారు. ఇప్పటివరకూ ఆయన నటించిన సినిమాలతో పోలిస్తే, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై దాదాపు రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌తో 'విశ్వంభర' తీర్చిదిద్దుతున్నట్లు టాక్.

ఇక్కడే 'పెద్ది' షూటింగ్

రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా డైరెక్షన్‌లో రూపొందుతున్న 'పెద్ది' సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో ఒక భారీ గ్రామీణ సెట్‌లో చేస్తున్నారు. ఈ సెట్‌లో ప్రస్తుతం కీలక షెడ్యూల్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో ఒక హై యాక్షన్ సీన్‌తో పాటు కొంత టాకీ భాగం చిత్రీకరణ జరగనుందని సమాచారం. ఈ సెట్‌లో గ్రామీణ వాతావరణాన్ని అత్యంత సహజంగా రీక్రియేట్ చేసినట్లు తెలుస్తోంది, ఇది సినిమాకు ఒక ప్రత్యేకమైన ఆకర్షణను జోడిస్తుందని మేకర్స్ నమ్ముతున్నారు. తాజాగా, సినిమా టీం సెట్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ చిత్రాల్లో రామ్ చరణ్‌తో పాటు దర్శకుడు బుచ్చిబాబు సానా, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ (మున్నాభాయ్ ఫేమ్) కలిసి కనిపించారు. దివ్యేందు శర్మ ఈ సినిమాతో తెలుగు సినిమాలోకి అడుగుపెడుతున్నారు. ఈ సినిమాలో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌తో పాటు కన్నడ నటుడు శివరాజ్‌కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా 1980ల నాటి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ నేపథ్యంలో సాగుతూ, క్రీడల ద్వారా సమాజాన్ని ఏకం చేసే ఒక యువకుడి కథను చెబుతుందని తెలుస్తోంది. రామ్ చరణ్ ఈ చిత్రంలో క్రికెటర్‌గా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం ఆయన ఆస్ట్రేలియాలో ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నట్లు సమాచారం.

బాహుబలి.. ఆర్‌ఆర్‌ఆర్‌దే హవా...

దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ మూవీ ఆర్‌ఆర్‌ఆర్. రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్, ఆలియాభట్ ప్రధాన పాత్రల్లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పలు రికార్డులు సృష్టించింది. ఇంకా ఆ ఒరవడిని కొనసాగిస్తూనే ఉంది. ఇటీవల ఈ మూవీని లండన్‌లో ప్రముఖ రాయల్ ఆల్బర్ట్ హాలులో ప్రదర్శించారు. ఈ ప్రత్యేక స్క్రీనింగ్‌కు రాజమౌళితోపాటు రామ్‌చరణ్, ఎన్టీఆర్ కూడా కుటుంబంతో కలిసి హాజరయ్యారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాహుబలి తర్వాత ఆ ఘనతను దక్కించుకున్న చిత్రంగా ఆర్‌ఆర్‌ఆర్ నిలిచింది. రాయల్ ఆల్బర్ట్ హాలు స్థాపించి ఇప్పటివరకూ 154 ఏళ్లు పూర్తయ్యింది. ఈ హాలు స్థాపించాక ప్రదర్శించిన సినిమాల్లో ఇప్పటివరకు కేవలం బాహుబలి మాత్రమే నాన్ ఇంగ్లీష్ చిత్రంగా రికార్డ్ సృష్టించింది. 2019లో బాహుబలి మూవీని ఇదే హాలులో ప్రదర్శించారు. 2025లో ఆర్‌ఆర్‌ఆర్ ఈ ఘనతను సాధించి రెండో నాన్ ఇంగ్లీష్ మూవీగా నిలిచిందవి. ఈ విషయాన్ని మూవీ టీమ్ సోషల్‌మీడియా వేదికగా పంచుకుంది. దీంతో టాలీవుడ్ అభిమానులు సంతోషాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఈ ఘనత అంతా రాజమౌళికే దక్కుతుందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. రాజమౌళి ప్రస్తుతం మహేష్‌బాబుతో ఓ భారీ అడ్వెంచరస్ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే ఒడిశాలో తొలిషెడ్యూల్ పూర్తయ్యింది. కొన్ని రోజుల తర్వాత మలి షెడ్యూల్ హైదరాబాద్‌లో జరగనుంది. ఇప్పటికే షూటింగ్‌లో బాలీవుడ్ కథానాయిక ప్రియాంక చోప్రా పాల్గొన్నారు. ప్రస్తుతం షూటింగ్‌కు విరామం లభించటంతో రాజమౌళి లండన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

మిచెల్ మార్ష్ శతకం..

- **గుజరాత్‌పై లక్నో గెలుపు**

అహ్మదాబాద్: ఐపీఎల్ 2025లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ విజయం సాధించింది. లక్నో విధించిన 236 పరుగులు చేధనలో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 202 పరుగులు మాత్రమే చేసింది. దీంతో లక్నో 33 పరుగులతో విజయం సాధించింది. లక్ష్య చేధనలో గుజరాత్ జట్టులో షారుఖ్‌ఖాన్ అర్థ సెంచరీతో (57 పరుగులు, 29 బంతుల్లో మూడు సిక్సులు, ఐదు ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగిలిన బ్యాటర్లు లక్ష్యానికి తగినట్లుగా బ్యాటింగ్ చేయలేకపోయారు. లక్నో బౌలర్లలో విలియం ఓ రూర్క్ మూడు వికెట్లు సాధించాడు. ఆయుష్ బదోని, అవేశ్ ఖాన్ చెరో రెండు వికెట్లు సాధించారు. అకాశ్ మహరాజ్, షాబాజ్ అహ్మద్ తలా ఒక్క వికెట్ దక్కించుకున్నారు. దీంతో గుజరాత్ ఓటమి చెందింది. అయితే గుజరాత్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకూ 13 మ్యాచ్‌లు ఆడిన గుజరాత్ 18 పాయింట్లతో టాప్‌లో ఉంది. లక్నో ఈ విజయంతో మొత్తం 13 మ్యాచ్‌ల్లో 12 పాయింట్లు సాధించింది.

గురువారం మ్యాచ్‌లో ముందుగా గుజరాత్ ఫిల్డింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నో భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (117, 64 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సలు) 'శత'క్కొట్టాడు. నికోలస్ పూరన్ (56, 27 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సలు) మెరుపు అర్ధ శతకంతో విరుచుకుపడ్డాడు.నాటౌట్‌గా నిలిచాడు. ఓపెనర్లు మార్‌క్రమ్ (36), మార్ష్ తొలి వికెట్‌కు 91 పరుగులు జోడించగా..తరువాత మార్ష్, పూరన్ రెండో వికెట్‌కు 121 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. గుజరాత్ బౌలర్లలో అర్షద్, సాయికిశోర్ చెరో వికెట్ తీశారు.

పికిల్‌బాల్ టోర్నీకి నాగ మోక్ష ఎంపిక



హైదరాబాద్ : తెలంగాణ యువ పికిల్‌బాల్ క్రీడాకారిణి నాగ మోక్ష ఆసియా పోటీలకు ఎంపికైంది. వియత్నాం వేదికగా జులైలో జరుగనున్న ఆసియా పికిల్‌బాల్ జూనియర్ ఓపెనర్ చాంపియన్‌షిప్‌లో నాగ మోక్ష పోటీపడనుంది. భారత జూనియర్ జట్టు తరపున నాగ మోక్ష ప్రాతినిథ్యం వహించనుందని ఆల్ ఇండియా పికిల్‌బాల్ అసోసియేషన్ (ఏఐపీఏ) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇటీవల నిలకడగా రాణించి నాగ మోక్ష జాతీయ జట్టులో చోటు సాధించటంపై కుటుంబ సభ్యులు, పికిల్‌బాల్ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

బెతెల్ స్థానంలో సీఫర్ట్

- **రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ నిర్ణయం**

బెంగళూరు: ఐపీఎల్2025లో ప్లే ఆఫ్స్‌కు చేరుకుని టాప్–2లో చోటు కోసం ప్రయత్నిస్తున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ (ఆర్‌సీబీ).. లీగ్ దశ ముగిశాక ఫామ్‌లో ఉన్న ఇంగ్లాండ్ ఓపెనర్ జాకబ్ బెతెల్ సేవలను కోల్పోనుంది. స్వదేశంలో వెస్టిండీస్‌తో వైట్‌బాల్ సిరీస్ నేపథ్యంలో బెతెల్ ఇంగ్లండ్ తిరిగి వెళ్లనున్నాడు. దీంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ బెతెల్ స్థానాన్ని న్యూజిలాండ్ ఆటగాడు టిమ్ సీఫర్ట్‌తో భర్తీ చేసింది. శుక్రవారం సన్‌రైజర్స్‌తో లక్నోలో జరుగబోయే మ్యాచ్ బెతెల్‌కు ఈ సీజన్‌లో చివరి మ్యాచ్ కానుంది.

క్వార్టర్స్‌కు శ్రీకాంత్

- **మలేషియా మాస్టర్స్ ఓపెన్**

కౌలాలంపూర్: పురుషుల సింగిల్స్ మాజీ వరల్డ్ నం.1 కిదాంబి శ్రీకాంత్ ఎట్టకేలకు గాడిలో పడ్డాడు. మలేషియా మాస్టర్స్ ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో అర్హత రౌండ్ నుంచి మెరుపు విజయాలు సాధించిన కిదాంబి శ్రీకాంత్.. ప్రధాన టోర్నమెంట్‌లోనూ అదే సత్తా చాటుతున్నాడు. మెయిన్ డ్రాలో వరుసగా రెండో విజయం సాధించిన కిదాంబి శ్రీకాంత్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్నాడు. కిదాంబి శ్రీకాంత్ 23–21, 21–17తో వరుస గేముల్లో నట్ ఎంగ్యుయెన్ (ఐర్లాండ్)ను మట్టికరిపించాడు. శ్రీకాంత్ మెరిసినా.. మెన్స్ సింగిల్స్‌లో ఇతర షట్లర్లు మాత్రం ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగారు. హెచ్ఎస్ ప్రణయ్, ఆయుష్, సతీష్ కుమార్ కరుణాకరన్ నిరాశపరిచారు. తొలి రౌండ్లో సంచలన విజయాలు సాధించిన ప్రణయ్, ఆయుశ్ ప్రీ క్వార్టర్స్‌లో అంచనాలను అందుకోలేదు. జపాన్ షట్లర్ యుషి తనక చేతిలో 9–21, 18–21తో ప్రణయ్ ఓటమి చెందాడు. ఫ్రాన్స్ షట్లర్ టోమ చేతిలో 13–21, 17–21తో ఆయుశ్ శెట్టి పరాజయం పాలయ్యాడు. ఫ్రాన్స్‌కే చెందిన మరో షట్లర్ చేతిలో సతీశ్ కరుణాకరన్ 9–21, 14–21తో భంగపాటుకు గురయ్యాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో–ధవ్ కపిల 21–17, 18–21, 21–15తో లియ పలెర్మో–జులియన్ (ఫ్రాన్స్)ను చిత్తు చేసి క్వార్టర్స్‌కు అర్హత సాధించారు.

ఇంగ్లాండ్‌కు సూర్యవంశీ, అయుశ్

- **అండర్–19 జట్టుకు ఎంపికైన యువ స్టార్స్**

ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడిన తొలి సీజన్‌లో అంచనాలకు మించి రాణించిన యువ క్రికెటర్లు వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రెలకు ఆల్ ఇండియా బీసీసీఐ సెలక్షన్ కమిటీ అదిరే అవకాశం అందించింది. భారత సీనియర్ మెన్స్, సీనియర్స్ ఉమెన్స్, భారత్–ఏ మెన్స్ జట్టుతో పాటు టీమ్ ఇండియా అండర్–19 మెన్స్ టీమ్ సైతం ఇంగ్లాండ్‌కు వెళ్లనుంది. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే భారత అండర్–19 జట్టును బీసీసీఐ గురువారం ప్రకటించింది. ఈ జట్టులో ఐపీఎల్ స్టార్స్ వైభవ్ సూర్యవంశీ, ఆయుశ్ మాత్రెలకు చోటు దక్కింది. చెన్నై సూపర్ కింగ్స్ సారథి రుతురాజ్ గైక్వాడ్ గాయపడటంతో అతడి స్థానంలో వచ్చిన ఆయుష్.. తనదైన ఆటతీరుతో ఆ జట్టు భావి ఓపెనర్‌గా ప్రశంసలందుకున్నాడు. ఇక ఐపీఎల్‌లో 14 ఏండ్లకే అరంగేట్రం చేయడంతో పాటు గుజరాత్‌తో మ్యాచ్‌లో 35 బంతుల్లోనే శతకం బాదిన వైభవ్‌నూ సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. ఇంగ్లాండ్ అండర్–19, భారత్ అండర్–19 జట్ల పోరు జూన్ 24 నుంచి ఆరంభం కానుండగా.. ఆయుశ్ మాత్రె కెప్టెన్‌గా ఎంపికయ్యాడు.

భారత అండర్–19 జట్టు : ఆయుశ్ మాత్రె (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, మౌల్యరాజసిన్హ, రాహుల్ కుమార్, అభిగ్యాన్ (వైస్ కెప్టెన్), హర్వాన్ష్ సింగ్, ఆర్ ఎస్ అంబరిశ్, కనిష్క్ చౌహాన్, ప్రణవ్ రాఘవేంద్ర, మహ్మద్ ఎన్నాన్, ఆదిత్య రానా, అన్మోల్‌జీత్ సింగ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68